www.mudranews.in
సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
TELUGU DAILY
www.mudranews.in
@mudranews
mudratv
హైదరాబాద్, గురువారం, 29.01.2026
Published From : Hyderabad | Amaravathi | Vijayawada
సంపుటి : 13
సంచిక : 101
పేజీలు : 12
వెల : రూ. 5



# తల్లీ...ప్రణమిల్లి..!

## అట్టహాసంగా మేడారం కుంభమేళా ప్రారంభం

**• గద్దెనెక్కిన సారలమ్మ....**

- పగిడిద్దరాజు గోవిందరాజు ప్రతిరూపాల ప్రతిష్ఠాపన
- సారలమ్మకు అధికార లాంఛనాలతో స్వాగతం పలికిన మంత్రి సీతక్క
- డప్పు వాద్యాలు, సంప్రదాయ నృత్యాల మధ్య గిరిజన దేవతల ఆగమనం
- నేడు చిలకలగుట్ట నుంచి భరణీ రూపంలో మేడారంకు సమ్మక్క
- భక్తజనసందోహంతో కిక్కిరిసిన మేడారం
- జంపన్నవాగులో భక్తుల పుణ్య స్నానాలు
- శివసత్తుల పూనకాలు, సమ్మక్క సారలమ్మ నామస్మరణ
- నిఘా నీడలో మేడారం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
మేడారం భక్తజనసంద్రమైంది. మాఘ శుద్ధ పౌర్ణమి ఘడియల్లో ప్రారంభమైన తెలంగాణ ఆదివాసీ జాతరలో తొలి ఘట్టం ఆవిష్కృతమైంది. గిరిజన దేవత సారలమ్మ బుధవారం రాత్రి గద్దెక్కగా ఆమెతో పాటు ఆమె భర్త పగిడిగిద్ద రాజు.. ఆమె అల్లుడు గోవిందరాజు ప్రతిరూపాల ప్రతిష్టాపన అట్టహాసంగా జరిగింది. కన్నెపల్లి నుంచి సారలమ్మ, గంగారం మండలం పూను గొండ్ల నుంచి పగిడిద్దరాజు, ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామం నుంచి గోవిందరాజు ప్రతిరూపాలను ఆదివాసీ సంప్రదాయం ప్రకారం తీసుకువచ్చి గద్దెల పై ప్రతిష్ఠించారు. కాగా సమ్మక్క తనయుడు కన్నెపల్లిలో కొలువైన మిగతా 2లో

# మీరు ఏ పార్టీలో ఉన్నారు..?



- కాంగ్రెస్ లో చేరారా.? బీఆర్ఎస్ లో కొనసాగుతున్నారా..?
- ఎమ్మెల్యేలు దానం, పాడి కౌశిక్ కు స్పీకర్ నోటీసులు
- ఈ నెల 30న విచారణకు రావాలని ఆదేశాలు
- 'సుప్రీం' కోర్టు ధిక్కార నోటీసులతో చర్యలు

పార్టీ ఫిరాయింపు వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేయడంతో ఆయన కాంగ్రెస్‌లో చేరారా..? లేక బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారా..? అన్న ప్రశ్న తెరపైకి వచ్చింది. సుప్రీంకోర్టు ధిక్కార నోటీసుల నేపథ్యంలో స్పీకర్ తీసుకుంటున్న చర్యలు కీలకంగా మారాయి. 3

# 'భూధార్'తో భూ సమస్యలకు చెక్




- రెండు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా సర్వే పూర్తి: మంత్రి పొంగులేటి
- డబుల్ రిజిస్ట్రేషన్లకు చెక్... భూభారతి–రిజిస్ట్రేషన్ సింగిల్ ప్లాట్‌ఫాం
- 5500 మంది లైసెన్సుడ్ సర్వేయర్లు, అత్యాధునిక పరికరాలు
- అవుటర్ చుట్టూ 11 క్లస్టర్లలో ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ కాంప్లెక్స్‌లు
- పఠాన్ చెరులో ఆధునిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి శంకుస్థాపన
- ధరణితో పెరిగిన భూతగాదాలకు ముగింపు
- రాష్ట్ర్యవ్యాప్తంగా 2 నెలలు సర్వే .. భూ యజమానికి భూధార్ కార్డులు
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

3



# కారులో అత్యాచారం..

9

- ఎమ్మెల్యేపై మహిళ లైంగిక ఆరోపణలు
- జనసేన కఠిన నిర్ణయం
- రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై సంచలన ఆరోపణలు
- ప్రభుత్వ ఉద్యోగిని వేధింపులు, బలవంతపు గర్భస్రావాల ఆరోపణ
- బాధితురాలి వీడియోతో రాష్ట్రవ్యాప్తంగా కలకలం
- కేసు నమోదు
- మహిళా కమిషన్ జోక్యం
- అంతర్గత కమిటీ ఏర్పాటు చేసిన జనసేన అధిష్ఠానం
- విచారణ ఫలితంపైనే శ్రీధర్ రాజకీయ భవిష్యత్తు

## తొలిరోజు 902 నామినేషన్లు

- పుర ఎన్నికల్లో 890 మంది అభ్యర్థుల నామినేషన్లు
- కాంగ్రెస్ నుంచి 382
- బీఆర్ఎస్ నుంచి 258
- బీజేపీ నుంచి 169 నామినేషన్లు దాఖలు

2

# కూలిన విమానం.. డిప్యూటీ సీఎం దుర్మరణం

## ఘోర విమాన ప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మృతి

- బారమతి జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారానికి వెళ్తుండగా ప్రమాదం
- ల్యాండింగ్ సమయంలో సాంకేతిక లోపంతో అదుపు తప్పిన విమానం
- ల్యాండింగ్ సమయంలో సాంకేతిక లోపంతో అదుపు తప్పిన విమానం
- రన్‌వే సమీపంలో కుప్పకూలి మంటల్లో చిక్కుకున్న విమానం
- సంతాపం తెలిపిన సీఎం ఫడ్నవీస్.. విచారణకు ఆదేశాలు
- విమాన భద్రతపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చ

10



## గగనతల విషాదాలు.. భారతదేశం కోల్పోయిన ప్రముఖులు

అణు శాస్త్ర పితామహుడి అకాలాంత్యం (1966)
మోంట్‌బ్లాంక్ వద్ద కూలిన విమానం
సంజయ్ గాంధీ విషాద మరణం (1980)
లోక్‌సభ స్పీకర్ బలయోగి ప్రమాదం (2002)
సినీ లోకాన్ని కలిచివేసిన సౌందర్య మృతి (2004)
పారిశ్రామికవేత్త జిందాల్ హెలికాప్టర్ క్రాష్ (2005)
నల్లమలల్లో కూలిన సీఎం వైఎస్ఆర్ హెలికాప్టర్ (2009)
అరుణాచల్ సీఎం దోర్జీ ఖండు మృతి (2011)
దేశ రక్షణ వ్యవస్థకు తీరని లోటు (2021)
తాజా విషాదాలు..
ఆందోళన కలిగిస్తున్న గగనతల ప్రయాణాలు

ఇది ఏఐ ముద్ర

అట్టహాసంగా మేడారం కుంభమేళా ప్రారంభం



# దేశానికి రోల్‌మోడల్‌గా తెలంగాణ డిజాస్టర్ మేనేజిమెంట్



- రూ.100 కోట్లతో అత్యాధునిక పరికరాలు
- రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ శిక్షణా కేంద్రం
- క్షేత్రస్థాయి వరకు అడ్వాన్స్డ్ వెదర్ స్టేషన్లు ఏర్పాటు
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

# కివీస్ దంచుడు.. భారత్ బేజారు



నాలుగో టీ20లో న్యూజిలాండ్ 20 ఓవర్లలో 215 పరుగులు చేసి భారీ లక్ష్యం పెట్టింది. ఓపెనర్ల దంచుడు, చివర్లో డారిల్ మిచెల్ వేగం కివీస్ స్కోరుకు బలం అయ్యాయి. ఛేదనలో భారత్ విఫలమైంది. అభిషేక్ డకౌట్, కెప్టెన్ సూర్య 8 పరుగులకే అవుట్ కాగా మిగతా బ్యాట్స్‌మెన్ కూడా తడబడ్డారు. 129 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి భారత్ ఒత్తిడిలో పడింది.



## కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

- కరీంనగర్ లో కాంగ్రెస్ టికెట్ ఆశావహులతో మంత్రుల ముఖాముఖి భేటీ
- గెలిచే అభ్యర్థుల ఎంపికలో సమన్వయమే కీలకం : దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- కార్యకర్తల శ్రమకే తొలి ప్రాధాన్యం : జిల్లా ఇంచార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ప్రజా పాలనపై ప్రజల్లో అపూర్వ స్పందన : సంక్షేమ పథకాలతో కాంగ్రెస్ బలం – పొన్నం ప్రభాకర్
- అసంతృప్తిని పక్కనబెట్టి కాంగ్రెస్ విజయం కోసం సమిష్టి పోరాటం : మేడిపల్లి సత్యం పిలుపు

6

**ప్రపంచ ప్రసిద్ధ గొప్ప జాతరలు**

కుంభమేళా (భారతదేశం): ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక సంగమం, ఇక్కడ కోట్ల మంది భక్తులు పవిత్ర నదులలో స్నానాలు ఆచరిస్తారు. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి ప్రయాగ్‌రాజ్, హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్ అనే నాలుగు చోట్ల ఈ మేళా జరుగుతుంది.



# తల్లీ...ప్రణమిల్లి..!

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

జంపన్న సైతం వాగు ఒడ్డున ఉన్న గద్దెపైకి చేరుకున్నాడు. ఇలవేల్పులైన తల్లులకు భక్తులు జంపన్న వాగులో పవిత్ర స్నానాలాచరించి నిలువెత్తు బంగారం, పసుపు, కుంకుమ సమర్పించారు.శివసత్తులు, ఓడిబియ్యం, చీరే సారెలతో తల్లుల ముందు ప్రణమిల్లుతున్నారు. ఈ అపురూప ఘట్టాన్ని తిలకించేందుకు తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. దీంతో ఈ ప్రాంతమంతా సమ్మక్క సారలమ్మ నామస్మరణతో మారుమోగింది. కాగా ఇప్పటికే కోటి మంది భక్తులు వన దేవతలను దర్శించుకోగా నాలుగు రోజుల పాటు జరిగే ఈ జాతరకు మరో రెండు కోట్ల మంది వరకు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో పని చేసేలా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకున్నది. మంత్రులు, ఉన్నతాధికారులు మేడారంలోనే మకాం వేసి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. జాతర నిర్వహణ కోసం మొత్తం 21 శాఖలకు చెందిన 42,027 మంది అధికారులు, సిబ్బంది, మేడారం పరిసర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు. వీరికి అదనంగా రెండు వేల మంది ఆదివాసీ యువత వాలంటీర్లుగా తమ సేవలు అందిస్తున్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం జాతర ప్రాంతాన్ని 8 జోన్లుగా, 42 సెక్టార్లుగా విభజించిన అధికారులు... జోన్ కు జిల్లా స్థాయి అధికారి, సెక్టార్ కు మండల స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగించారు. ఆలయ ప్రాంగణం, గద్దెలు, జంపన్న వాగు, ఆర్టీసీ బస్టాండ్, ఊరట్టం, శివరాం సాగర్, నర్లాపూర్, పడిగాపూర్ వంటి అన్ని కీలక ప్రాంతాల్లో కంట్రోల్ రూములు, మిస్సింగ్ పర్సన్స్ క్యాంపులు, అత్యవసర స్పందన బృందాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించనున్నారు.

**అధికార లాంఛనాలతో సారలమ్మకు స్వాగతం..!**

కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించగా..ఆదివాసీ సంప్రదాయం ప్రకారం సాయంత్రం ఆరు గంటలకు సారలమ్మను కన్నెపల్లి నుంచి మేడారం గద్దెల పైకి తీసుకొచ్చారు. ఆదివాసీ పూజారులు, రాష్ట్ర



మంత్రి సీతక్క, ములుగు కలెక్టర్,ఎస్పీ,అదనపు కలెక్టర్లు, ఏఎస్పీలు కలిసి కన్నెపల్లి నుంచి సారలమ్మను మేడారంలోని గద్దెల వద్దకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క సారలమ్మకు అధికార లాంఛనాలతో స్వాగతం పలికారు. అంతకు ముందు.. ఆదివాసీ పూజారులు కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆదివాసీల సంస్కృతి, సాంప్రదాయాలను అనుసరిస్తూ కన్నెపల్లి నుంచి మేడారంలోని అమ్మవారి గద్దెల పైకి ఆ దేవతను ప్రతిష్టించడానికి సారలమ్మ కుంకుమ భరిణితో చేరుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు సారలమ్మ గద్దెల వద్ద నిలువెత్తు బంగారాన్ని భక్తులు సమర్పిస్తూ.. మొక్కులు చెల్లిస్తున్నారు.

**నేడు సమ్మక్క ఆగమనం..!**

జాతరలో కీలక ఘట్టం నేడు సాయంత్రం ఆవిష్కృతం కానుంది. సమ్మక్కను.. చిలకలగుట్ట నుంచి కుంకుమ భరణి రూపంలో తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్టించనున్నారు. అంతకు ముందు.. చిలుకలగుట్టపై ఉన్న సమ్మక్క తల్లిని పూజారులు తీసుకొచ్చే వేడుకలో లక్షల మంది భక్తులు పాల్గొంటారు.ఈ సమయంలో పోలీసులు, జిల్లా అధికారుల సమక్షంలో గాల్లోకి కాల్పులు జరిపి మరీ ఘన స్వాగతం పలుకుతారు.

**నేడు వనదేవతలందరీ కొలువు..**

నేడుసమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవింద రాజు, జంపన్న అంతా గద్దెలపై కొలువై భక్తులకు దర్శనమిస్తారు. ఈ సమయంలోనే లక్షలాది భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. ఈ నెల 31 దేవతలిద్దరూ వన ప్రవేశం చేస్తారు.

**గంటన్నర పాటు రహస్య పూజలు**

సారాలమ్మ బుధవారం రాత్రి గద్దెపై చేరనున్న సందర్భంలో వేలాది మంది భక్తులు అమ్మవారి దీవెనల కోసం కన్నెపల్లికి చేరుకున్నారు. అదే సమయంలో ప్రధాన పూజారి సారయ్య గుడిలోకి ప్రవేశించి రహస్య పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సామాన్య ప్రజలు ఇతర వ్యక్తులు గుడి సమీపంలోకి చేరకుండా అభ్యుదయ సంఘం సభ్యులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసుకోగా జిల్లా పోలీసు యంత్రాంగం మూడు అంచెల భద్రతను ఏర్పాటు చేసింది. ప్రధాన పూజారీ సారయ్య తన ఇంటి నుండి బయలు దేరుతున్న సమయంలో భక్తులు ఎదుర్కొని అమ్మవారి దీవెనల కోసం సాష్టాంగ నమస్కారం చేసి ఎదురుగా నిలబడ్డారు. ఈ సందర్భంలో ప్రధాన పూజారిని తాకకుండా పోలీసులు, అభ్యుదయ సంఘ సభ్యులు పర్యవేక్షించారు. నాలుగు గంటల సమయంలో ఆలయంలో చేరుకున్న సారయ్య దాదాపు గంటన్నర పాటు రహస్య పూజలు నిర్వహించిన అనంతరం కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య తన సోదరుడు జంపన్నను ముద్దాడి గద్దెపైకి చేరుకున్నారు. తొలి ఘట్టం బుధవారం రాత్రితో ముగుస్తుండడంతో తదుపరి ఘట్టం మహాదేవత అయిన సమ్మక్కను నేడు సాయంకాలం గద్దెపై చేర్చనున్నారు. దీంతో పూర్తి స్థాయిలో వనదేవతలు గద్దెలపై ప్రతిష్ఠించిన అనంతరం నిండు పండుగ జరగనున్నది.

**బండెనక బండి కట్టి..!**

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం కేంద్రం ప్రజలు సమ్మక్క సారలమ్మ జాతరకు ప్రతిసారి ఎండ్లబండ్లపై రావడం ఆనవాయితీగా మారింది. ఆ మండలంలో పూర్వీకుల నుంచీ ఈ జాతరకు ఎండ్ల బండి కట్టుకుని పిల్లాపాపలతో కుటుంబ సమేతంగా కలిసి వస్తున్నామని, ఇప్పుడు తామూ అదే అనుసరిస్తున్నామని భక్తులు చెబుతున్నారు. ఒకప్పుడు మేడారం జాతరకు.. వరంగల్, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్ నుంచీ వేలాది మంది భక్తులు ఎడ్ల బండి కట్టుకుని గోదావరి దాటి వచ్చేవారని వివరిస్తున్నారు.

## మేడారం జాతరలో స్వల్ప తొక్కిసలాట

మేడారం జాతరలో భక్తుల రద్దీతో స్వల్ప తొక్కిసలాట చోటు చేసుకుంది. దర్శన క్యూ లైన్లలో తోపులాట జరగడంతో పలువురు మహిళలు, వృద్ధులు కిందపడిపోయారు. ఈ ఘటనలో ఓ మహిళ తలకు తీవ్రగాయం కావడంతో అక్కడే ఉన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్ స్పందించి ఆమెను ఆసుపత్రికి తరలించారు. భారీగా తరలివచ్చిన భక్తులతో క్యూలైన్లు కిక్కిరిసిపోవడంతో కొంతసేపు ఉద్రిక్తత పరిస్థితి చోటు చేసుకుంది. దీంతో భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కొందరు కన్నీటి పర్యంతరమయ్యారు. దర్శనానికి సమీప ప్రాంతాల్లో దుకాణాల కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా నేడు మేడారం జాతరకు కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జుయల్ ఓరం హాజరు కానున్నారు. ఢిల్లీ నుంచి నేరుగా మేడారంకు చేరుకుని వనదేవతలకు పూజలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్‌కుమార్ కార్యాలయం వెల్లడించింది,



# తొలిరోజు 902 నామినేషన్లు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

వచ్చే నెల పదకొండో తేదిన రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ఘట్టం బుధవారం మొదలైంది. తొలిరోజు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు జరగనున్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలో 890 మంది అభ్యర్థులు.. మొత్తం 902 నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో కాంగ్రెస్ నుంచి 387, బీఆర్ఎస్ నుంచి 258, బీజేపీ నుంచి 169 మంది నామినేషన్లు దాఖలు చేశారు. మూడు ప్రధాన పార్టీ నుంచి మొత్తం 809 నామినేషన్లు దాఖలు కాగా మిగిలిన అభ్యర్థులు ఇండిపెండెంట్లుగా నామినేషన్లు వేశారు. రాష్ట్రవ్యాప్తంగా 2,996 వార్డుల్లో ఈ నామినేషన్లు స్వీకరణ కార్యక్రమం కొనసాగుతున్నది. కాగా ఈ నెల 30 వరకు నామినేషన్ల స్వీకరణ ఉన్న నేపథ్యంలో ప్రధాన పార్టీలన్నీ గెలుపు గుర్రాల అన్వేషణలో పడ్డారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తి కాకముందే బలమైన అభ్యర్థులను రంగంలో దింపేందుకు వ్యూహాత్మక అడుగులు వేస్తున్నాయి. ఇదీలావుంటే రాష్ట్రంలో పోటీకి సిద్ధమని ప్రకటించిన జనసేన పార్టీ ప్రధాన పార్టీలను ఢీ కొట్టేలా ప్రణాళికలు రూపొందిస్తున్నది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాల వారీగా మున్సిపల్ ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీలను ప్రకటించింది. శంకర్ గౌడ్ (రంగారెడ్డి), సాగర్ ఆర్కే నాయుడు (కరీంనగర్ ) రాధారాం రాజలింగం (మెదక్), ముమ్మారెడ్డి ప్రేమకుమార్ (మహబూబ్‌నగర్), మడి రెడ్డి దామోదర్ రెడ్డి (వరంగల్), మేకల సతీష్ రెడ్డి (నల్గొండ), మిరియాల రామకృష్ణ (ఖమ్మం), మాచ సుధాకర్ (నిజామాబాద్), మంథని సంపత్ కుమార్ (ఆదిలాబాద్) లను సభ్యులుగా ప్రకటించింది. మరోవైపు.. ఈ పార్టీ పెద్దపల్లిలో పార్టీ తొలి నామినేషన్ వేసింది. పెద్దపల్లి 9వ వార్డు కౌన్సిలర్ గా పోటీ చేస్తున్న జనసేన పార్టీ అభ్యర్థి సుమ యాదవ్ రాజు నామినేషన్ దాఖలు చేశారు.

# ప్రభుత్వం చేతిలో ఎస్ఈసీ కీలుబొమ్మ

- **బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు**
- **హడావిడిగా మున్సిపల్ ఎన్నికలెందుకూ...?**
- **ఈ ఎన్నికలు ప్రజాస్వామ్య పండుగా? లేక అధికార పార్టీ కుట్రా?నా**
- **మేడారం భక్తుల విశ్వాసాన్ని దెబ్బతిసేందుకే నోటిఫికేషన్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్ర ఎన్నికల కమిషన్.. తెలంగాణ ప్రభుత్వం చేతిలో తోలుబొమ్మలా మారిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆరోపించారు. ఎన్నికలంటే ఆఫీసులో ఫైళ్లు క్లియర్ చేసినట్టు చుట్టేయడం కాదని అవి ప్రజాస్వామ్యానికి పునాదులనే విషయాన్ని గ్రహించాలన్నారు. మున్సిపల్ ఎన్నికలు ప్రజాస్వామ్య పండుగా? లేక అధికార పార్టీ కుట్రా?నా అని ప్రశ్నించారు. షెడ్యూల్, నోటిఫికేషన్ మధ్య ఒక్క రోజు కూడా గడువు ఇవ్వకపోవడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి అన్నారు. ఓ పక్క తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక "మేడారం జాతర" జరుగుతుంటే.. ఎన్నికల సంఘం మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడం దారుణమన్నారు. కోట్లాది మంది భక్తులు మేడారం వెళ్తుంటే... వారి విశ్వాసాలను దెబ్బ తీసేందుకే నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన బహిరంగ లేఖ లేఖ రాశారు. రాష్ట్రంలో ఏ రాజ్యాంగ సంక్షోభం లేకపోయినా మున్సిపల్ ఎన్నికలకు ఇంత ఊపిరాడని హడావుడి ఎందుకని ప్రశ్నించారు. సామ దాన భేద దండోపాయాలతో ఎన్నికలను ముగించాలని ఎన్నికల సంఘం చూస్తోందని ఆరోపించారు. ఈ షెడ్యూల్ ప్రతిపక్షాలకు, మహిళలకు, కొత్త అభ్యర్థులకు శాపంగా మారితే అధికార పార్టీకి వరంగా మారిందన్నారు. ఇది సమాన అవకాశాల పోటీ కాదనీ అడ్డగోలుగా సృష్టించిన వ్యవస్థీకృత అసమానత అని ఆరోపించారు. సమయం కుదిస్తే ఎన్నికలు డబ్బులు, మద్యం, కండబలంతో నడిచే తంతుగా మారుతాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంతో కుమ్మక్కై స్థానిక సంస్థల ఎన్నికలను మేనేజ్డ్ డ్రామాగా మార్చేశారని ఆరోపించారు. రాజ్యాంగ పరిరక్షకుడిగా గవర్నర్ వెంటనే మున్సిపల్ ఎన్నికలో నోటిఫికేషన్ షెడ్యూల్ అంశంలో జోక్యం చేసుకోవాని డిమాండ్ చేశారు.



# కారెక్కిన 'ఆరూరి'

- **బీఆర్ఎస్ లో చేరిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే**
- **తెలంగాణభవన్ లో పార్టీలో ఆహ్వానించిన కేటీఆర్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్... బీజేపీకి గుడ్ బై చెప్పారు. అందరికీ షాక్ ఇస్తూ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బుధవారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో ఆయనకు గులాబీ కండువా కప్పిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆరూరి రమేష్‌కు మాజీ మంత్రులు హరీశ్ రావు, ఎర్రబెల్లి దయాకర్ రావులు పార్టీలో స్వాగతించారు. ఈ సందర్భంగా ఆరూరి రమేష్ మాట్లాడుతూ.. చిన్నప్పుడు ఎవరైనా పిల్లవాడు ఇల్లు తప్పిపోయి తిరిగి వస్తే తల్లిదండ్రులు ఎంత సంబరపడతారో.. నేడు ఇక్కడున్న పెద్దలు కూడా నన్ను చూసి అంతే సంబరపడుతున్నారని వ్యాఖ్యానించారు. స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వరంగల్ జిల్లాలో అనేక మంది మీద బురదజల్లి, వారిని రాజకీయంగా ఎదగకుండా చేశారని మండిపడ్డారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డితో ములాఖాత్ అయి వరంగల్ జిల్లాలో అనేక మంది ఓటమికి కారణమయ్యారని ఆరోపించారు. అప్పటి పరిస్థితులతోనే తాను పార్టీ నుంచి బయటకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. కడియం శ్రీహరి పార్టీ వీడడంతోనే తాను సొంత ఇంటికి రావాలని నిర్ణయం తీసుకున్నానని ఆరూరి రమేష్ పేర్కొన్నారు.

# ఎక్సైజ్ శాఖలో భారీ కుంభకోణం

- **మైక్రో బేవరేజెస్ అనుమతుల్లో ముఖ్య నేత చక్రం**
- **లాటరీ లేకుండానే పంపకాలు**
- **మంత్రి కోటా కింద ఒకరు నాలుగు...మరో నేత 21 బేవరేజీలు పంచుకున్నారు**
- **మాజీ మంత్రి హరీశ్ రావు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



కుంభకోణాలకు కేరాఫ్ గా మారిన కాంగ్రెస్ పాలనలో ఎక్సైజ్ శాఖలో భారీ అవినీతి జరిగిందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ఆ శాఖలో ఓ ముఖ్యనేత, మంత్రి కోటా కింద ఈ అవినీతి జరిగిందన్నారు. బుధవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడారు. ఎక్సైజ్ శాఖలో కొత్తగా మైక్రో బేవరేజెస్ కు అనుమతులు ఇవ్వాలని నిర్ణయించుకున్నారని చెప్పారు. ఇందుకోసం అభ్యర్థుల నుంచి 110 దరఖాస్తులు వచ్చాయనీ ఇందులో తొలుత 25 ఇవ్వబోతున్నట్లు చెప్పారు. అయితే ఇందులో మంత్రి కోట నాలుగు, మరో ముఖ్య నేత కోట కింద 21 మైక్రో బెవరేజులను ఎంపిక చేసుకొని పంచుకున్నారని హరీశ్ రావు ఆరోపించారు. సదరు నాయకుడు ఈ మధ్య ముఖ్య నేతకు తోడై, నీడై, ఇంట్లోనే ఉంటున్నాడన్నారు. ఈ మధ్య వార్తల్లో కూడా ఉన్నారని ఆరోపించారు. ఆయన కారు నేరుగా ముఖ్య నేత ఇంట్లోకి వెళ్తుందన్న హరీశ్ రావు.. ఇటీవల ఆ ముఖ్య నేత తిరుపతి వెళ్తే సదరు నేత నీడగా వెంటే ఉన్నాడని ఆరోపించారు. ఒక్కో బ్రేవరీకి రూ. 1.80 కోట్లుగా ధర నిర్ణయించారన్నారు. ఇందులో రూ.ఒకటిన్నర కోటి ముఖ్యనేతకు, మిగతా రూ.30 లక్షలు తోడు నీడ కు అని ఆరోపించారు. మైక్రో బేవరేజీల కోసం 110 దరఖాస్తులు వచ్చాయని చెబుతోన్న అధికారులు అలాంటప్పుడు వైన్స్ లకు లాటరీ తీసినట్టు వీటికి ఎందుకు లాటరీ తీయడం లేదని హరీశ్ రావు ప్రశ్నించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడు లేని విధంగా లిక్కర్ సరఫరా చేసే సంస్థలకు రూ. 4500కోట్లు బకాయిలు పడ్డారని విమర్శించారు. కొన్ని బకాయిలు 16 నెలలకు పైబడి ఉన్నాయన్నారు. గతంలో ఎన్నడు కూడా ఈ విధమైన పరిస్థితి లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 15 రోజుల్లో చెల్లింపులు జరిగేవన్నారు. బకాయిల వల్ల సరఫరా ఆగిపోయిందనీ దీంతో చాలా దుకాణాల్లో సరుకు అందుబాటులో లేకుండా పోతోందన్నారు. ఇతర మల్టీ నేషనల్ కంపెనీలు కూడా సరఫరా నిలిపివేస్తామని లేఖలు కూడా రాశాయన్నారు. వాటాల పంపకాల్లో తేడాతోనే బకాయిలు నిలిచిపోయాయని ఆరోపించారు. రానున్న రోజుల్లో మరికొన్ని బ్రాండ్స్ నిలిపివేసే పరిస్థితి ఉన్నదని దీనితో ప్రభుత్వం ఆదాయం పడిపోతోందన్నారు. ఇప్పటికే హాలోగ్రామ్ టెండర్లు విషయంలో ముఖ్య నేత అల్లుడుకి, మంత్రి కొడుక్కి కావాలని పట్టుపట్టారని ఆరోపించారు.

**బీర్ కంపెనీలకు ఉన్న ప్రాధాన్యత రైతులకు లేదు:**

ఈ ప్రభుత్వం బీర్ కంపెనీలకు ఇచ్చిన ప్రాధాన్యత రైతులకు ఇవ్వడం లేదని హరీశ్ రావు ఆరోపించారు. మీకు బీర్ల కంపెనీలు ముఖ్యమా... రైతులు ముఖ్యమా అంటే బీరు కంపెనీలే ముఖ్యం అంటున్నారని ధ్వజమెత్తారు. సంగారెడ్డి జిల్లా సింగూరు డ్యాం రిపేర్ పేరు మీద రైతులకు క్రాఫ్ హాలిడే ప్రకటించారని ఈ ప్రాజెక్టు కింద. 40వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదన్నారు. మెదక్ జిల్లా ఘనపూర్ ఆయకట్ట కింద 30వేల ఎకరాలకు క్రాప్ హాలిడే ప్రకటించారన్నారు. ఇదే సంగారెడ్డి జిల్లాలో ఉన్న బీరు కంపెనీలకు మాత్రం ఎలాంటి ఆటంకం లేకుండా నీటి సరఫలా జరుగుతోందని ఇది మద్యం తయారీదారు ప్రభుత్వమా? లేక రైతు ప్రభుత్వమా? అని నిలదీశారు. అబ్కారీ శాఖ స్పెషల్ సీఎస్ సంగారెడ్డి జిల్లాకు వెళ్లి నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశమై రైతులకు నీటి సప్లై ఆపి బీర్ల కంపెనీలకు నీటి కొరత రాకుండా చూడండని ఆదేశించారని ఆరోపించారు.



# మున్సిపల్ ప్రచారం : రాష్ట్రానికి బీజేపీ అగ్రనేతలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

మరికొన్ని రోజుల్లో తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారం కోసం భాజపా జాతీయ నేతలు రానున్నట్లు ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు తెలిపారు. పది రోజుల్లో రెండు భారీ బహిరంగ సభలకు ప్లాన్ చేస్తున్నట్లు మీడియాతో నిర్వహించిన చిట్ చాట్‌లో చెప్పారు. ఉత్తర తెలంగాణలో ఒక సభ, దక్షిణ తెలంగాణలో మరొ సభ నిర్వహిస్తామని.. వీటికి పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హా, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రానున్నట్లు వెల్లడించారు. అంతకుముందు భాజపా రాష్ట్ర కార్యాలయంలో పలువురు న్యాయవాదులు రామచందర్‌రావు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తెలంగాణ భాజపా చీఫ్ మాట్లాడుతూ.. బ్రిటీష్ చట్టాలే ఇప్పటి వరకు అయ్యాయని, మోదీ వాటికి చరమగీతం పాడేలా న్యాయ వ్యవస్థలో మార్పులు తెచ్చారని చెప్పారు. బంగారు తెలంగాణ కావాలంటే మేధావి వర్గం అంతా భాజపాలో చేరాలని పిలుపునిచ్చారు. అవినీతి రహిత పాలన అందాలంటే రాష్ట్రంలో భాజపా ప్రభుత్వం రావాల్సిందేనని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో భాజపా అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 29.01.2026
www.mudranews.in | @mudranews



**ప్రపంచ ప్రసిద్ధ గొప్ప జాతరలు**

రియో కార్నివాల్ (బ్రెజిల్): బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో జరిగే ఈ ఉత్సవం ప్రపంచంలోనే అతిపెద్ద సాంస్కృతిక వేడుకగా గుర్తింపు పొందింది. రంగురంగుల దుస్తులు, సాంబ నృత్యాలు మరియు భారీ ఊరేగింపులతో ఈ నగరం ఐదు రోజుల పాటు హోరెత్తిపోతుంది.

# మీరు ఏ పార్టీలో ఉన్నారు...?

**కాంగ్రెస్ లో చేరారా.? బీఆర్ఎస్ లో కొనసాగుతున్నారా..?**

## ఎమ్మెల్యేలు దానం, పాడి కౌశిక్‌కు స్పీకర్ నోటీసులు

**ఈ నెల 30న విచారణకు రావాలని ఆదేశాలు**

**'సుప్రీం' కోర్టు ధిక్కార నోటీసులతో చర్యలు**



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తాజాగా నోటీసులు ఇచ్చారు. అలాగే దానం నాగేందర్ పై అనర్హత పిటిషన్ వేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సైతం స్పీకర్ నోటీసులు ఇచ్చారు. వీరిద్దరు ఈ నెల 30న విచారణకు హాజరుకావాలని వేర్వేరుగా ఇచ్చిన నోటీసుల్లో పేర్కొన్నారు. ఇదిలావుంటే ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విషయంలో చేస్తున్న జాప్యంపై సుప్రీంకోర్టు ఈనెల 19వ తేదిన స్పీకర్ కు కోర్టు ధిక్కర నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్లపై చర్యలు తీసుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో పెండింగ్ లో ఉన్న ముగ్గురు ఎమ్మెల్యేల్లో దానం నాగేందర్ కు స్పీకర్ నోటీసులు ఇచ్చారు. దానం నాగేందర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీ ఫామ్ పై ఎంపీగా పోటీ చేశారు. దీంతో ఆయన పార్టీ ఫిరాయించారు అనడానికి బలమైన ఆధారాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయనపై స్పీకర్ చర్యలు తీసుకోక తప్పదనే చర్చ హాట్ టాపిక్‌గా మారింది. స్పీకర్ చర్యలు తీసుకోకముందే దానం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఈ విషయాన్ని దానం కూడా ఇది వరకే ప్రకటించారు. ఉప ఎన్నిక వచ్చినా భయపడేది లేదన్నారు. అందులో గెలుస్తానని ప్రకటించారు. కాగా అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ నుంచి గెలిచిన మొత్తం 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వీరిపై అనర్హత వేటు ఫిర్యాదులు అందగా వారిలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్పీకర్.. ఇది వరకే అరికపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణ మోహన్, ప్రకాష్ గౌడ్, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్యలకు క్లీన్ చిట్ ఇచ్చారు. వీరిని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగా గుర్తించారు. అయితే దానం నాగేందర్, కడియం శ్రీహరి, డాక్టర్ సంజయ్ లకు సంబంధించి స్పీకర్ ఇంకా విచారణ జరపలేదు. ఈ క్రమంలో దానం కు నోటీసులు జారీ చేసిన స్పీకర్ త్వరలోనే జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కూ నోటీసు ఇస్తారనే ప్రచారం జరుగుతున్నది.

### నేను బీఆర్ఎస్‌లోనే ఉన్నా : దానం

ప్రచారం జరుగుతున్నట్టు.. తాను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టత ఇచ్చారు. బీఆ రఎస్ అనర్హత పిటిషన్ పై తాజా గా అఫిడవిట్ సమర్పించిన ఆయన పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారన్న పిటిషన్ ను కొట్టివేయాలని స్పీకర్ కు దానం విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ తనను ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు తనకు సమాచారం లేదన్నారు. తాను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చే యలేదని దానం స్పష్టం చేశా రు. 2024 మార్చిలో కాంగ్రెస్ సమావేశానికి వెళ్లానని చెప్పారు.. అది వ్యక్తిగత హోదాలో మాత్రమేనని వివరణ ఇచ్చారు. మీడియా కథనాల ఆధారంగా పార్టీ మారినట్లు బీఆర్ఎస్ భా విస్తోందని అన్నారు. బీఆర్ఎస్ అనర్హత పిటిషన్ లోని అంశా లపై మాత్రమే వివరణ ఇస్తున్నట్లు వివరించారు. గతంలో కోర్టు తీర్పులను అనుసరించి బీ ఆర్ఎస్ అనర్హత పిటిషన్ చెల్లు బాటు కాదన్నారు. అనర్హత పిటి షన్ తర్వాత పరిణామాలను అనుబంధ సమాచారంగా అంగీకరించవద్దని స్పీకర్ ను కోరా రు. పార్టీ ఫిరాయింపులకు పా ల్పడ్డారన్న పిటిషన్ ను కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో దానం వాదనపై స్పీకర్ ఎలాం టి నిర్ణయం తీసుకుంటారు..? బీఆర్ఎస్ ఎలా స్పందించబో తోంది అనే చర్చ రాజకీయాల్లో ఆస్తి రేపుతున్నది.

# దేశానికి రోల్‌మోడల్‌గా తెలంగాణ డిజాస్టర్ మేనేజిమెంట్

**రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ శిక్షణా కేంద్రం**

**క్షేత్రస్థాయి వరకు అడ్వాన్స్‌డ్ వెదర్ స్టేషన్లు ఏర్పాటు**

**రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి**

**రూ.100 కోట్లతో అత్యాధునిక పరికరాలు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్ర ప్రకృతి విపత్తుల నిర్వహణా సంస్థ ( డిజాస్టర్ మేనేజిమెంట్ ) విభాగాన్ని బలోపేతం చేసి దేశానికే రోల్ మోడల్‌గా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ప్రకృతి విపత్తులను సమర్ధవంతంగా ఎదుర్కొని వీలైనంతవరకూ ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి విపత్తులు వచ్చిపడ్డా ఎదుర్కొనేలా రూ. వంద కోట్లతో అత్యాధునిక పరికరాలు కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో విపత్తుల నిర్వహణా విభాగం, ఫైర్ సర్వీసెస్, ఎస్‌డిఆర్‌ఎఫ్, హైడ్రా, ఐసీసీసీ విభాగాలతో సమావేశం నిర్వహించారు. ఇందులో ఎలాంటి పరికరాలను కొనుగోలు చేయాలన్న విషయంపై సుదీర్ఘంగా చర్చించారు. వరదలు, అగ్నిప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో త్వరితగతిన స్పందించడానికి ఖచ్చితమైన సమాచార వ్యవస్థ, రియల్‌టైమ్ మానిటరింగ్ సాధ్యమయ్యేలా విపత్తు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, డ్రోన్లు, శాటిలైట్ ఆధారిత కమ్యూనికేషన్, ఆధునిక రెస్క్యూ పరికరాలు, అత్యాధునిక ఫైర్ అండ్ సెర్చ్ ఆపరేషన్ల సాంకేతికతను రెవెన్యూ–విపత్తు నిర్వహణ విభాగాలకు అందుబాటులోకి తెస్తామని మంత్రి వెల్లడించారు. విపత్తు విభాగంలో పనిచేసేవారికి శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర స్థాయిలో డిజాస్టర్ మేనేజిమెంట్ ఆధ్వర్యంలో అత్యుత్తమ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. వాతావరణ పరిస్థితులు క్షేత్రస్థాయి వరకు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేసేలా ఆయా స్థానిక పరిస్థితులను బట్టి మండల స్థాయి వరకు అడ్వాన్స్‌డ్ వెదర్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. భారీ వర్షాలు వరదల సమయంలో వాగుల్లో వంకల్లో చెరువుల్లో చిక్కుకున్నవారిని రక్షించడానికి ఎయిర్‌లిఫ్ట్ మెకానిజం తయారు చేసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని తరలించడానికి 70 నుంచి 80 కిలోల బరువును ఎత్తే డ్రోన్లను కొనుగోలు చేయాలని సూచించారు. ఎయిర్ లిఫ్ట్ వ్యవస్థ సరిగాలేకపోవడంతో 2024లో పాలేరు నియోజకవర్గంలో వాగుల్లో చిక్కుకున్న బాధితులను రక్షించుకోలేకపోయానని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రజల్లోకి విహెచ్-ఎఫ్ రేడియో సిస్టమ్స్**

హైదరాబాద్ లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి రాష్ట్రంలో ఏ మారుమూల ప్రాంతంలోనైనా మాట్లాడడానికి వీలుగా సిమ్ ఆధారిత విహెచ్ ఎఫ్ రేడియో సిస్టమ్స్ ను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవడంతో పాటు క్షేత్రస్థాయి వరకు తీసుకువెళ్లాలని మంత్రి అధికారులకు సూచించారు. హైదరాబాద్ నగరంలో హైరైజ్ భవనాలలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని సమర్దవంతంగా ఎదుర్కొనేలా అవసరమైన పరికరాలను కొనుగోలు చేయాలని హైడ్రా కమీషనర్‌కు సూచించారు. 77 హైస్పీడ్ బోట్‌లను కొనుగోలు చేయాలనీ రాష్ట్రంలో 12 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు ఉన్నాయన్నారు. ఒక్కో బృందంలో వెయ్యిమంది వరకు ఉన్నారని వీరందరికీ ఎప్పటికప్పుడు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, అగ్నిమాపకశాఖ డైరెక్టర్ విక్రమాన్ సింగ్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఐసీసీసీ డైరెక్టర్ కమల్ హాసన్‌రెడ్డి పాల్గొన్నారు.



# 'భూధార్'తో భూ సమస్యలకు చెక్

**రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి**

**రాష్ట్రవ్యాప్తంగా రెండు నెలలు సర్వే**

**ప్రతి భూ యజమానికి భూధార్ కార్డులు**



**ముద్ర, పటాన్ చెరు :** రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయనున్న భూదార్ కార్డులతో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. రెండు నెలలు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రతి సర్వే నెంబర్ వారిగా సర్వేలను పూర్తి చేసి ప్రతి భూ యజమానికి భూధార్ కార్డులను జారీ చేస్తామన్నారు. ప్రధానంగా డబుల్ రిజిస్ట్రేషన్లకు తావు లేకుండా భూభారతి తో పాటు రిజిస్ట్రేషన్ శాఖలను సింగల్ పేజీలోకి తీసుకువస్తామన్నారు. తద్వారా భవిష్యత్తులో భూతగాదాలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. రిజిస్ట్రేషన్ శాఖను పూర్తిగా ప్రక్షాళన చేసి దళారి వ్యవస్థను నిర్మూలిస్తామని చెప్పారు. బుధవారం పటాన్ చెరులోని కర్దనూర్ లో నూతనంగా నిర్మించతలపెట్టిన సబ్ రిజిస్ట్రార్ ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ కు కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి, ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తీసుకువచ్చిన ధరణి అనేక లోటుపాట్లు అనవసర భూతగాదాలు సృష్టించిందని ఆరోపించారు. భూ సమస్యల పరిష్కారానికి భూ యజమానికి చుట్టంలా భూభారతిని తీసుకుని వచ్చామన్నారు. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి భూమి సర్వే నిర్వహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5500 మంది లైసెన్సుడ్ సర్వేయర్లను నియమించడంతో పాటు సర్వే కోసం అత్యాధునిక పరికరాలను సమకూర్చామన్నారు.

**11 క్లస్టర్లతో ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ లు**

రిజిస్ట్రేషన్ సమయంలో కొనుగోలుదారులతోపాటు అమ్మకం దారులు సరైన వసతులు సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించి అవుటర్ రింగ్ రోడ్డు చుట్టుపక్కన 11 క్లస్టర్లతో ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ లను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మంత్రి తెలిపారు. అందులో భాగంగా పటాన్ చెరులో సుమారు 3 ఎకరాల విస్తీర్ణంలో 20 వేల చదరపు అడుగుల్లో రెండు అంతస్థుల్లో నిర్మాణం చేస్తున్నామన్నారు. ఈ కార్యాలయంలో మినీ మ్యారేజ్ హాల్ తో పాటు మహిళలకు ఫీడింగ్ రూమ్,వెయిటింగ్ హాల్,వాహనాల పార్కింగ్ తో పాటు వృద్ధులకు ఆధునాతన లిఫ్టు సౌకర్యం కల్పించనున్నారు. పటాన్ చెరు కాంప్లెక్స్ నిర్మాణానికి రాజ్ పుష్ప ప్రాపర్టీస్ సంస్థ ముందుకు వచ్చిందన్నారు. పటాన్ చెరు తో పాటు పెద్దపల్లిలో సైతం రాజ్ పుష్ప రిజిస్ట్రేషన్ కార్యాలయం నిర్మాణానికి ముందుకు వచ్చిందన్నారు. కార్యాలయం నిర్మాణానికి ముందుకు వచ్చిన రాజ పుష్ప సంస్థను ఆయన అభినందించారు. ఆరు నెలల్లో ఈ నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు ఐదు సంవత్సరాలు ఈ భవన నిర్మాణ మెయింటెనెన్స్ రాజ్ పుష్ప సంస్థ చేపట్టాలని కోరారు. కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ధరణితో తెలంగాణలో భూతగాదాలు విపరీతంగా పెరిగాయని విమర్శించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించాలనే సదుద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ప్రజా ప్రభుత్వం భూభారతి చట్టాన్ని అమలులోకి తెచ్చిందని వివరించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తే అభివృద్ధిలో మరింత ముందుకు వెళ్లే ఆస్కారం ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ శాఖ అవినీతికి అడ్డాగా మారిందని ఆరోపించారు. ఈ శాఖను ప్రభుత్వం ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. డబుల్ రిజిస్ట్రేషన్లు చేస్తూ అవినీతికి పాల్పడి నిజమైన భూ యజమానులకు మోసం చేస్తున్న అధికారులతో పాటు ఏజెంట్ల పై పీడి యాక్ట్ నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ ఫహీం, జిల్లా రిజిస్ట్రార్ వల్లి సుబ్బలక్ష్మి , పటాన్ చెరు సబ్ రిజిస్ట్రార్ సురేందర్ పాల్గొన్నారు.

# అందరి ఏకాభిప్రాయంతో అభ్యర్థుల ఎంపిక

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు మావే**

**ఎమ్మెల్యేలు, మంత్రులకు సమన్వయ బాధ్యతలు**

**సీఎం రేవంత్ నాతో టచ్ లో ఉన్నారు**

**పొత్తుల అంశాన్ని టీపీసీసీ చీఫ్ తేలుస్తారు**

**ముద్ర, మధిర:** మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక విషయంలో ఆచీతూచీ వ్యవహరిస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ఆయా పట్టణాలు, నగరాలకు చెందిన కీలక నేతలు, ముఖ్య కార్యకర్తల ఏకాభిప్రాయంతో అభ్యర్థులను ఎంపిక చేస్తామని ప్రకటించారు. ఈ బాధ్యతను సంబంధింత ఎమ్మెల్యేలు, మంత్రులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. బుధవారం ఖమ్మం జిల్లా మధిరలో పర్యటించిన ఆయన ఎన్నికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించిన ప్రజలు మున్సిపల్ ఎన్నికల్లోనూ మెజారిటీ సీట్లలో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికలపై సీఎం రేవంత్ రెడ్డి, తాను నిరంతరం సంప్రదింపుల్లో ఉన్నామన్నారు. తమతో పాటు పార్టీలో కీలక, ముఖ్య, సీనియర్ నాయకుల సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకుని ముందుకువెళ్తామన్నారు. ప్రధానంగా ఈ ఎన్నికల్లో పొత్తుల అంశంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలోనే నిర్ణయాలు జరుగుతాయన్నారు. ఆయన ఆయా పార్టీలతో చర్చించి పొత్తులపై తుది నిర్ణయం తీసుకుంటారన్నారని భట్టి స్పష్టం చేశారు.విద్యా, ఆరోగ్యంతో పాటు నగరాల్లో మౌలికాభివృద్ధి కోసం తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకుపోతున్నామని రాష్ట్రంలో దశాబ్ద కాలంగా ఎదురు చూస్తున్న రేషన్ కార్డులను తాము అధికారంలోకి వచ్చాక ఇచ్చామని అన్నారు. తెలంగాణ ప్రగతి కోసం క్యూర్, ప్యూర్, రేర్ అనే త్రిముఖ వ్యూహంతో ముందుకు వెళ్తున్నామన్నారు. రాష్ట్రంలో సీఎం, డిప్యూటీ సీఎం, కేబినెట్ అంతా ఉమ్మడి కుటుంబంగా ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని రంగాల్లో సమగ్రమైన అభివృద్ధి కోసం 'తెలంగాణ రైజింగ్ విజన్–2047' డాక్యుమెంట్ పేరుతో ప్రణాళికను విడుదల చేశామన్నారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఒకటి అర తప్ప మిగతావి అన్ని అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క అన్నారు. ఇటీవల ప్రజాభవన్‌లో మంత్రుల భేటీపై స్పందించిన ఆయన.. తాను ప్రాతినిధ్యం వహిస్తోన్న పార్టీకి చెందిన మంత్రులు నాతో ప్రయాణం చేయకుంటే ఆ వార్తలు రాసే వారితో ప్రయాణం చేస్తారా అని ప్రశ్నించారు.



సీఎం విదేశీ పర్యటనలో ఉన్నందునే పాలనపరమైన అంశంలో చర్చించేందుకే మంత్రులతో భేటీ నిర్వహించినట్లు వివరణ ఇచ్చారు. పూర్తి విషయం తెలుసుకునే ఓపిక లేని కొందరు మూర్ఖులు.. పిచ్చి భ్రమలో ఉన్నారన్నారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై స్పందించిన ఆయన... కాంగ్రెస్ పార్టీ భావజాలాన్ని నమ్మి పార్టీ జెండాను భుజాన వేసుకుని తిరుగుతున్న వారంతా కాంగ్రెస్ పార్టీ వారేనని భట్టి విక్రమార్క అన్నారు. సాధ్యమైనంత వరకు నిబంధతతో పని చేసే వారికి న్యాయం చేసేందుకు పార్టీ ప్రయత్నిస్తుందన్నారు.




# ఉద్దేశపూర్వకంగానే తప్పుడు ఆరోపణలు

**కేటీఆర్, హరీష్ రావు వ్యాఖ్యలపై ఏసీబీకి ఫిర్యాదు**

**ముద్ర – బండ్లగూడ:** తన పరువును దెబ్బతీయాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, డాక్టర్ శ్రీశాంక్‌లు తనపై తప్పుడు, నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని ఎఐసిసి కార్యదర్శి డాక్టర్ సంపత్ కుమార్ ఆరోపించారు. ఈ ఆరోపణల వల్ల తాను తీవ్ర మనోవేదనకు గురవుతున్నానని పేర్కొంటూ, వారిపై చర్యలు తీసుకోవాలని నార్సింగి ఏసీబీని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు అనుబంధంగా ఉన్న ఓ దినపత్రికతోపాటు, యూట్యూబ్ ఛానల్‌లో తనపై ఉద్దేశపూర్వకంగా కథనాలు ప్రచురింపజేసి, ఒకరి తర్వాత ఒకరు ప్రెస్‌మీట్లు నిర్వహిస్తూ తనను లక్ష్యంగా చేసుకుని దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. తనను, అలాగే సీఎం రేవంత్ రెడ్డిని అప్రతిష్టపాలు చేయాలనే ఏకైక లక్ష్యంతోనే ఈ దుష్ప్రచారం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఈ తరహా కించపరిచే ఆరోపణలు మానుకోకపోతే పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు.



# ఐదు కార్పొరేషన్లు.. 70 'పుర'పీఠాలు మావే

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందరావు**

**60శాతం మున్సిపాలిటీల్లో గెలుపే లక్ష్యంగా బరిలో**

**ముస్లిం ఓటు బ్యాంకుపై ఆధారపడ్డ కాంగ్రెస్, బిఆర్ఎస్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** వచ్చే నెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో.. బీజేపీ రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా తన సత్తా చాటుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. కనీసం ఐదు కార్పొరేషన్లు... 70 మున్సిపాలిటీల్లో కాషాయ జెండా ఎగురడం ఖాయమని జోస్యం చెప్పారు. ఈ ఎన్నికల్లో 60 శాతం మున్సిపాలిటీల్లో గెలుపే లక్ష్యంగా తాము బరిలోకి దిగుతున్నామని చెప్పారు. బుధవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే రాష్ట్రంలో జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తమ సత్తాచాటామన్న ఆయన మున్సిపల్ ఎన్నికల్లోనూ అదే ఆనవాయితీ కొనసాగిస్తామని చెప్పారు. మున్సిపల్ ఎన్నికలకు బీజేపీ ఎప్పటి నుంచో సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయనున్న ఆశావాహులకు సంబంధించిన వివరాలతో పూర్తిస్థాయి నివేదికలు త్వరలోనే అన్ని ప్రాంతాల నుంచి రానున్నాయన్నారు. అవి వచ్చిన వెంటనే పార్టీ కమిటీ సమావేశంలో చర్చించి అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కేవలం ముస్లిం ఓటు బ్యాంకు పైనే ఆధారపడ్డాయని రాంచందర్ రావు విమర్శించారు. కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు రెండూ ఒకటేనని ఆరోపించారు. ఈ సందర్భంగా బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు.



మీ ముద్ర వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com


## హైదరాబాద్ విభజనపై

# ఉత్కంఠ

హైదరాబాద్.. కేవలం ఒక నగరం కాదు, అంతర్జాతీయ పటంలో తనకంటూ ఒక ముద్ర వేసుకున్న మహానగరం. శతాబ్దాల చరిత్ర, విభిన్న సంస్కృతుల సమ్మేళనం ఈ నగరం సొంతం. అయితే, గత కొద్ది రోజులుగా వినిపిస్తున్న ఒక వార్త ఇప్పుడు సామాన్యుడి నుంచి రాజకీయ నేతల వరకు అందరిలోనూ ఉత్కంఠను రేపుతోంది. అదే.. 'హైదరాబాద్ విభజన'. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC)ని మూడు భాగాలుగా విభజించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్న వార్తలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

**విస్తరిస్తున్న నగరం..**

ఒకప్పుడు కేవలం నాలుగు చదరపు కిలోమీటర్ల లోపే ఉన్న నగరం, నేడు శివారు మున్సిపాలిటీలను కలుపుకుని 650 చదరపు కిలోమీటర్ల పైచిలుకు విస్తరించింది. జనాభా కోటికి పైగా దాటిపోయింది. ఇంత భారీ నగరాన్ని ఒకే గొడుగు కింద (GHMC) పాలించడం కత్తి మీద సాములా మారింది. డ్రైనేజీ సమస్య మొదలుకుని, చెత్త తరలింపు, ట్రాఫిక్ నిర్వహణ వరకు ప్రతి అంశంలోనూ అధికార యంత్రాంగంపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో 'విభజన' అనేది పరిపాలన సౌలభ్యం కోసమే అని ప్రభుత్వం భావిస్తున్నట్లు కనిపిస్తోంది.

**మూడు ముక్కలాట..**
**ఎవరి ప్రయోజనం కోసం?**

ప్రచారంలో ఉన్న ప్రతిపాదనల ప్రకారం నగరాన్ని హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌గా విభజించనున్నారు.

ఇది జరిగితే:

పాలనా వికేంద్రీకరణ: ఒక్కో నగరానికి ఒక కమిషనర్, ఒక మేయర్ ఉండటం వల్ల క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం వేగవంతం కావచ్చు.

నిధుల వరద:

కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే గ్రాంట్లు మూడు కార్పొరేషన్లకు విడివిడిగా అందే అవకాశం ఉంది.

రాజకీయ వ్యూహం:

ఒకే మేయర్ పీఠంపై ఆధిపత్యం కంటే, మూడు నగరాల్లో పట్టు సాధించడం ద్వారా రాజకీయంగా పటిష్టమవ్వాలని పార్టీలు భావించవచ్చు.

**సవాళ్లు - సందేహాలు**

అయితే, ఈ విభజన అంత సులభంగా జరిగిపోతుందా? అంటే కష్టమనే చెప్పాలి. పాతబస్తీలోని మౌలిక సదుపాయాలకు, హైటెక్ సిటీ ఆదాయానికి మధ్య భారీ వ్యత్యాసం ఉంది. విభజన జరిగితే ఆదాయ వనరుల పంపకం ఎలా ఉంటుంది? ఒకే నగరంగా ఉన్నప్పుడు ఉండే భౌగోళిక ఏకత్వం దెబ్బతింటుందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అలాగే, విభజన వల్ల సామాన్య ప్రజలపై పన్నుల భారం పెరుగుతుందనే ఆందోళన ఉంది.

**మౌనం వెనుక మర్మమేంటి?**

2025 డిసెంబర్ నుంచి మీడియాలో కథనాలు వస్తున్నా ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టమైన క్లారిటీ ఇవ్వలేదు. ప్రభుత్వ 'మౌనం' అంటే అది మౌన అంగీకారమేనా? లేక ప్రజాభిప్రాయాన్ని సేకరించడానికి వేసిన ఎత్తుగడనా? అనేది అర్థం కావడం లేదు. అధికారిక ప్రకటన వెలువడక ముందే రాజకీయ వర్గాల్లో దీనిపై యుద్ధం మొదలైంది.



నగరం ఎంత పెరిగినా ప్రజలకు కావాల్సింది మెరుగైన సౌకర్యాలు, తక్కువ ధరకే ప్రభుత్వ సేవలు. విభజన వల్ల పరిపాలన ప్రజలకు దగ్గరవుతుందంటే అది స్వాగతించదగ్గ పరిణామమే. కానీ, అది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం లేదా పదవుల పెంపు కోసం మాత్రమే జరిగితే నగరం తన అస్తిత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. భాగ్యనగరం ముక్కలవుతుందో లేక మరింత బలోపేతమవుతుందో కాలమే నిర్ణయించాలి.

# ఎన్నికల వ్యయంలో జరుగుతున్న అసమానతలు

## ప్రజాస్వామ్యానికి సవాలు



భారతదేశంలో ఎన్నికలు ఎప్పుడూ అత్యంత ఉత్సాహభరితంగా, పోటీతత్వంతో కూడుకున్నవే, కానీ ఇటీవలి కాలంలో వెలువడిన ఆర్థిక గణాంకాలు ఈ రాజకీయ క్రీడా క్షేత్రం క్రమక్రమంగా అసమానంగా మారుతోందనే చేదు నిజాన్ని వెల్లడిస్తున్నాయి. భారత ఎన్నికల సంఘానికి సమర్పించిన పత్రాలను పరిశీలిస్తే, గత దశాబ్ద కాలంలో ప్రధాన రాజకీయ పార్టీలైన భారతీయ జనతా పార్టీ (బిజెపి) మరియు కాంగ్రెస్ మధ్య ఎన్నికల ఖర్చులో విపరీతమైన వ్యత్యాసం పెరిగినట్లు స్పష్టమవుతోంది. ఈ మార్పు కేవలం అంకెలకే పరిమితం కాకుండా, భవిష్యత్తులో దేశ ఎన్నికల పోటీ స్వభావాన్ని ఏ విధంగా మార్చబోతుందనే తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది.




వెంకగారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్
9848559863


**రాజకీయ నిధుల సేకరణలో ఉన్న నియంత్రణల సడలింపు గురించి కూడా మేధావులు చర్చలు జరుపుతున్నారు. కేవలం పారదర్శకత మాత్రమే ప్రజాస్వామ్యాన్ని కాపాడలేదని, ఈ నిర్మాణాత్మక అసమానతలు దేశ ప్రజాస్వామ్య పునాదులనే కదిలించే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. వనరుల లభ్యతలో ఇంత భారీ వ్యత్యాసం ఉన్నప్పుడు, పార్టీల మధ్య అంతర్గత పునరుద్ధరణ (renewal) జరగడం కూడా కష్టమవుతుంది, ఎందుకంటే కొత్త ఆలోచనలున్న నాయకులకు కూడా తమ గొంతు వినిపించడానికి భారీ ఆర్థిక వనరులు అవసరమవుతున్నాయి. ఇది చివరికి రాజకీయాల్లో ధనిక మరియు శక్తివంతమైన వర్గాల పెత్తనాన్ని పెంచి, సామాన్యుడి ప్రాతినిధ్యాన్ని తగ్గించే అవకాశముంది.**

ఒకప్పుడు ఈ రెండు పార్టీల మధ్య వ్యయాల విషయంలో కొంతమేర సమతుల్యత ఉండేది. 2014–15 ఆర్థిక సంవత్సరంలో సాధారణ ఎన్నికలు జరిగిన సమయంలో, బిజెపి తన ఎన్నికల సంబంధిత వ్యయం సుమారు 925 కోట్ల రూపాయలుగా నివేదించగా, కాంగ్రెస్ సుమారు 582 కోట్ల రూపాయలను ఖర్చు చేసింది. ఆ సమయంలో ఉన్న ఈ వ్యత్యాసం కొంత పోల్చదగిన పరిధిలోనే ఉండేది. ఐదేళ్ల తర్వాత, 2019–20 ఎన్నికల చక్రంలో బిజెపి ఖర్చు 1,352 కోట్ల రూపాయలకు పెరిగినప్పటికీ, కాంగ్రెస్ కూడా 864 కోట్ల రూపాయల వరకు ఖర్చు చేయగలిగింది. అప్పుడు కూడా వ్యత్యాసం ఉన్నప్పటికీ, అది ప్రజాస్వామ్య పోటీని దెబ్బతీసేంత భారీగా కనిపించలేదు.

అయితే, 2024–25 నాటికి ఈ పరిస్థితి ఊహించని విధంగా మారిపోయింది. ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం, బిజెపి తన ఎన్నికలు మరియు సాధారణ ప్రచారం కోసం సుమారు 3,355 కోట్ల రూపాయలను ఖర్చు చేసింది. దీనికి విరుద్ధంగా, కాంగ్రెస్ పార్టీ నివేదించిన ఖర్చు కేవలం 896 కోట్ల రూపాయలుగానే ఉంది. అంటే, అధికార పార్టీ తన ప్రధాన జాతీయ ప్రత్యర్థి కంటే దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ నిధులను ఖర్చు చేసింది. భారత ఎన్నికల చరిత్రలో ఇలాంటి భారీ వ్యత్యాసం గతంలో ఎన్నడూ చూడలేదు. ఈ మార్పు కేవలం సంఖ్యలకే పరిమితం కాకుండా, ఆధునిక ఎన్నికల ప్రచార నిర్వహణ తీరును కూడా మార్చివేస్తోంది.

నేటి కాలంలో ఎన్నికల ప్రచారం అంటే కేవలం బహిరంగ సభలు, రోడ్ షోలకు పరిమితం కావడం లేదు. ఇది నిరంతరాయంగా సాగే ఒక భారీ కార్యకలాపంగా మారింది. ఇందులో ఎలక్ట్రానిక్ మీడియా విస్తృతి, భారీ ప్రకటనలు, నిరంతరాయ ప్రయాణాలు, క్షేత్రస్థాయి సమీకరణలు మరియు అత్యంత వేగంగా స్పందించే కమ్యూనికేషన్ బృందాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఇటువంటి అత్యున్నత స్థాయి వ్యవస్థలను నడపడానికి భారీ ఆర్థిక సామర్థ్యం, స్థిరమైన నిధుల ప్రవాహం అవసరం, కేవలం అప్పుడప్పుడు చేసే నిధుల సేకరణతో ఇది సాధ్యపడదు.

డబ్బు ఒక్కటే ఎన్నికల ఫలితాలను శాసించదని కొందరు వాదించవచ్చు, గతంలో కొన్ని రాష్ట్ర ఎన్నికల్లో భారీగా నిధులు ఉన్న పార్టీలు ఓడిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఓటర్లను ఎప్పుడూ డబ్బుతో కొనలేకపోవచ్చు, కానీ ఆర్థిక శక్తి అనేది ఓటింగ్ ప్రారంభం కాకముందే ఎన్నికల వాతావరణాన్ని ప్రభావితం చేస్తుంది. ఇది ఏ పార్టీ మీడియాలో ఎక్కువగా కనిపిస్తుంది, ఎవరి సందేశం ప్రజల్లోకి బలంగా వెళ్తుంది, మరియు చిన్న పొరపాట్లు జరిగినప్పుడు కూడా నష్టం జరగకుండా ఏ పార్టీ తట్టుకోగలదు అనే విషయాలను నిర్ణయిస్తుంది. డబ్బు విజయాన్ని ఖాయం చేయకపోవచ్చు కానీ, అది ఓటమి నుంచి కోలుకునే అవకాశాలను ఖచ్చితంగా పెంచుతుంది.

ప్రస్తుతం తలెత్తుతున్న ప్రధాన ఆందోళన ఏమిటంటే, ఈ ఆర్థిక అసమానతలు వ్యవస్థాగతంగా మారిపోతున్నాయా అనేది. ఒక పార్టీ దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో ప్రచారం చేయగలిగి, మరో పార్టీ తన వనరులను పొదుపుగా వాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడితే, ఆ ఎన్నికలు సిద్ధాంతాల మధ్య పోరాటం కంటే కేవలం "శబ్దం" చేసే పోటీగా మారుతాయి. ఇది దీర్ఘకాలంలో రాజకీయ పోటీని దెబ్బతీస్తుంది, సిద్ధాంత స్పష్టత కంటే పార్టీ యొక్క ఆర్థిక బలం మరియు సంస్థాగత సంపదకు ప్రాముఖ్యత పెరుగుతుంది. దీనివల్ల చిన్న పార్టీలు, ఆర్థికంగా బలహీనంగా ఉన్న వర్గాలు జాతీయ రాజకీయాల్లో ఉనికిని కాపాడుకోవడం కష్టతరమవుతుంది.

భారత ప్రజాస్వామ్యం ఇప్పటికీ క్రియాశీలంగా ఉన్నప్పటికీ, పోటీదారుల మధ్య ఉన్న ఈ సామర్థ్యపు వ్యత్యాసం ఆందోళన కలిగిస్తోంది. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో ఓటర్లకు నిజమైన ప్రత్యామ్నాయ ఎంపికలు లేకుండా పోయే ప్రమాదం ఉంది. అంతిమంగా, ఎన్నికలు అనేవి అభ్యర్థుల యొక్క విశ్వసనీయత, నాయకత్వం మరియు ప్రజా నమ్మకంపై ఆధారపడి గెలవాలి తప్ప, కేవలం ప్రత్యర్థుల కంటే ఎక్కువ ఖర్చు చేసే సామర్థ్యం మీద కాకూడదు. ఆర్థిక శక్తి మరీ పెత్తనం చెలాయిస్తే, ప్రజాస్వామ్య క్షేత్రం అందరికీ తెరిచి ఉన్నట్లు అనిపించినా, దాని సమతుల్యత మాత్రం నెమ్మదిగా ఒకవైపే మొగ్గు చూపుతూ పోతుంది.

# అధికార దర్పమా.. అక్షర నేరమా?

## సామాన్యుడిపైనేనా ఈ 'చట్టం' అస్త్రం?

తెలంగాణ సమాచార మరియు పౌర సంబంధాల శాఖ తాజాగా జారీ చేసిన మెమో రాష్ట్రవ్యాప్త రవాణా వ్యవస్థలో ఒక సంచలనానికి, అంతకు మించిన చర్చకు తెరలేపింది. వాహనాల నంబర్ ప్లేట్లపై లేదా బాడీపై అనధికారికంగా హోదాలను, వృత్తిపరమైన చిహ్నాలను ప్రదర్శించడంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని నిర్ణయించింది. సెంట్రల్ మోటార్ వెహికల్ రూల్స్ 50, 51 నిబంధనల ప్రకారం, వాహన రిజిస్ట్రేషన్ ప్లేట్ అనేది కేవలం ఆ వాహన గుర్తింపు సంఖ్యను ప్రతిబింబించే ఒక చట్టబద్ధమైన సాధనం మాత్రమే. కానీ, నేడు మన రహదారులపై ఆ ప్లేట్లు అధికార ప్రదర్శనకూ, సామాజిక హోదాకూ ప్రదర్శనా వేదికలుగా మారిపోయాయి.


వెంకగారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్
9848559863








**హోదాల హంగామా.. సామాజిక విశ్లేషణ**

అడ్వకేట్, ప్రెస్, పోలీస్, ఆర్మీ వంటి వృత్తిపరమైన గుర్తులు ఒకెత్తయితే.. ఎమ్మెల్యే, ఎంపీ, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ వంటి రాజకీయ పదవుల హంగామా మరో ఎత్తు. వీటికి తోడు కుల సంఘాల పేర్లు, 'గౌడ్స్ జాబ్స్' వంటి సామాజిక వర్గ గుర్తింపులు కూడా వాహనాలపై రాజ్యమేలుతున్నాయి. ఈ నేపథ్యంలో, హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చట్టబద్ధతను కాపాడటంతో పాటు సామాన్యుడికీ, పాలకుడికి మధ్య ఉన్న అదృశ్య విభజనను తొలగించడానికి ఒక సాహసోపేతమైన అడుగుగా భావించవచ్చు.

**చట్టం అమలులో సందిగ్ధత..**
**సామాన్యుడి సందేహం**

అయితే, ఈ నిబంధనల అమలు ప్రక్రియలో ఒక స్పష్టమైన వైరుధ్యం మరియు నైతిక సందిగ్ధత నెలకొంది. చట్టం కాగితం మీద అందరికీ సమానమే అని ఉద్ఘాటిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో దాని అమలు తీరుపై సామాన్య పౌరుల్లో ప్రబలమైన అనుమానాలు ఉన్నాయి. సాధారణ పౌరుడు తన వాహనంపై ఏదైనా చిన్న స్టిక్కర్ వేసుకుంటే వెనువెంటనే జరిమానా అస్త్రం ప్రయోగించే యంత్రాంగం, మరి అధికార యంత్రాంగంలో భాగమైన పోలీస్, ఆర్మీ, కలెక్టరేట్ వంటి బలమైన విభాగాల ఉద్యోగుల విషయంలో అదే కఠినత్వాన్ని, నిష్పాక్షికతను ప్రదర్శించగలదా అన్నదే అసలు ప్రశ్న. ఒక సామాన్య ట్రాఫిక్ కానిస్టేబుల్ తన పైఅధికారి ప్రైవేటు వాహనాన్ని ఆపి, నంబర్ ప్లేట్‌పై ఉన్న 'పోలీస్' ముద్రను తొలగించమని ఆదేశించే నైతిక స్థైర్యాన్ని కలిగి ఉంటాడా? లేదా ఒక ప్రభావశీల రాజకీయ నాయకుడి వాహనంపై ఉన్న ఎంపీటీసీ, సర్పంచ్ బోర్డులను తొల గించే ధైర్యం రవాణా శాఖకు ఉందా?

**దుర్వినియోగం..అప్రకటిత**
**మినహాయింపుల వేట**

నిజానికి, ఈ హోదాల ప్రదర్శన అనేది కేవలం వృత్తిపరమైన గుర్తింపు కోసం మాత్రమే కాదు, అదొక 'అప్రకటిత మినహాయింపు' (Privilege) పొందే సాధనంగా మారిపోయింది. ట్రాఫిక్ ఉల్లంఘనల నుండి సులభంగా తప్పించుకోవడానికి, టోల్ ప్లాజాల వద్ద చట్టవిరుద్ధమైన వెసులుబాటు పొందడానికి, లేదా సమాజంలో ఒక రకమైన భీతిని కలిగించి గౌరవాన్ని ఆశించి ఈ గుర్తులను వాడుతున్నారు. చట్టపరంగా 'ఇంపర్సనేషన్' అంటే తగిన అర్హత లేకపోయినా ఒక హోదాను ఆపాదించుకోవడం తీవ్రమైన నేరం. ఉదాహరణకు, అధికారిక అక్రిడిటేషన్ లేని వారు 'ప్రెస్' అని రాసుకోవడం వల్ల నిజమైన జర్నలిస్టుల విశ్వసనీయత దెబ్బతినడమే కాకుండా, పోలీసు విచారణలకు కూడా విఘాతం కలుగుతుంది. అదే విధంగా, కాలం చెల్లిన మాజీ పదవులను కూడా ప్రస్తుత హోదాల వలె ప్రదర్శించడం ప్రజలను తప్పుదారి పట్టించడమే అవుతుంది.

**మార్పు ఎక్కడ మొదలవ్వాలి?**

ఈ సంస్కరణ విజయవంతం కావాలంటే, మార్పు అనేది అధికారిక సోపాన క్రమంలో ఉన్నత స్థాయి నుండే ప్రారంభం కావాలి. ప్రభుత్వమే ఒక చట్టబద్ధమైన ఆదర్శంగా నిలిచి, తన సచివాలయాలు, కలెక్టరేట్ పార్కింగ్ స్థలాల్లో ఉన్న అధికారుల ప్రైవేటు వాహనాలపై ఉన్న అనధికారిక లోగోలను ముందుగా తొలగింపజేయాలి. ప్రజా ప్రతినిధులు తామే స్వచ్ఛందంగా తమ వాహనాలపై ఉన్న అదనపు బోర్డులను తొలగించుకుని 'చట్టం ముందు అందరూ సమానమే' అన్న రాజ్యాంగ సూత్రానికి కట్టుబడి ఉం డాలి. కులాల పేర్లు లేదా సామాజిక వర్గాల గుర్తింపులు రహదారిపై ప్రయాణించేటప్పుడు అనవసరమైన వర్గ విభేదాలకు, సామాజిక ఉద్రిక్తతలకు దారితీసే ప్రమాదం ఉంది. ప్రజాస్వామ్యంలో రహదారిపై వెళ్తున్న ప్రతి పౌరుడూ సమానమే.

**సమానత్వమే ప్రజాస్వామ్య లక్ష్యం**

తెలంగాణ రాష్ట్రం ఒక క్రమశిక్షణతో కూడిన, పారదర్శకమైన రవాణా వ్యవస్థను నిర్మించాలనుకోవడం అభినందనీయం. కానీ, ఈ నిబంధనల అమలులో 'బలవంతుడికి ఒక న్యాయం – బలహీనుడికి ఒక న్యాయం' అనే వివక్ష కనిపిస్తే ఈ ఉత్తర్వుల పరమార్థం నీరుగారిపోతుంది. జరిమానాల వసూలు మాత్రమే ధ్యేయంగా కాకుండా, పౌర బాధ్యతను పెంపొందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలి. డిజిటల్ విప్లవం ద్వారా వాహన యజమాని సమగ్ర వివరాలను క్షణాల్లో తెలుసుకునే సాంకేతికత అందుబాటులో ఉన్న నేటి కాలంలో, నంబర్ ప్లేట్లపై హోదాల అవసరం ఏమాత్రం లేదు. చట్టసభల్లో చట్టాలు చేసేవారే వాటిని శిరసావహిస్తే, సామాన్య ప్రజలు వాటిని అనుసరించడానికి ఎటువంటి సంకోచం చూపరు. అప్పుడే తెలంగాణ రహదారులు హోదాల హంగామా నుండి విముక్తి పొంది, చట్టబద్ధమైన పాలనకు నిదర్శనంగా నిలుస్తాయి.

# అక్షర మాయలు



అక్రమాల డొంకలు కదిలిస్తా.

అక్షరమెరుపులు మెరిపిస్తా –
ఆకాశదేశమును వెలిగిస్తా.
అక్షరసిరులు అందిస్తా –
ఆస్తిపరులుగా మారుస్తా.

అక్షరసందేశాలు పంపిస్తా –
పాఠకులమదులను మురిపిస్తా.
అక్షరముత్యాలు చల్లుతా –
సరాలు గుచ్చి ధరించమంటా.

అక్షరపూజలు జరిపిస్తా –
అంతర్యామి అనుగ్రహం కురిపిస్తా.
అక్షరవిద్యను అందిస్తా –
అజ్ఞానాంధకారమును తరిమేస్తా.

అక్షరనృత్యం చేయిస్తా –
అప్సరసల అందాలు చూపిస్తా.
అక్షరపాటలు పాడిస్తా –
గాంధర్వగానం వినిపిస్తా.

అక్షరమేళం వాయిస్తా –
అంతరంగాలను ఆడిస్తా.
అక్షరతీగలు లాగిస్తా –




గుండ్లపల్లి
రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం

**ప్రపంచ ప్రసిద్ధ గొప్ప జాతరలు**

మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర (భారతదేశం): తెలంగాణలో జరిగే ఈ జాతర ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధి చెందింది. కోట్లాది మంది భక్తులు తరలివచ్చి వనదేవతలకు 'బంగారం' (బెల్లం) సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.



అధికారులతో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



సమావేశంలో మాట్లాడుతున్న వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

## నామినేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

### వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. బుధవారం వికారాబాద్ మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నామినేషన్లు స్వీకరించే సమయంలో అభ్యర్థులు జత చేయాల్సిన ధ్రువీకరణ పత్రాల వివరాలను స్పష్టంగా తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఏవైనా సందేహాలు తలెత్తితే స్వంత నిర్ణయాలు తీసుకోకుండా వెంటనే పై అధికారులను సంప్రదించి సమస్యలను నివృత్తి చేసుకోవాలని తెలిపారు. కలెక్టర్ నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన సమయంలో మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ అధికారులు, పాల్గొన్నారు.

**వనపర్తిలో..**

మున్సిపల్ ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించడంలో నోడల్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదర్శ్ సురభి స్పష్టం చేశారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ యాదయ్యతో కలిసి ఎన్నికల నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈసందర్భంగా నోడల్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చిందని, దానిని అధికారులు కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి అధికారి తనకు కేటాయించిన బాధ్యతలను ఎలాంటి లోపాలు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని నోడల్ అధికారి, డిఆర్డిఓ ఉమాదేవికి సూచించారు. అలాగే ఎప్పటికప్పుడు నివేదికలు పంపాలని ఆదేశించారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ అనంతరం వాటిని పోలీసు రక్షణలో జిల్లాకు తరలించే బాధ్యతను సంబంధిత నోడల్ అధికారి అయిన మత్స్యశాఖ అధికారికి అప్పగించారు. నోడల్ అధికారులు తమకు కేటాయించిన విభాగాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల నిబంధనలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ ఉమాదేవి, మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప, డిప్యూటీ సీఈవో రామ మహేశ్వర్, డిపిఆర్ఓ సీతారాం, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అఫ్జాలుద్దీన్, డిటిఓ మానస పాల్గొన్నారు.

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో..**

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మున్సిపల్ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ మయాంక్ మిట్టల్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే స్వీకరించాలని సూచించారు. బుధవారం రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి సంబంధించి ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జనరల్ అబ్జర్వర్ మయాంక్ మిట్టల్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి. నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌లతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా జనరల్ అబ్జర్వర్ మాట్లాడుతూ.. నామినేషన్ ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న అభ్యర్థుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, దాఖలైన నామినేషన్లకు సంబంధించిన నివేదికలను సకాలంలో జిల్లా కేంద్రానికి పంపించాలని ఆదేశించారు. ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరిశీలనలో జనరల్ అబ్జర్వర్ వెంట ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**- 24గంటలు ఫిర్యాదుల స్వీకరణకు టోల్ ఫ్రీ నెంబర్..**

కొంగర కలాన్ రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన మీడియా, ఫిర్యాదుల, ఎంసీఎంసి విభాగాలను బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ నం. 9849906949 ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై కంట్రోల్ రూమ్ కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కంట్రోల్ రూమ్ లో 24గంటలు సిబ్బంది అందుబాటులో ఉండి ఫిర్యాదులను రిజిష్టర్లో నమోదు చేసుకుంటారని తెలిపారు.

## బాల్యవివాహాలను నిర్మూలించాలి

### జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వీ రజని




**ముద్ర, వనపర్తి:** బాల్యవివాహాల రహిత భారతదేశాన్ని నిర్మించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వి.రజని పిలుపునిచ్చారు. బాల్యవివాహ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సంకిరెడ్డిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్యవివాహాలకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరూ చట్టప్రకారం శిక్షార్హులేనని స్పష్టం చేశారు. బాల్యవివాహానికి గురైన బాధితులు మేజర్ అయిన తర్వాత రెండేళ్లలోపు జిల్లా ప్రధాన న్యాయస్థానంలో వివాహ రద్దు కోసం పిటిషన్ దాఖలు చేసుకునే హక్కు ఉందని తెలిపారు. బాల్యవివాహ ముక్త్ భారత్ లక్ష్యాన్ని సాధించాలంటే సమాజం మొత్తం బాల్యవివాహాలకు వ్యతిరేకంగా నిలబడి, బాల్యవివాహ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాల కార్మికుల నిర్మూలన చట్టం, పోక్సో చట్టం, డ్రగ్ అబ్యూస్ నిరోధక చట్టాలు, మోటార్ వాహనాల చట్టం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మైనర్ విద్యార్థులు వాహనాలు నడపబోమని ప్రతిజ్ఞ చేశారు. అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రఘు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణయ్య ఉపాధ్యాయులున్నారు.

## ప్రేమ మోజులో ఘోరం

### తల్లిదండ్రులను హతమార్చిన కుమార్తె

### మత్తు ఇంజెక్షన్లు ఇచ్చి హత్య చేసినట్లు పోలీసుల నిర్ధారణ

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా బంట్వారం మండలంలో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. ప్రియుడి ప్రేమ మోజులో పడి కుమార్తె తన తల్లిదండ్రులకు మత్తు ఇంజెక్షన్లు ఇచ్చి హతమార్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను డీఎస్పీ వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. తల్లిదండ్రులు కాళ్ల నొప్పులు తగ్గుతాయని చెప్పి మొదట తల్లికి, అనంతరం తండ్రికి అధిక మోతాదులో మత్తుమందు ఇంజెక్షన్లు ఇచ్చింది. దీని ప్రభావంతో ఇద్దరూ అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందారు. ఈ విషయం గమనించిన కుమార్తె, తన సోదరునికి ఫోన్ చేసి తల్లిదండ్రులు అపస్మారక స్థితిలో ఉన్నారని చెప్పడంతో అతడు హుటాహుటిన ఇంటికి చేరుకున్నాడు. తల్లిదండ్రులను ఆసుపత్రికి తరలించేలోపే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రారంభంలో అప్పుల బాధతో భార్యాభర్తలు ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు భావించినప్పటికీ, కుమార్తె ప్రవర్తనపై అనుమానం రావడంతో లోతుగా విచారణ చేపట్టారు. తమదైన శైలిలో విచారణ జరిపిన పోలీసులు, చివరకు కుమార్తే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు గుర్తించారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**ముద్ర, మల్కాజిగిరి:** మెరుగైన వైద్య చికిత్స కోసం పేద ప్రజలు ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సూచించారు. వినాయక్ నగర్ డివిజన్‌కు చెందిన అర్హులైన లబ్ధిదారులకు మొత్తం రూ.2 లక్షల 49వేల 500 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకుని వాటి లబ్ధి పొందాలని కోరారు.



## ఉప్పల్ అభివృద్ధే లక్ష్యం

### ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి

**కాప్రా, ముద్ర:** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ల అభివృద్ధి కోసం శక్తి వంచనా లేకుండా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. సుమారు రూ.20లక్షల అంచనా వ్యయంతో సరస్వతీనగర్ కాలనీలో ఖాళీ స్థలంలో వాకర్స్ కోసం ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌ను బుధవారం స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా వాకింగ్ ట్రాక్‌కు అనుబంధంగా ఒక స్టోర్ రూమ్‌ను కూడా నిర్మించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో నియోజకవర్గ పరిధిలోని అన్ని కాలనీల్లో అవసరమైన అభివృద్ధి పనులను అధికారులతో సమన్వయం చేసుకుని పూర్తి చేస్తామని తెలిపారు. స్థానికుల కోరిక మేరకు త్వరలోనే ఇక్కడ ఓపెన్ జిమ్‌ను కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈ ఉమామహేశ్వరి, ఏఈ సూరజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, బాపూజీ నగర్–సరస్వతీనగర్ కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**రామంతాపూర్‌కు పోలీస్ స్టేషన్..**

రామంతాపూర్ ప్రాంత ప్రజల దీర్ఘకాలిక కోరిక నెరవేరింది. రామంతాపూర్‌లో నూతన పోలీస్ స్టేషన్ ఏర్పాటు కావడంతో ప్రజలకు మరింత భద్రతతో పాటు సత్వర న్యాయం అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. రామంతాపూర్ పోలీస్ స్టేషన్ ప్రారంభంతో శాంతిభద్రతలు మరింత మెరుగుపడతాయని, ప్రజల సమస్యలకు తక్షణమే పరిష్కారం లభిస్తుందన్నారు.



## ధరణి నగర్ నాలా విస్తరణ పనులు పూర్తి చేయాలి



**ముద్ర, ధరణి నగర్:** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ధరణి నగర్‌లో నాలా విస్తరణ పనుల లో భాగంగా అసంపూర్తిగా మిగిలిపోయిన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అధికారులను ఆదేశించారు. ఎస్ఎన్డీపీ ఇంజనీరింగ్ విభాగం చీఫ్ ఇంజనీర్ శ్రీమతి శ్రీలక్ష్మీ, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలిసి ఆయన ధరణి నగర్ నాలా విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ మాట్లాడుతూ.. నాలాల విస్తరణ పనులతో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గతంలో శంకుస్థాపన చేసి అసంపూర్తిగా మిగిలిపోయిన నాలా విస్తరణ పనులను ఇక పై ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. నాలా విస్తరణ పనులలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తప్పకుండా త న దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఈ పీవీ రావు, డీఈ దీరజ్, ఏఈ పవన్, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, కాశీనాథ్ యాద వ్, హరినాథ్, నరేందర్ బల్లా, కాలనీ వాసులు పాల్గొన్నారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కును పంపిణీ చేసిన ఆరెకపూడి గాంధీ..**

వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ కాలనీకి చెందిన పోలె రాములు వైద్య చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ కు దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.60వేల చెక్కును పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహా య నిధి పేద ప్రజలకు గొప్ప వరమని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు వందలాది కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘు నాథ్ రెడ్డి, అక్బర్ ఖాన్, ఖాసీం, లియాకత్ ఉన్నారు.

**థీమ్ పార్క్‌ను పచ్చదనం, మౌలిక వసతులతో అభివృద్ధి చేయాలి..**

చందానగర్ డివిజన్ పరిధిలోని వెంకటాద్రి నగర్ కాలనీలో రూ.2కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న థీమ్ పార్క్ సుందరీకరణ, అభివృద్ధి పనులను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తో కలిసి పార్క్ అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంకటాద్రినగర్ థీమ్ పార్క్‌ను అన్ని హంగులతో, అవసరమైన మౌలిక వసతులతో సుందరంగా అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని అధికారులను ఆదేశించారు. సుందరీకరణ, అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టి, ఎక్కడా రాజీ పడకుండా వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. పార్కులో పూలు, పండ్లు, ఆరోగ్యానికి ఉపయోగపడే మొక్కలు నాటి వాటి పరిరక్షణకు వెంకటాద్రి నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు డీఈ శ్రీదేవి, మాజీ కౌన్సిలర్లు రఘుపతి రెడ్డి, రవీందర్ రావు, నాయకులు ర ఘునాథ్ రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, మణిక్యాల రావు, బంగారాజు, సత్యనారాయణ, నరేందర్ బల్లా, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ జిమ్ స్థలంలో పార్క్‌కు అభ్యంతరం

**ముద్ర, మల్కాజిగిరి:** ఓల్డ్ మల్కాజిగిరి పరిధిలోని హనుమాన్ వ్యాయామశాలకు చెందిన ఖాళీ స్థలంలో పార్క్ నిర్మాణం చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేయడంతో స్థానిక కాలనీ వాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ స్థలం కాలనీలో ఉన్న ఏకైక ఖాళీ ప్రదేశమని, పేద ప్రజలు ఇక్కడ వివాహాలు నిర్వహించుకుంటారని, పక్కనే ఉన్న హనుమాన్ దేవాలయంలో అన్న దాన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అలాగే అయ్యప్ప భక్తులు పూజలు నిర్వహించేందుకు ఈ స్థలాన్ని వినియోగిస్తున్నారని తెలిపారు. ఇలాంటి ముఖ్యమైన సామాజిక, ధార్మిక అవసరాలు ఉన్న నేపథ్యంలో ఈ స్థలంలో పార్క్ నిర్మాణం చేపట్టవద్దని వారు కోరారు. ఈ క్రమంలో కాలనీ వాసులు మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్‌తో కలిసి జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌లకు వినతిపత్రం అందజేశారు. పార్క్‌కు బదులుగా రూ.50 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అనుమతి మంజూరు చేయాలని వారు కోరారు. దీనిపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు కాలనీ వాసులు తెలిపారు. ఈ కా ర్యక్రమంలో బాబయ్య, నరహరి, సతీష్, శ్రీకాంత్, గన్న, అశోక్, జెమినీ, శ్రీను, వినోద్, మధు, ఎట్టాలు అక్క, రాధమ్మ పాల్గొన్నారు.




## మరుగు దొడ్లు లేని పాఠశాలలు సహించబోం

**ముద్ర, నారాయణపేట :** జిల్లాలో మరుగు దొడ్లు లేని పాఠశాలలు ఉండరాదని కలెక్టర్ సిక్తా పట్నాయక్ స్పష్టం చేశారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ పాఠశాలల్లో కొనసాగుతున్న నిర్మాణ పనులను మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో విద్యాశాఖ, ఇంజనీరింగ్ శాఖ అధికారులతో పాఠశాలల్లో జరుగుతున్న వివిధ నిర్మాణ పనులపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు వివరాలు వెల్లడిస్తూ.. జిల్లాలోని 11 కేజీబీవీలకు సమగ్ర శిక్ష నిధుల ద్వారా రూ.2 కోట్లు మంజూరయ్యాయని, అందులో మూడు కేజీబీవీలలో పనులు పూర్తయ్యాయని తెలిపారు. జిల్లాలోని 11 భవిత కేంద్రాల్లో మూడు పూర్తికాగా, మిగిలిన ఎనిమిది కేంద్రాల్లో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పీఎంశ్రీ పథకం కింద చేపడుతున్న పాఠశాల అభివృద్ధి పనులను కూడా మార్చిలోగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇంకుడు గుంతల పనులు ఇప్పటికీ ఎందుకు ప్రారంభించలేదని కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి రెండు సార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదని టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ కలెక్టర్‌కు వివరించారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను గుర్తించి వాటిని కూల్చివేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే మరుగు దొడ్లు లేని పాఠశాలలను గుర్తించి డీఆర్‌డీఏకు లేఖ రాసి, ఏఎన్‌జీఆర్ఈజీఎస్ పథకం ద్వారా మరుగు దొడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా కూడా మరుగు దొడ్లు లేని పాఠశాలలు ఉండరాదని ఆమె స్పష్టం చేశారు.





సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 29-01-2026
www.mudranews.in | @mudranews



### ప్రపంచ ప్రసిద్ధ గొప్ప జాతరలు
**పుష్కర్ మేళా (భారతదేశం)**

రాజస్థాన్ లోని పుష్కర్ లో జరిగే ఈ జాతర ప్రపంచంలోనే అతా పెద్ద ఒంటెల సంతకు వేదికగా నిలుస్తుంది. ఇది కేవలం పశువుల వ్యాపారమే కాకుండా, రాజస్థాన్ సంస్కృతిని ప్రతిబింబించే జానపద కళలు మరియు ఆటలకు ప్రసిద్ధి.



# కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

- డిసిసి కార్యాలయంలో కాంగ్రెస్ టికెట్ ఆశావహులతో మంత్రుల ముఖాముఖి భేటీ
- గెలిచే అభ్యర్థుల ఎంపికలో సమన్వయమే కీలకం : దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- కార్యకర్తల శ్రమకే తొలి ప్రాధాన్యం : జిల్లా ఇంచార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ప్రజా పాలనపై ప్రజల్లో అపూర్వ స్పందన, సంక్షేమ పథకాలతో కాంగ్రెస్ బలం: పొన్నం ప్రభాకర్
- అసంతృప్తిని పక్కనబెట్టి కాంగ్రెస్ విజయం కోసం సమిష్టి పోరాటం : మేడిపల్లి సత్యం పిలుపు





**ముద్ర, కరీంనగర్:**
కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ టికెట్ ఆశిస్తూ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులతో చొప్పదండి ఎమ్మెల్యే కరీంనగర్ డిసిసి అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం అధ్యక్షతన డిసిసి కార్యాలయం (ఇందిరా గార్డెన్స్) లో ముఖాముఖి సమావేశం బుధవారం ఏర్పాటు చేశారే. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ, సహకార, జిల్లా ఇంచార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూరు ఎమ్మెల్యే టిపిసిసి ఎస్ సి సెల్ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్య నారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, కాంగ్రెస్ నేత ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డ, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ తో పాటు పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రతి కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇప్పటికే పలుమార్లు సర్వే చేయించడం జరిగిందని, కార్యకర్తలు అందరిని సమన్వయం చేయాలనే ధోరణితో ముందుకు వెళ్తున్నామన్నారు. జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్ కు గాని నాకు గాని అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు గాని ఉన్నది ఒకటే ఇంట్రెస్ట్ అది కేవలం కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు న్యాయం చేయడమేనని అన్నారు. పార్టీ నాయకత్వం తీసుకుంటున్న నిర్ణయానికి అనుగుణంగా ముందుకు పోవాలన్నారు. అందరం సమిష్టిగా ఆలోచన చేసుకుని ముందుకు వెళ్లే విధంగా మేము ప్రయత్నం చేస్తామని, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పై జెండా ఎగరవేయడం ఖాయమని అన్నారు.

అనంతరం జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సోనియా గాంధీ తెలంగాణ ప్రజల అభీష్టం నెరవేర్చారని అన్నారు. పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో రాష్ట్ర అభివృద్ధి చిన్నాభిన్నమయ్యిందని, 70 శాతం మంది కార్యకర్తలను మొన్న జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో గెలిపించుకోవడం జరిగిందన్నారు. కార్యకర్తలు గెలిచిన స్థానాల్లో కూర్చోవడం పట్ల సంతోష పడేది కాంగ్రెస్ పార్టీ అధిష్టానమేనని అన్నారు. మున్సిపల్ ఎన్నికలు ముగిసిన తర్వాత కష్టపడ్డ ప్రతి కార్యకర్తను నామినేటెడ్ పదవుల్లో నియమించి వారికి న్యాయం చేసే విధంగా జిల్లా నాయకత్వం కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో అన్ని కార్పొరేషన్ల కంటే అత్యధిక ప్రాధాన్యత కలిగిన కార్పొరేషన్ కరీంనగర్ అని, దరఖాస్తు చేసుకున్న ప్రతి అభ్యర్థి దరఖాస్తు పరిశీలించడం జరుగుతుందని, ఎవరికి ఎలాంటి అపోహలు వద్దన్నారు.

రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.ప్రజా పాలన ప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో గ్రామాల వలె పట్టణాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక తో ముందుకు పోతున్నామని, ఇప్పటికే పట్టణాల్లో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి.. కరీంనగర్ కార్పొరేషన్ లో అభ్యర్థుల ఎంపికకు 66 సీట్లలో సర్వే జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా ప్రజా పాలనపై ప్రజలు పాజిటివ్ గా ఉన్నారు.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజల్లో వివరిస్తూ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. పోటీ చేసే ఆశావహులు వార్డుల్లో తిరుగుతూ బలోపేతం చేయాలి.. టికెట్ ఎవరికి వచ్చిన.. అందరూ కలిసి సమన్వయం చేసుకుంటూ గెలవాలని సూచించారు. రాజకీయాల్లో విశేష అనుభవం ఉన్న తుమ్మల నాగేశ్వరరావు కరీంనగర్ ఇంచార్జిగా ఉన్నారు.. సెలెక్ట్ ఎలెక్ట్ ద్వారా మీకు మీరే వార్డుల్లో అభ్యర్థులను ఎంపిక చేసుకొని, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కైవసం చేసుకునేలా కృషి చేయాలని కోరారు.

చొప్పదండి ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షుడు మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల రెక్కల కష్టంతో ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత దేశంలో ఏ ప్రభుత్వం ఏ పార్టీ చేయని విధంగా రాష్ట్రంలో గత ప్రభుత్వం లక్షల కోట్ల అప్పు చేసినప్పటికీ.. ఎన్నో సంక్షేమ పథకాలను ప్రారంభిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అందజేస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకు చేరవేస్తూ కార్యకర్తలు కృషి చేస్తే కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా గెలవదో చూద్దామన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలను కొనసాగించడంతోపాటు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. కరీంనగర్ కార్పొరేషన్ పై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగిరే విధంగా ప్రతి ఒక్కరు పని చేయాలని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కాంగ్రెస్ పార్టీ జెండా తప్ప ఈర్ష్య దేశాలు ఉండకూడదని సూచించారు. కరీంనగర్ లో హేమాహేమీలు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.. అన్ని వర్గాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ జిల్లాపై పూర్తి అవగాహన కలిగిన వారు ఉన్నారనొ, అందరం సమిష్టిగా కష్టపడితే కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనే దమ్ము ఎవరికీ లేదన్నారు.

# సింహం గుర్తుపై 'జాగృతి' పోటీ

**మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి – ఫార్వర్డ్ బ్లాక్ తో కీలక ఒప్పందం**



**ముద్ర, కరీంనగర్:**
మున్సిపల్ ఎన్నికల్లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సింహం గుర్తుపై తెలంగాణ జాగృతి ఔత్సాహిక అభ్యర్థులు పోటీ చేయనున్నట్లు పార్టీ నేతలు ప్రకటించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం హైదరాబాద్ లోని ఫార్వర్డ్ బ్లాక్ కార్యాలయంలో కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కల్వకుంట్ల కవిత హాజరు కాగా, ఫార్వర్డ్ బ్లాక్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ జావెద్ లతీఫ్, ఉపాధ్యక్షుడు కె. బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కలిసి పని చేయడమే కాకుండా, భవిష్యత్తులో కూడా ఉమ్మడి రాజకీయ కార్యాచరణతో ముందుకెళ్లాలని ఇరు పక్షాలు నిర్ణయానికి వచ్చాయి.

సమావేశంలో ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కన్వీనర్ జోజిరెడ్డి, సెంట్రల్ కమిటీ సభ్యులు ఆర్.వి.ఆర్. ప్రసాద్, తేజ్ దీప్ రెడ్డి, కొండ దయానంద్, ప్రధాన కార్యదర్శి కోమటిరెడ్డి తేజ్ దీప్ రెడ్డి, ఫైనాన్స్ సెక్రటరీ కె. నరేందర్ పాల్గొన్నారు. అలాగే నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు గౌడ్, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి బీరన్న, నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రాము, ఐవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆదిత్య, జనరల్ సెక్రటరీ కృష్ణమూర్తి సహా పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు.

ఈ సందర్భంగా మాట్లాడిన నేతలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల సమస్యలను ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ పొత్తు కుదిరిందని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, స్థానిక అభివృద్ధి అంశాలపై ఉమ్మడి కార్యాచరణతో ఎన్నికల్లో బలమైన పోటీ ఇస్తామని స్పష్టం చేశారు. మొత్తంగా, తెలంగాణ జాగృతి—ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ మధ్య కుదిరిన ఈ అవగాహన ఒప్పందం మున్సిపల్ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీయనుందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# కరీంనగర్ కార్పొరేషన్ పై కాంగ్రెస్ జెండా ఖాయం

**కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్-చార్జి వెలిచాల రాజేందర్ రావు**



**ముద్ర, కరీంనగర్:**
రాబోయే నగరపాలక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక విజయం సాధించి, మేయర్ పీఠాన్ని దక్కించుకోవడం ఖాయమని కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్ చార్జి వెలిచాల రాజేందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం నగరంలో జరిగిన పలు ఎన్నికల కార్యక్రమాల్లో ఆయన పాల్గొని కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు.

నగరపాలక సంస్థ కార్యాలయంలో కాంగ్రెస్ అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. 35వ డివిజన్ దుగ్గు హారిక మహేందర్, 44వ డివిజన్ చాడగొండ కవిత బుచ్చిరెడ్డి నామినేషన్ల కార్యక్రమంలో రాజేందర్ రావు పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే కరీంనగర్ అభివృద్ధి సాధ్యమని ప్రజలు బలంగా నమ్ముతున్నారని, అందుకే అభ్యర్థులకు భారీ మెజార్టీ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

**'బీఆర్ఎస్, బీజేపీలను బండకేసి కొట్టండి'**

9వ డివిజన్ కోతిరాంపూర్ లో పడిశెట్టి వసంత లక్ష్మి భూమయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని రాజేందర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

"బీఆర్ఎస్, బీజేపీలతో ప్రజలకు వచ్చే ప్రయోజనం ఏమీ లేదు. ఏ పని కావాలన్నా అది కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం. రాబోయే ఎనిమిదేళ్ల పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటుంది. అభివృద్ధి జరగాలంటే కార్పొరేషన్ లో కాంగ్రెస్ గెలవాలి." అని వెలిచాల రాజేం దర్ రావు పేర్కొన్నారు.

**కాంగ్రెస్ లోకి భారీగా చేరికలు**

అభివృద్ధి మంత్రం, రాజేందర్ రావు నాయకత్వంపై నమ్మకంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన మహిళా నాయకులు కాళిదాసు రేణుక, తిరుమల తదితరులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. 9వ డివిజన్ ను నగరంలోనే అత్యుత్తమ డివిజన్ గా తీర్చిదిద్దుతామని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు చిందం శ్రీనివాస్, అనంతుల రమేష్, వజీరు, మాజీ కార్పొరేటర్ ఆకుల నరసన్న, శ్యాంసుందర్ రెడ్డి, పడిశెట్టి వసంతలక్ష్మి భూమయ్యతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు, డివిజన్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# నిబంధనల ప్రకారం నామినేషన్ ప్రక్రియ చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**ముద్ర, కరీంనగర్:**
ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా హుజురాబాద్, జమ్మికుంట మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను కలెక్టర్ బుధవారం సందర్శించారు. నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, నామినేషన్ ఫారాలు, రిజిస్టర్లను పరిశీలించారు. వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటి చేసే అభ్యర్థుల ప్రకటన తదితర ప్రక్రియలు పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దాఖలైన నామినేషన్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, వెంటవెంటనే రోజు వారీగా టీ.పోల్ యాప్ లో అప్లోడ్ చేయాలని అన్నారు. అభ్యర్థులు అన్ని వివరాలతో నామినేషన్ పత్రాలను దాఖలు చేసేలా హెల్ప్ డెస్క్ ద్వారా అవగాహన కల్పించాలని, వారి సందేహాలు నివృత్తి చేయాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి కట్టుబడి, మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో ఎన్నికల సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ ఎండి. ఆయాజ్, హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్ ఉన్నారు.

**నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే**

చొప్పదండి మున్సిపాలిటీలో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే బుధవారం పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల్లో ఏర్పాట్లను పర్యవేక్షించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. హెల్ప్ డెస్క్ వద్ద అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాలని అన్నారు. ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని, శాంతియుత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. దాఖలైన నామినేషన్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలని వెనువెంటనే టీ పోల్ యాప్ లో అప్లోడ్ చేయాలని అన్నారు. చొప్పదండి మున్సిపల్ పరిధి లోని వార్డు స్థానాలకు దాఖలైన నామి నేషన్ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో సమ్మక్క సారక్క జాతర

**ముద్ర, కరీంనగర్:**
స్థానిక కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో జాతర మహోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సమ్మక్క సారక్క జాతర మహోత్సవం తెలంగాణలో అతిపెద్ద గిరిజన పండుగని, కుంభమేళా తలపించే విధంగా ఈ మహోత్సవాన్ని మేడారం తో పాటు ఇతర ప్రాంతాల్లో సైతం ఘనంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి సమ్మక్క-సారక్క చిత్రపటాలకు పూజలు చేసి శుభాకాంక్షలు తెలియజేసి జాతర ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మేడారంలో నిర్వహించే ఈ జాతరకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉన్నదని, 2014లో అప్పటి తెలంగాణ ప్రభుత్వం ఈ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించిందని, రెండేళ్ల ఒకసారి నిర్వహించే ఈ పండుగ మన రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాలైన ఛత్తీస్గడ్, ఒరిస్సా, జార్ఖండ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతాల నుండి అత్యధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవార్లను దర్శించు కుంటారని చెప్పారు.

ఈ సందర్భంగా ప్రాంగణాన్ని సంప్రదాయబద్ధంగా అలంకరించారు. వేడుకలను భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సమ్మక్క సారక్క వైభవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రపంచ ప్రసిద్ధ గొప్ప జాతరలు

అక్టోబర్‌ఫెస్ట్ (జర్మనీ): జర్మనీలోని మ్యూనిచ్‌లో జరిగే ఇది ప్రపంచంలోనే అతిపెద్ద బీర్ పండుగ మరియు జానపద ఉత్సవం. ఏటా లక్షలాది మంది పర్యాటకులు ఇక్కడి సాంప్రదాయ ఆహారం, సంగీతం మరియు వేడుకల్లో పాల్గొనేందుకు తరలివస్తారు.



# నగరాల అభివృద్ధే ఎజెండా

- మురుగునీటి కాల్వల శాశ్వత పరిష్కారం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి

**ముద్ర, ఖమ్మం:**

ఖమ్మం నగరంలో మురికి కాల్వల సమస్యలకు శాశ్వత పరిష్కారానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం 21 వ డివిజన్ లో రూ. 545.60 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.., ఖమ్మం నగరంలో మురికి కాల్వల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు నిర్మాణానికి రూ. 1250 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో కేంద్ర ప్రభుత్వ నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం చేపడతామని మంత్రి తెలిపారు. ఖమ్మం నగరంలో తాగునీటి సమస్య లేకుండా మరో 250 కోట్లతో తాగునీటి పథకం పనులు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా తదితరులు పాల్గొన్నారు.





# నిబంధనలు పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియను చేపట్టాలి

- భువనగిరి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హనుమంత రావు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

మున్సిపల్ ఎన్నికల్లో నేపథ్యంలో ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, ఎన్నికల విధుల పట్ల జాగరూకతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హనుమంత రావు ఆదేశించారు. బుధవారం భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట, మోత్కూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్ కౌంటర్లు, హెల్ప్‌డెస్క్, భద్రతా ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని భువనగిరి, ఆలేరు యాదగిరిగుట్ట, పోచంపల్లి, మోత్కూర్, చౌటుప్పల్ మున్సిపాలిటీలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ కోసం అన్ని రకాల సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నేటి నుంచి ఈ నెల 30 వరకు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ నామినేషన్లు స్వీకరించాలని అధికారులకు సూచించారు. అన్ని పత్రాలు సమగ్రంగా ఉన్నప్పుడే నామినేషన్‌ను స్వీకరించాలని స్పష్టం చేశారు. నామినేషన్ దాఖలులో అభ్యర్థులకు ఏవైనా సందేహాలు ఉంటే హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించేలా అవగాహన కల్పించాలని, అవసరమైన సూచనలు ముందుగానే అందించాలని అధికారులను ఆదేశించారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ తేదీలను కూడా అభ్యర్థులకు స్పష్టంగా తెలియజేయాలని, ఎన్నికల ప్రక్రియ మొత్తం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు.

## 50 కేజీల గంజాయి పట్టివేత

**ముద్ర, భద్రాచలం :**

ఒరిస్సా మల్కాన్గిరి జిల్లా నుంచి కేరళకు కారులో అక్రమంగా తరలిస్తున్న 50.4 కేజీల గంజాయిని ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ సిబ్బంది పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.తిరుపతి ఆధ్వర్యంలో ఎస్సై సీహెచ్.శ్రీహరి రావు, సిబ్బంది కలిసి భద్రాచలం to నెల్లిపాక రోడ్డు లో తనిఖీలు తనిఖీలు నిర్వహిస్తుండగా భద్రాచలం ఇసుక రీచ్ సమీపం లో అనుమానాస్పదంగా కనిపించిన ఒక కారులో 50.4 కేజీల గంజాయి లభ్యమైంది. కేరళకు చెందిన తిరువనంతపురం, అక్షయ్ సురేష్, కుంజుమాన్ సురేంద్రన్ మినిమోల్, అనంత కృష్ణన్ ఒడిశా రాష్టంలోని మల్కాన్ గిరి నుండి తిరువనంతపురం (కేరళ) కు తరలిస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. వారి నుంచి నాల్గు సెల్ ఫోన్లను, రూ. 17 వేల నగదును సీజ్ చేసి తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు 28 లక్షల వరకు ఉంటుందని అన్నారు. ఈ తనిఖీలలో హెడ్ కానిస్టేబుల్ యం.ఏ.కరీం, కానిస్టేబుల్స్ సుధీర్,వెంకట్, హనుమంతరావు, వీరబాబు , ఉపేందర్ లు ఉన్నారు. సిబ్బందిని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జి.జనార్ధన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ జి.గణేష్ అభినందించారు. ఏమైనా సమాచారం ఉంటే ఎక్సైజ్ టోల్ ఫ్రీ నెంబర్ 18004252523 కు అందించాలని ఈఎస్ తిరుపతి తెలిపారు.




# గ్రామాల్లో ఎమ్మెల్యే ఇష్టారాజ్యం

- బిఆర్ఎస్ మండల సర్పంచ్ ల ఫోరమ్ ఆరోపణ

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**




గ్రామాల అభివృద్ధి పనులపై భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ మండల సర్పంచ్ ల ఫోరమ్ ఆరోపించింది. బుధవారం భువనగిరి మండల సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు జక్క రాఘవేందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ భువనగిరి మండల అధ్యక్షులు జనగాం పాండు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఎండిఏ నిధులు 9 కోట్లు భువనగిరి మండల గ్రామాల అభివృద్ధికి మంజూరయ్యాయని అన్నారు. పనులకు సంబంధించి భువనగిరి ఎమ్మెల్యే ఒకే కాంట్రాక్టర్ కు మొత్తం పనులను అప్పగించడమే కాకుండా అభివృద్ధి పనులకు సంబంధించిన లొకేషన్స్ గుర్తించకుండా అంచనాలు లేకుండా గ్రామ సర్పంచ్ ను కనీసం సంప్రదించకుండా వారి ఇష్ట రీతిగా పనులు చేస్తున్నారన్నారు. గతంలో ఎన్ ఆర్ ఈ జి ఎస్ నిధులతో అవసరం ఉన్న గ్రామాలలో మహిళా భవనాలను నిర్మించడానికి పంచాయతీ తీర్మానాలు తీసుకొని గుర్తించడం జరిగిందని కానీ ఇప్పుడు పంచాయతీ ఎన్నికలలో ఏ గ్రామాలలో కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ లు గెలిచారో ఆ గ్రామాలకే మహిళా భవనాలను కేటాయించడం జరిగిందని వారు ఆరోపించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి, అధికారులు వారి పద్ధతి మార్చుకోకపోతే ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో అతికం లక్ష్మి నారాయణ గౌడ్, గోద శ్రీనివాస్ గౌడ్, ర్యాకల శ్రీనివాస్, నీల ఓం ప్రకాష్ గౌడ్, పడాల వెంకటేష్, నాగేల్లి రమేష్ గౌడ్, కంకాల కిష్టయ్య, కొండూరి సత్యనారాయణ, కొమ్మగాని నర్సింహా పాల్గొన్నారు.



# గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

- భువనగిరి జిల్లా విద్యాశాఖాధికారి సత్యనారాయణ

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

పుస్తక పఠనంతో మనసుకు ఆరోగ్యకర వ్యాయామం దొరుకుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ అన్నారు. బుధవారం భువనగిరి పట్టణంలోని బీచ్ మహల్యా ప్రభుత్వ పాఠశాలలో "మరో గ్రంథాలయ ఉద్యమం బస్సు యాత్ర" గోడ ప్రతులను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘ సంస్కర్త, రచయిత కందుకూరి వీరేశలింగం పంతులు చెప్పినట్లు "చిరిగిన చొక్కా అయినా తొడుక్కో ఓ మంచి పుస్తకం మాత్రం కొనుక్కో" అన్న సూక్తిని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో హైదరాబాద్ టు అమరావతి మరో గ్రంథాలయ ఉద్యమ బస్సు యాత్ర నిర్వాహకులు కస్తూరి ప్రభాకర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో, పట్టణాల్లో, బడుల్లో, కళాశాలల్లో గ్రంథాలయాలను బలోపేతం చేయాలని, గ్రంథాలయ నిర్వాహకులను నియమించాలని, గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మండల విద్యాధికారి నాగవర్ధన్ రెడ్డి, మరో గ్రంథాలయ బస్సు యాత్ర వివాహకులు కస్తూరి ప్రభాకర్, తెలంగాణ సాహితీ సంస్థ జిల్లా అధ్యక్షులు జిట్టా భాస్కర్ రెడ్డి, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కొడారి వెంకటేష్, దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు బట్టు రామచంద్రయ్య, బీచ్ మహల్యా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేడి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కట్టా శేఖర్

**ముద్ర, ఖమ్మం:**

జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఖమ్మం జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు కట్టా శేఖర్ కోరారు. బుధవారం ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైనీని కలిసి పీఆర్టీయూ క్యాలెండర్, డైరీ అందించారు. అనంతరం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు. జిల్లా విద్యాధికారి సానుకూలంగా స్పందించారని శేఖర్ తెలిపారు . ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు లింగం సతీష్, గుడిపూడి శ్రీనివాసరావు, ఖమ్మం నగర అధ్యక్షులు పుసులూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి శాంత రెడ్డి, ఖమ్మం అర్బన్ మండల అధ్యక్షులు బి రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.




## కోదాడలో శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర

- 28 నుంచి 30 వరకు ప్రత్యేక పూజలు, అన్నదానాలు

**ముద్ర ప్రతినిధి, కోదాడ:**

కోదాడ పట్టణ ప్రజల ఆరాధ్య దైవాలు శ్రీ సమ్మక్క-సారలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం కటకమ్మగూడెం రోడ్ లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఈ నెల 28 నుంచి 30 వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. అమ్మవారి గద్దెలను పూలతో, విద్యుత్ దీపాల అలంకరణతో సుందరంగా తీర్చిదిద్దారు. జాతరకు సంబంధించి అన్ని ఏర్పాట్లను ఆలయ కమిటీ పూర్తి చేసింది. గద్దెల ప్రతిష్ఠాపన జరిగి ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అంగరంగ వైభవంగా అమ్మవార్లకు చీర, సారె పెట్టి జాతర ప్రారంభిస్తారని ఆలయ అర్చకులు తెలిపారు . అనంతరం అమ్మవారికి విశేష అభిషేకాలు, కుంకుమార్చనలు, జలాభిషేకం , దీపారాధనలు భక్తుల సమక్షంలో ఘనంగా జరుగనున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 29న జాతరలో భాగంగా ప్రత్యేకంగా శివసత్తులతో పూజా కార్యక్రమాలతో పాటు జలాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా జరపనున్నారు . అలాగే 30న మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు.

# కోదాడ పీఠం మూడోసారి జనరల్ మహిళకే

**ముద్ర, కోదాడ :**

మహిళా ఓటర్లు : 30,520
పురుష ఓటర్లు : 28,069
ఇతరులు : 12

2011లో మేజర్ గ్రామ పంచాయితీ నుంచి మున్సిపాలిటీగా అవతరించిన కోదాడ పట్టణం , మరోసారి రాజకీయంగా కీలక మలుపు తిరిగింది. చైర్‌పర్సన్ పీఠం ముచ్చటగా మూడోసారి కూడా జనరల్ మహిళా రిజర్వేషన్ కేటాయించబడటం విశేషం. 2014 లో మొదటి దఫా బిసి మహిళకు రిజర్వేషన్ అవ్వడంతో వంటిపులి అనిత ను కాంగ్రెస్ పార్టీ నుండి చైర్ పర్సన్ అభ్యర్థిగా ఎన్నుకున్నారు . అప్పటి రాజకీయ పరిస్థితుల దృష్ట్యా కాంగ్రెస్ నుండి టిఆర్ఎస్ కి పార్టీ మారారు. మున్సిపాలిటీ ఏర్పడిన నాడు 30 వార్డులతో మొదటి ఎలక్షన్ జరుగగా ఆ తర్వాత కొన్ని గ్రామాలు విలీనమై 35 వార్డులతో 58,601 ఓటర్లతో 2020 లో జనరల్ మహిళకు రిజర్వేషన్ అయినా కానీ కోదాడ నియోజకవర్గంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే గెలుపొందటం, ఎమ్మెల్యే బిసి మహిళకు అవకాశం ఇవ్వడంతో రెండో సారి కూడా బీసీ మహిళ కు అవకాశం దక్కింది. మరోసారి రాజకీయ సమీకరణాల దృష్ట్యా నాలుగేళ్లకు రెండో సారి చైర్ పర్సన్ పదవి చేపట్టిన వనపర్తి శిరీష ను పదవి నుండి దింపి కాంగ్రెస్ పార్టీ నుండి ఓసి మహిళ సామినేని ప్రమీల కు అవకాశం ఇచ్చారు . ఇక మూడవసారి ఎవరికి ఇస్తారా అని ఓటర్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు .

ఈ గణాంకాలు చూస్తే, మహిళా ఓటర్లు సంఖ్యా పరంగా ముందుండటమే కాకుండా, రాజకీయ నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించే స్థాయిలో ఉన్నారని స్పష్టమవుతోంది.జనరల్ మహిళా రిజర్వేషన్ ఖరారుకావడంతో అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీల్లోనూ మహిళా ఆశావహుల మధ్య పోటీ ఉత్కంఠను పెంచుతోంది.






# స్వర్ణగిరీషుడికి పాదపద్మార్చన సేవ

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య పాదారవిందములకు 108 బంగారు అష్టదళ పద్మ పుష్పాలతో, శ్రీ స్వామివారికి అష్టోత్తర శతనామాలతో అష్టదళ పాదపద్మార్చన సేవ అర్చక స్వాములు ఘనంగా నిర్వహించారు. సహస్ర నామార్చన సేవ లోక కళ్యాణం కోసం శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు. నిత్య కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. బుధవారం స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని శ్రీ శైవ క్షేత్ర పీఠాధిపతులు, హిందూ ధర్మ పరిరక్షకులు, భారత ధర్మ దేవత బిరుదాంకితులు, పరమ పూజ్య శ్రీ శ్రీ శ్రీ శివ స్వామీజీ వారు (శ్రీ శైవ క్షేత్రము, తాళాయపాలెం, విజయవాడ) సందర్శించి స్వామివారి దివ్య దర్శనం చేసుకున్నారు.

# భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థుల మొదటి జాబితా విడుదల

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

భువనగిరి మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల మొదటి జాబితాను భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రకటించారు. 1వ వార్డు వలబోజు సరూప, 3వ వార్డు పాల్యస్వరూప, 6వ వార్డు జంగిటి వినోద్, 9వ వార్డు బొంతల నర్సింగ్ రావు, 10వ వార్డు బింగి నరేష్, 11వ వార్డు గంజి శ్రీవాణి, 12వ వార్డు తోటకూరి విజయలక్ష్మి, 13వ వార్డు గుర్రాల సంతోష, 15వ వార్డు నజీయా రెహమాన్, 16వ వార్డు ఎండి తాజుద్దీన్, 20వ వార్డు పచ్చల జగన్, 29వ వార్డు పోతంశెట్టి మంజుల, 30 వ వార్డు ఎండి. లైక్ అహ్మద్, 33వ వార్డు భాషబోయిన రాజేష్,35వ వార్డు తంగళ్లపల్లి శ్రీవాణి ల పేర్లను ఖరారు చేసినట్లు వెల్లడించారు.



సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

గురువారం 29-01-2026

www.mudranews.in | @mudranews



**ప్రపంచ ప్రసిద్ధ గొప్ప జాతరలు**

సోనేపూర్ మేళా (భారతదేశం): బీహార్‌లోని గంగా, గండక్ నదుల సంగమం వద్ద జరిగే ఈ జాతర ఆసియాలోనే అతి పెద్ద పశువుల సంతగా పేరుగాంచింది. పూర్వకాలం నుంచి ఇక్కడ ఏనుగులు, గుర్రాలు తదితర జంతువుల భారీ విక్రయాలు జరుగుతుంటాయి.

# మొదటి రోజు 26 నామినేషన్లు

## ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, అదనపు కలెక్టర్



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి మొదటి రోజు 26 నామినేషన్లు దాఖలయ్యాయి. మెదక్ లో 12, రామాయంపేలో 7, తుప్రాన్ లో 4, నర్సాపూర్ లో 3 చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నుంచి అభ్య ర్థులు పోటీకి ఉత్సాహం చూపుతున్నారు. కాగా మున్సిపల్ నామి నేషన్ల దాఖ లుకు నో డ్యూ సర్టిఫికెట్ కోసం అభ్యర్థులు, ప్రతిపాదకులు ఎగబడి పన్నులు చెల్లిస్తున్నారు.

**పకడ్బందీగా నామినేషన్ ప్రక్రియ..**

మున్సిపల్ నామినేషన్ల ప్రక్రియ పకడ్బందీగా జరగాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. నర్సాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ తో కలిసి పరిశీలించారు. నామినేషన్ పత్రాలు, వివిధ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఎన్నికల సంఘం నియమాలను అనుసరించి కొనసాగాలన్నారు. నామినేషన్ పత్రాలలో తప్పులు నింపకుండా చూడాలన్నారు. నామినేషన్ పత్రాలతో పాటు జతచేసే జిరాక్సులను సరిచూసి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**తప్పులు లేకుండా పత్రాలు నింపాలి..**

తప్పులు లేకుండా నామినేషన్ పత్రాలు నింపాలని అద నపు కలెక్టర్ నగేష్ సూచించారు. మెదక్ మున్సిపల్ కార్యా లయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ పత్రాలలో తప్పులు లేకుండా నింపేలా చూడాలని ఆదే శించారు. ఆయన వెంట కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, పలువురు అధికారులు తదితరులు ఉన్నారు.

**భారీ బందోబస్తు ఏర్పాటు..**

మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మెదక్, రామాయంపేట నామినేషన్ కేంద్రాల వద్ద బందోబస్తును అదనపు ఎస్పీ మహేందర్ పరిశీలించారు. నామినేషన్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. నామినేషన్ కేంద్రానికి అభ్యర్థితో పాటు ఒక ప్రతిపాదకులు మాత్రమే అనుమతించబడతారని తెలిపారు. ఆయన వెంట మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మెదక్ టౌన్ ఇన్ స్పెక్టర్ మహేష్, ఎస్సైలు లింగం, విఠల్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# 'జిజ్ఞాస' పరిశోధన దృక్పథం పెంచుతుంది




**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** జిజ్ఞాస ప్రాజెక్టు వల్ల విద్యార్థుల్లో పరిశోధన దృక్పథం పెరుగుతుందని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా, సునీత తెలిపారు. కళాశాలలో బుధవారం JIGNASA Student Study Project 2025–26పై అధ్యాపకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. జి. సునీత మాట్లాడుతూ జిజ్ఞాస ప్రాజెక్టు విద్యార్థుల్లో పరిశోధన దృక్పథాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందనన్నారు. సమస్యలను విశ్లేషించే సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తుందని తెలిపారు. అధ్యాపకుల మార్గదర్శకత్వంతో విద్యార్థులు చిన్న స్థాయి పరిశోధన ప్రాజెక్టులు చేపట్టడం ద్వారా వారి అకాడమిక్ నైపుణ్యాలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. జిజ్ఞాస కోఆర్డినేటర్ డా. జి. రవి కుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ జిజ్ఞాస, సృజనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార సామర్థ్యం పెంపొందించడమే ముఖ్య లక్ష్యమని తెలిపారు. అధ్యాపకులు మెంటర్లుగా వ్యవహరిస్తూ ప్రాజెక్టుల ఎంపిక, అమలు, నివేదిక తయారీలో కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని సూచించారు. COE డా. జి. సుదర్శనం మాట్లాడుతూ జిజ్ఞాస ప్రాజెక్టులు విద్యార్థుల సమగ్ర అభి వృద్ధికి తోడ్పడటంతో పాటు పరిశోధన సంస్కృతిని బలోపేతం చేస్తాయని తెలిపారు. IQAC కోఆర్డినేటర్ డా. చి. మాధుసూదన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం నాణ్యతా ప్రమాణాలు, ఉత్తమ విద్యా ఆచరణలకు అనుగుణంగా ఉందని పేర్కొన్నారు,

కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టుపై ఆసక్తి వ్యక్తం చేశారు. చివరగా డా. గురు చరణ్ దాస్ వందన సమర్పణ చేశారు. మైక్రోబయాలజీ విభాగాధిపతి, జిజ్ఞాస కమిటీ సభ్యులు డా. జి. మదన్ మోహన్ జిజ్ఞాస విద్యార్థులకు ఎలా ఉపయోగపడుతుందో వివరించారు. ఈ కార్యక్రమంలో డా. ఎం. శ్రీధర్, డా. జి. శ్రీనివాస్ రెడ్డి, డా. పవన్ కుమార్, డా. లీలావతి, పిట్ల దాస్ తదితర అధ్యాపకులు కూడా పాల్గొని జిజ్ఞాస ప్రాజెక్టుపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

# బీఆర్ ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం



**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శూన్యమని సిద్దిపేట పట్టణ 20 వ వార్డు కౌన్సిలర్ రియాజుద్దీన్ ఆరోపించారు. బుధవారం వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు అయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిద్దిపేట ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ సహకారంతో యూఐడీఎఫ్ ఫండ్స్ ద్వారా సీసీ రోడ్డు నిర్మిస్తు న్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నిసార్లు విన్నవించినా రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదన్నారు. స్పెషల్ ఫండ్ ద్వారా సీసీ రోడ్డు నిర్మాణానికి మోక్షం లభించిందని పేర్కొన్నారు. సిద్దిపేట మునిసిపాలిటీలో చైర్ పర్సన్, వారికి ఇష్టం ఉన్న వారికే నిధులు కేటాయించడం, ప్రైవేట్ సంస్థలకు నిధులు మల్లించడం చేస్తూ దోచుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక కౌన్సిలర్ సీట్లు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు షాబుద్దీన్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఏడుపాయల జాతర ఘనంగా జరగాలి

## మెదక్ క లెక్టర్ రాహుల్ రాజ్




**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఏడుపాయల వన దుర్గా మాత జాతర ఎల్లలు దాటేలా ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లో బుధవారం అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీవో మైపాల్ రెడ్డి, డీఎస్పీ ప్రసన్నకుమార్, వివిధ శాఖల అధికా రులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పార్కింగ్, విద్యుత్, తాగునీరు, బారికేడ్స్ ఏర్పా టు చేయాలని సూచించారు. జాతర పరిసరాలను పరిశుభ్రంగా ఉండాలని, మరుగుదొడ్లు, చిత్త సేకరణ, బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణకు ఫాగు లాంటివి ఎప్పటికప్పుడు నిర్వహించాలన్నారు. వివిధ సైన్ బోర్డులు, అంబులెన్స్, మందులు, అంటూ వ్యాధులు రాకుండా చర్యలు, కోవిడ్ – 19 ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రవాణా, బస్సులు, వాహనాలు, గజ ఈతగాళ్లు, అన్ని చోట్ల సీసీ కెమెరాలు, పోలీస్ కంట్రోల్ రూమ్, కడ్బందీగా దర్శనానికి క్యూలైన్ ఏర్పాటు, అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపక యంత్రాలు, స్వయం సహాయక మహిళల ఉత్పత్తుల కోసం ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేసి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో ఏడుపాయలకు వెళ్లి శనివారం వరకు జాతరకు సంబంధించి యాక్షన్ ప్లాన్ తయారుచేసి ఇవ్వాలని ఆయన ఆదేశించారు.

**ప్రశాంతంగా రంజాన్ మాసం నిర్వహణ..**

రంజాన్ మాసం ప్రశాంతంగా నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. రంజాన్ మాసం ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, నర్సాపూర్ ఆర్డీవో మైపా ల్ రెడ్డి, డీఎస్పీ ప్రసన్నకుమార్, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ప్రార్థన మందిరాల వద్ద శాంతి భద్రతల పరిరక్షణ చేయా లని పేర్కొన్నారు.

# నామినేషన్ల స్వీకరణ కేంద్రాల పరిశీలన



**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** సాధారణ మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా బుధవారం గజ్వేల్, చేర్యాల మున్సిపాలిటీలలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖాన్ పరిశీలించారు. నిబంధనల ప్రకారం నామినేషన్లు స్వీకరిస్తున్నామని సిబ్బంది తెలిపారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం అన్ని సౌకర్యాలు గురించి ఆరా తీసి, ఆయా రిటర్నింగ్ అధికారుల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఏలాంటి పిర్యాదులు చేయాలన్న 9014192463 ఫోన్ నంబర్ ను సంప్రదించాలని సూచించారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

## సిద్దిపేట కలెక్టర్ హైమావతి



**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిద్దిపేట కలెక్టర్ హైమావతి ఆదేశించారు. బుధవారం దుబ్బాక మండలం దుంపలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ప్రక్రియను తనిఖీ చేశారు. అన్నం, గుడ్డు, పాలకూర పప్పు, సాంబారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూర నాణ్యత మెరుగుపరచాలని, విద్యార్థులకు రుచికరంగా వండాలని వంట సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థుల హాజరు ప్రకారం వంట చేసేలా మానిటర్ చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులకు కడుపు నిండా తినేలా సరిపడినంత అన్నం, కూరలు పెట్టాలన్నారు. మీ ఇష్టానుసారం పెడితే సహించేది లేదని వంట సిబ్బందిని హెచ్చరించారు.

విద్యార్థులు కూర్చున్న వద్దకు వెళ్లి వడ్డించాలన్నారు. భోజనం చేస్తున్నపుడు విద్యార్థులు లేవకూడదని తెలిపారు. విద్యార్థుల వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. భోజనం ఎలా ఉంది, రోజు ఎలా పెడుతున్నారని అడిగారు. బాగానే ఉందని విద్యార్థులు తెలిపారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం అని, ఒక్క మెతుకు కింద పడకుండా శుభ్రంగా, నెమ్మదిగా తినాలని విద్యార్థులకు సూచించారు. డైనింగ్ హాల్, పాఠశాల పరిసరాలను చెత్త లేకుండా శుభ్రంగా ఉంచాలని స్కావెంజర్ ను ఆదేశించారు. విద్యార్థులకు భోజనం, చదువు విషయం లో రాజీ పడవద్దని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ఆదేశించారు. అంతకు ముందు ప్రాంగణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న బోజన ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఆహార పదార్థాలను తనిఖీ చేసి మంచి ఆహారం అందించాలని ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. పిల్లలు చాలా ముద్దుగా ఉన్నారని బాగా తిని ఆడుకోవాలని సూచించారు.

# పీహెచ్ సీ తనిఖీ

**ముద్ర, నిజామాబాద్:** నిజామాబాద్ డీఎంహెచ్‌వో రాజశ్రీ పోతంగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని మందులు, పలు రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రి పరిధిలో గర్భిణుల వివరాల నమోదు, ఓపీ తదితర విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.



# వెల్నెస్ సెంటర్లలో మందుల కొరత వెంటనే తీర్చాలి



**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** జిల్లా కేంద్రంలోని వెల్నెస్ సెంటర్లో మందుల కొరత వెంటనే తీర్చాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ (SGPAT) సిద్దిపేట జిల్లా కమిటీ జిల్లా అధ్యక్షుడు చిల్ల నర్సింహులు, ప్రధాన కార్యదర్శి బో రెడ్డి మధుసూదన్ రెడ్డి కోరారు. వైద్య సేవలకు అనుగుణంగా అన్ని రకాల మందులు వెల్నెస్ సెంటర్లో అందుబాటులో ఉంచాలని కోరుతూ బుధవారం జిల్లా కమిటీ పక్షాన వైద్యాధికారికి మెమోరండం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల వివిధ విభాగాల్లో వైద్య సేవలు అందుబాటులోకి రావడం హర్షణీయమన్నారు. అయితే ఆ సేవలకు అనుగుణంగా అవసరమైన మందులు అందుబాటులో లేకపోవడం వల్ల రోగులు, పింఛనర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జోగు బిక్షపతి, రాష్ట్ర కౌన్సిలర్ జి. బన్సీలాల్‌తో పాటు జిల్లా నాయకులు నాగేందర్, భగవాన్ రెడ్డి, హనుమంత రెడ్డి, కాశీనాథ్, బాల నర్సయ్య, అన్నమరెడ్డి, తిరుపతి, రవీందర్, కృష్ణమూర్తి, దయాకర్ రెడ్డి, శ్రీనివాస్, సిహెచ్. మల్లయ్య, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
29.01.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### ప్రపంచ ప్రసిద్ధ గొప్ప జాతరలు

**హోలీ ఉత్సవం (భారతదేశం):** రంగుల పండుగగా పిలవబడే హోలీ, చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా దేశవ్యాప్తంగా ఘనంగా జరుగుతుంది. ప్రజలంతా కులమతాలకు అతీతంగా రంగులు చల్లుకుంటూ ఆనందంగా జరుపుకునే ఈ వేడుక విదేశీయులను కూడా విశేషంగా ఆకర్షిస్తుంది.



## పబ్లిసిటీ కోసం పోలీసుల అత్యుత్సాహం

- అవినీతిపరులుగా మారిన పలువురు అధికారులు
- పబ్లిసిటీ కోసం పోలీసుల తాపత్రయంపడుతున్నారు
- మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్ర ప్రభుత్వంలో కీలక హోదాల్లో విధులు నిర్వహిస్తున్న పలువురు అధికారులు అవినీతిపరులుగా మారిపోయారని మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ ఆరోపించారు. నిజాయితీగా పనిచేయడం అటుంచితే వార్తల్లో నిలవడానికి, పబ్లిసిటీ కోసం మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. బుధవారం గాంధీభవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా.. కొందరు అధికారులు ఇంకా పాత ప్రభుత్వ అలవాట్లను వదులుకోలేదని విమర్శించారు. వారి వ్యవహార తీరుతో ప్రస్తుత ప్రజా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక కీలక కమిషనర్ లా అండ్ ఆర్డర్‌ను పర్యవేక్షించడం మానేసి, కేవలం భూ వివాదాలు, ల్యాండ్ సెటిల్‌మెంట్లపైనే దృష్టి పెట్టారని దుయ్యబట్టారు. ఏ కాంగ్రెస్ సీఎం కూడా అర్ధరాత్రి వేళల్లో అరెస్టులు చేయమని ఆదేశించరని చెప్పారు. పోలీసులు అత్యుత్సాహంతో ప్రభుత్వ ప్రతిష్టను దిగజారుస్తున్నారని మండిపడ్డారు. దారి తప్పిన అధికారులను వెంటనే పక్కన పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం నడుస్తోందని.. ఇక్కడ చట్టం తన పని తాను చేయాలి తప్ప, వ్యక్తుల ప్రయోజనాల కోసం లేదా ప్రచారం కోసం పనిచేయకూడదని మధుయాష్కీ చురకలంటించారు.





## ఆ చట్టాన్ని మార్చడమంటే ప్రజల పొట్ట కొట్టడమే

- వీబీ-జీరామ్ జీ రద్దయ్యే వరకు పోరాటం..
- ఏఐసీసీ తెలంగాణఇంచార్జి మీనాక్షి నటరాజన్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

పేదల ఆకలి తీర్చడం కోసం యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని మార్చడమంటే పేదల పొట్టకొట్టడమేనని ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ విమర్శించారు. బుధవారం మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం కొర్విపల్లిలో ఉపాధిహామీ పథకం పేరు మార్చడంపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ 2005లో కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టిందని తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల కోసం ఉపాధి హామీని తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఈ పథకాన్ని ఎన్‌డిఏ ప్రభుత్వం పేరును మార్చడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పేదలకు ఉపాధి కల్పించాలనే మంచి ఉద్దేశ్యంతో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చి పని కల్పిస్తే, దానిని నిర్వీర్యం చేసేందుకు మోడీ సర్కార్ కుట్ర చేస్తోందని ఆరోపించారు.వీబీజీరామ్ జీ చట్టం రద్దయ్యే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరునే కాకుండా, దాని ఆత్మ, అమలు విధానాన్ని మార్చేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని దుయ్యబట్టారు. గ్రామీణ పేదలకు ఉపాధి భరోసా కల్పించాలనే మహాత్మా గాంధీ ఆలోచనలకు విరుద్ధంగా కేంద్రం చట్టం తేవడం దుర్మార్గమన్నారు. పేదలు, రాష్ట్రాలను శిక్షించేలా కేంద్రం విధానం ఉన్నదన్నారు. ఉపాధి హామీ పని దినాలను 200కి పెంచాలనీ, రోజుకూలిని రూ.307 నుంచి రూ.600 వరకు పెంచడంతో పాటు ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**గరీబోళ్లను కష్టపెడుతున్న మోడీ..**

పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రధాని మోడీ గరీబోళ్లకు కష్టపెడుతున్నాడని ఆరోపించారు. ఉపాధి హామీ చట్టాన్ని సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ లు తెచ్చారని గుర్తు చేశారు. అమిత్ షాకు మన గోడు పట్టడం లేదన్నారు. గాంధీ ఫోటో తీసేసి నిధుల కోత పెట్టారని విమర్శించారు. కేసీఆర్ ఎనిమిది లక్షల అప్పుచేసి నెత్తిమీద రుద్ది ఫామ్ హౌస్ లో పడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఘన స్వాగతం పలికారు. అంతకుముందు గ్రామంలోని దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వి. హనుమంతరావు, పీసీసీ ప్రతినిధి అనిల్, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్,పీసీసీ ప్రతినిధి ముబాకర్ అలీ ఖాన్, గ్రంథాలయ చైర్ పర్సన్ సుహాసిని, దుబ్బాక ఇంచార్జి శ్రీనివాస్ రెడ్డి, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మోహన్ నాయక్, మాజీ ఎంపీపీ అరుణ ప్రభాకర్, సర్పంచ్ పుల్లా రావుతోపాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కూలీలు పాల్గొన్నారు.

## కారులో అత్యాచారం..

- రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై మహిళ లైంగిక ఆరోపణలు
- బాధితురాలి వీడియోతో రాష్ట్ర వ్యాప్తంగా కలకలం
- కేసు నమోదు.. మహిళా కమిషన్ జోక్యం
- జనసేన కఠిన నిర్ణయం
- అంతర్గత కమిటీ ఏర్పాటు చేసిన పార్టీ అధిష్ఠానం
- విచారణ ఫలితంపైనే ప్రభుత్వ విప్ రాజకీయ భవిష్యత్తు

**ముద్ర న్యూస్:**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం రైల్వే కోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ చుట్టూ ముసురుకున్న వివాదం పెను సంచలనంగా మారింది. ఓ ప్రభుత్వ ఉద్యోగిని చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలు, గర్భస్రావాల ఉదంతం ఇప్పుడు జనసేన పార్టీని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలో పడేశాయి. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం శ్రీధర్‌పై క్రమశిక్షణ చర్యలు చేపట్టింది.

రైల్వే కోడూరుకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగిని సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన వీడియో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే శ్రీధర్ తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ఒకటిన్నర సంవత్సరాలుగా లైంగికంగా వాడుకుంటున్నారని ఆమె ఆరోపించారు. ఈ క్రమంలో తనకు ఐదుసార్లు బలవంతంగా అబార్షన్లు చేయించారని, ప్రస్తుతం తనను, తన కుమారుడిని చంపేస్తానని బెదిరిస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కోడూరు పోలీసులు ఎమ్మెల్యేపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ కూడా స్పందించారు. బాధితురాలికి అండగా ఉంటామని, సమగ్ర విచారణ జరిపి దోషులకు శిక్ష పడేలా చూస్తామని హామీ ఇచ్చారు.

ఈ ఆరోపణలపై ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తీవ్రంగా స్పందించారు. తన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక ప్రత్యర్థులు పన్నిన రాజకీయ కుట్ర అని కొట్టిపారేశారు. ఈ మేరకు ఆయన కూడా వీడియో సందేశాన్ని విడుదల చేశారు. తన ప్రజా జీవితంలో ఎలాంటి మచ్చ లేదని, నిబద్ధతతో పనిచేస్తున్నానని పేర్కొన్నారు. సదరు మహిళ తనను బ్లాక్‌మెయిల్ చేస్తోందని, ఈ విషయమై తన తల్లి ప్రమీల ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశారని వెల్లడించారు. చట్టంపై తనకు నమ్మకం ఉందని, విచారణలో నిజానిజాలు బయటకు వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఈ వివాదం పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉండటంతో, జనసేన అధినేత, పార్టీ రాష్ట్ర కార్యవర్గం తక్షణమే రంగంలోకి దిగింది. నైతిక విలువలకు ప్రాధాన్యతనిచ్చే పార్టీగా, ఆరోపణలు వచ్చిన వెంటనే శ్రీధర్‌పై కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఈ అంశంపై పూర్తిస్థాయి విచారణ జరిపేందుకు ముగ్గురు సభ్యులతో అంతర్గత కమిటీని నియమించింది. టి. శివశంకర్, తంబళ్లపల్లి రమాదేవి, టి.సి. వరుణ్ ఈ కమిటీలో సభ్యులు. విచారణ పూర్తయ్యే వరకు అరవ శ్రీధర్ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకూడదని, ప్రభుత్వ విప్ హోదాలో కూడా ఎటువంటి అధికారిక కార్యక్రమాలకు హాజరుకాకూడదని ఆదేశించింది. ఏడు రోజుల్లోగా కమిటీ ముందు హాజరై వివరణ ఇవ్వాలని, కమిటీ వారం రోజుల్లోగా నివేదిక సమర్పించాలని గడువు విధించింది.



కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ, తన ఎమ్మెల్యేపై వచ్చిన ఆరోపణలను తేలికగా తీసుకోలేదు. గతంలో కూడా ఇటువంటి వివాదాల విషయంలో పవన్ కళ్యాణ్ కఠినంగా వ్యవహరిస్తారనే పేరుంది. ఈ కేసులో విచారణాధికారులు సేకరించే సాక్ష్యాలు, మహిళా కమిషన్ నివేదిక ఆధారంగా శ్రీధర్ రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.

మరోవైపు ప్రతిపక్షాలు ఈ అంశాన్ని ప్రభుత్వంపై అస్త్రంగా వాడుకుంటున్నాయి. అధికార పార్టీ ఎమ్మెల్యేపై ఇలాంటి ఆరోపణలు రావడం శాంతిభద్రతల పరిస్థితికి అద్దం పడుతోందని విమర్శిస్తున్నాయి. అయితే, పార్టీ నుంచి శ్రీధర్‌ను సస్పెండ్ చేయడం ద్వారా తప్పు చేస్తే ఎవరినీ ఉపేక్షించబోము అనే బలమైన సంకేతాన్ని ప్రజల్లోకి పంపే ప్రయత్నం చేస్తోంది జనసేన అధిష్ఠానం. ప్రస్తుతం పోలీసులు ఇరుపక్షాల వాదనలు, సోషల్ మీడియా వీడియోలు, కాల్ డేటా ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. వారం రోజుల్లో వెలువడే పార్టీ కమిటీ నివేదిక ఈ వివాదంలో అత్యంత కీలకం కానుంది.



## ఫైర్ సేఫ్టీపై హైడ్రా నజర్

- ఫైర్ సేఫ్టీపై హైడ్రా నజర్
- తనిఖీలకు కమిషనర్ ఆదేశం
- సంబంధిత శాఖలతో సమావేశం

**ముద్ర, హైదరాబాద్:**

ఫైర్ సేఫ్టీపై హైడ్రా దృష్టి పెట్టింది. ఫైర్ సేఫ్టీ నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటోంది. వ్యాపార సముదాయాల నుంచి నివాస ప్రాంతాల వరకూ ఫైర్ సేఫ్టీలో ఎక్కడా అలసత్వాన్ని ఉపేక్షంచరాదని నిర్ణయించింది. ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాల నేపథ్యంలో పటిష్ట చర్యలు తీసుకునేందుకు నడుం బిగించింది. బుధవారం జీహెచ్ ఎంసీ, ఫైర్, విద్యుత్ విభాగాల అధికారులతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సమావేశమయ్యారు. ఫైర్ సేఫ్టీ కార్యాచరణ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార సముదాయాలు, ఫర్నీచర్, వస్త్ర దుకాణాలు వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. ఫైర్ సేఫ్టీ పాటించకపోతే ఆయా షాపులను సీజ్ చేయాలని నిర్ణయించారు. వెంటనే విద్యుత్ సరఫరా బంద్ చేయాలన్నారు, ఫైర్ సేఫ్టీ లేని వ్యాపార సముదాయంగా నోటీసులు అతికించాలని అధికారులకు సూచించారు.

**9000113667 నంబరుకు సమాచారమివ్వండి..**

అగ్ని ప్రమాదానికి ఆస్కారం ఉన్న పరిస్థితులుంటే వెంటనే హైడ్రా కంట్రోల్ రూం నంబరు 9000113667 కు ఫోను చేసి సమాచారమివ్వాలని హైడ్రా కమిషనర్ నగర ప్రజలను కోరారు. ఎక్కడ అగ్ని ప్రమాదానికి అవకాశం ఉన్న పరిస్థితులున్నాయో కరెంటు లొకేషన్‌తో పాటు.. వీడియోలు, ఫొటోలు పంపించాలన్నారు. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. నగరంలోని అందరి లక్ష్యం అగ్ని ప్రమాదాలు తగ్గించడమే కావాలని కోరారు. గతేడాది నగరంలో జరిగిన అగ్ని ప్రమాదాలు 36కు పైగా ఉన్నాయని.. నెలకు 3 చొప్పున ఘటనలు చోటు చేసుకున్నాయని గుర్తు చేశారు.

నాంపల్లిలో జరిగిన ఫర్నీచర్ దుకా సెల్లార్‌లలో లెక్కకు మించిన ఫర్నీచర్‌ను నెట్టులుగా పెట్టారన్నారు. వస్త్ర దుకాణదారులు, ఫర్నీచర్ షాపులతో పాటు ఇతర వ్యాపారాలు చేసిన వారు నిలువలను మెట్ల మార్గంలో, కారిడార్‌లో, సెల్లార్లలో నిలువ ఉంచరాదన్నారు. సెల్లార్ లు వాహనాల పార్కింగ్ కోసమే వినియోగించాలన్నారు. పేలుడు, మండే స్వభావం ఉన్న వస్తువులు, పదార్థాలు నిల్వ ఉంచరాదని పేర్కొన్నారు.

## ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రాష్ట్రంలో ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హామీ ఇచ్చారు. ఎన్నికలకు ముందు ఆటో డ్రైవర్లకు ఇస్తామన్న రూ.12 వేలు వెంటనే ఇవ్వాలని అధికార పార్టీని డిమాండ్ చేశారు. బుధవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆటో యూనియన్ ల నాయకులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్ లో, ఇతర జిల్లాల ఆటో డ్రైవర్లకు ఇబ్బంది కలిగించటంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై అన్ని ఆటో సంఘాలతో కలిసి పోరాటం చేస్తామని చెప్పారు. అవసరమైతే కార్మిక శాఖ మంత్రి వివేక్ ను కలుస్తామన్నారు. చట్టబద్ధమైన అనుమతులు ఉన్నప్పటికీ జిల్లాల నుంచి వచ్చే ఆటో డ్రైవర్లను అడ్డుకోవటం సరికాదన్నారు. కార్మికుల భద్రతతో పాటు వారి ఉపాధి హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందనే విషయాన్ని మరిచిపోవద్దన్నారు. హైదరాబాద్ లో జిల్లాల నుంచి వచ్చే ఆటో డ్రైవర్లపై జరుగుతున్న దాడులు, వేధింపులు తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై సంబంధిత పోలీస్, రవాణా శాఖ అధికారులతో మాట్లాడి జిల్లాల ఆటో డ్రైవర్లకు పూర్తి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో కార్మికుల పక్షాన తెలంగాణ జాగృతి ఎప్పుడూ నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్ సింగ్, ఆటో జాగృతి అధ్యక్షుడు ఎంఏ సలీమ్, ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ వెంకటేష్, ఐ ఎన్ టీయూసీ జనరల్ సెక్రెటరీ మల్లేశం గౌడ్, టీ ఏడీఎస్ ప్రెసిడెంట్ సత్తిరెడ్డి, టీ ఎన్ టీయూసీ స్టేట్ ప్రెసిడెంట్ యాదగిరి, జీయూ టీఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్, బీఆర్టీయూ అధ్యక్షుడు పరశురాముడు, తెలంగాణ జాగృతి నాయకులు పాల్గొన్నారు.



## అమెజాన్‌లో 16 వేల మంది ఉద్యోగుల తొలగింపు

**ముద్ర న్యూస్ :**

ప్రముఖ ఇకామర్స్ సంస్థ అమెజాన్ మరోసారి భారీ స్థాయిలో ఉద్యోగుల తొలగింపులు చేపట్టింది. గతేడాది అక్టోబర్‌లో 14వేల మంది కార్పొరేట్ ఉద్యోగులను తొలగించిన సంస్థ, తాజాగా మరో 16వేల మందికి లేఆఫ్‌లు ప్రకటించినట్లు అమెజాన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెత్ గలెటీ వెల్లడించారు. 2023 తర్వాత ఈ స్థాయిలో ఉద్యోగుల తొలగింపులు జరగడం ఇదే తొలిసారి కాగా, కరోనా కాలంలో అధికంగా నియమించిన సిబ్బందిని తగ్గించుకునే చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తొలగింపుల స్థానంలో జనరేటివ్ ఏఐ వినియోగాన్ని పెంచాలని, పలు విభాగాలను కుదించి పాలనా వ్యవస్థల్లో మార్పులు చేయనున్నట్లు అమెజాన్ పేర్కొంది. అయితే ఏ విభాగాల్లో ఉద్యోగుల తొలగింపులు ఉంటాయన్న వివరాలను వెల్లడించలేదు. అక్టోబర్‌లో ప్రారంభించిన సంస్థాగత మార్పులు పూర్తయ్యాయని గలెటీ పేర్కొంటూ, అమెరికా ఉద్యోగులకు సంస్థలోనే కొత్త పాత్రను ఎంచుకునేందుకు 90 రోజుల గడువు ఇస్తామని, ఆలోగా ఎంపిక జరగని వారికి నిబంధనల ప్రకారం ఇతర ప్రయోజనాలు అందిస్తామని తెలిపారు. ఇదే సమయంలో వ్యూహాత్మకంగా కీలకమైన విభాగాల్లో నియామకాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## పురపోరులో కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి

- కోర్టులో పెండింగ్ లో బీసీ రిజర్వేషన్ కేసు
- ఎన్నికలు ఎలా నిర్వహిస్తారు?
- బీసీ జేఏసీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని తెలంగాణ బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ లోని బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో 15 బీసీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ పై కోర్టులో కేసు పెండింగ్ లో ఉన్నప్పటికీ మున్సిపల్ ఎన్నికలను ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఇచ్చిన హామీ అమలు చేయకపోతే మిలిటెంట్ తరహాలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. గత మున్సిపల్ ఎన్నికల్లో 34 శాతం అమలు చేసి, ఇప్పుడు దాన్ని 28 శాతానికి తగ్గించడం బాధాకరమన్నారు. బీసీలను రాజకీయంగా అణచివేయడమేనని విమర్శించారు. కోర్టు తీర్పు రాకముందే ఎన్నికలు నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు.



అనేక నిరసనలు, దీక్షలు చేసినప్పటికీ సీఎం స్పందిస్తలేరని ఆరోపించారు. ప్రభుత్వ వైఖరి మారకపోతే తీవ్ర పరిణామాలు తప్పవన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీసీ సంఘం నేతలు గుజ్జ సత్యం, రాజేందర్, అనంతయ్య, రాందేవ్ మోదీ పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 29.01.2026
www.mudranews.in | @mudranews


## సుస్థిర సాంకేతికతల దిశగా సివిల్ ఇంజనీర్లు
# ముందడుగు వేయాలి

**ముద్ర, బండ్లగూడ :**
సమాజానికి ఉపయోగపడే విధంగా నేటి సాంకేతిక విప్లవంలో సుస్థిర సాంకేతిక ఆలోచనల దిశగా విద్యార్థులు ముందుకు సాగాలని ప్రొఫెసర్ శ్రీనివాస్ శర్మ పిలుపునిచ్చారు. సీబీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం, ఐఐపీసీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన నిపుణుల ఉపన్యాసంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా "పరిశ్రమలకు సిద్ధంగా ఉన్న వృత్తిపరుల కోసం సివిల్ ఇంజనీరింగ్‌లో తాజా ధోరణులు" అనే అంశంపై ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సివిల్ ఇంజనీరింగ్‌కు సంబంధించిన వివిధ ప్రత్యేకతలను సమగ్రంగా అవగాహన చేసుకుని, సంపూర్ణ జ్ఞానాన్ని అలవర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణ మార్పుల వల్ల ఏర్పడుతున్న సవాళ్లను దృష్టిలో ఉంచుకుని, సివిల్ ఇంజనీరింగ్‌లో సుస్థిర సాంకేతికతల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.



# కూలిన విమానం

## డిప్యూటీ సీఎం దుర్మరణం

**ఘోర విమాన ప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మృతి**

**బారమతి జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారానికి వెళ్తుండగా ప్రమాదం**

**ల్యాండింగ్ సమయంలో సాంకేతిక లోపంతో అదుపు తప్పిన విమానం**

**రన్‌వే సమీపంలో కుప్పకూలి మంటల్లో చిక్కుకున్న విమానం**

**సంతాపం తెలిపిన సీఎం ఫడ్నవీస్.. విచారణకు ఆదేశాలు**

**విమాన భద్రతపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చ**

**ముద్ర న్యూస్ :**
మహారాష్ట్ర రాజకీయాలను షాక్‌కు గురిచేసిన ఘోర విమాన ప్రమాదం బుధవారం ఉదయం చోటుచేసుకుంది. రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి అజిత్ పవార్ సహా మొత్తం ఆరుగురు ప్రయాణికులు ప్రయాణిస్తున్న చార్టర్డ్ విమానం ల్యాండింగ్ సమయంలో కుప్పకూలి అందరూ ప్రాణాలు కోల్పోయారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారం కోసం బారమతి వైపు వెళ్తున్న ఈ విమానం ప్రమాదానికి గురవడం దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

**విమానాశ్రయంలో ల్యాండ్ అవుతుండగా ప్రమాదం..**
మంగళవారం ముంబాయిలో జరిగిన క్యాబినెట్ సమావేశాల్లో పాల్గొన్న అజిత్ పవార్, బుధవారం ఉదయం 8:45 గంటల సమయంలో బారమతి విమానాశ్రయంలో ల్యాండ్ అవుతుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. విమానంలో పవార్‌తో పాటు మరో ఐదుగురు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదంలో విమానంలో ఉన్నవారందరూ అక్కడికక్కడే మృతి చెందినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) అధికారులు ధృవీకరించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం టచ్‌డౌన్ సమయంలో విమానంలో సాంకేతిక లోపం తలెత్తినట్లు తెలుస్తోంది. నియంత్రణ కోల్పోయిన విమానం రన్‌వే సమీపంలో కుప్పకూలి మంటలు చెలరేగాయి. సమాచారం అందగానే ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని రెస్క్యూ, సహాయక చర్యలు చేపట్టాయి. అయితే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రాణాలు కాపాడే అవకాశం లేకపోయింది.

**దిగ్భ్రాంతి వ్యక్తం చేసి సీఎం దేవేంద్ర ఫడ్నవీస్..**
ఈ ఘటనపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కేంద్ర పౌర విమానయాన శాఖ కూడా ప్రత్యేక దర్యాప్తు ప్రకటించింది. అజిత్ పవార్ ఎన్సీపీకి చెందిన సీనియర్ నేతగా, రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తూ వచ్చారు. అనుభవజ్ఞుడైన నాయకుడిగా ఆయనకు విస్తృతమైన రాజకీయ ప్రభావం ఉంది. ఆయన ఆకస్మిక మరణం మహారాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. పార్టీ శ్రేణులు, అభిమానులు, అనుచరులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ ప్రమాదం దేశంలో విమాన భద్రత అంశంపై మరోసారి చర్చకు తెరలేపింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.







# గగనతల విషాదాలు

**విమాన ప్రమాదాల్లో భారత్ కోల్పోయిన ప్రముఖులు**

**ఆందోళన కలిగిస్తున్న గగనతల ప్రయాణాలు**

విమాన ప్రయాణాలు సురక్షితంగా మారినప్పటికీ, కొన్ని దుర్ఘటనలు దేశ చరిత్రలో చెరగని ముద్ర వేశాయి. వివిధ కాలాల్లో జరిగిన విమాన, హెలికాప్టర్ ప్రమాదాల్లో రాజకీయ, శాస్త్రీయ, సినీ, సైనిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు ప్రాణాలు కోల్పోయారు. ఆ విషాద ఘటనలను ఒకసారి తిరిగి చూద్దాం.

**హోమీ జహంగీర్ భాభా (1966) :**

భారత అణు శాస్త్ర పితామహుడు హోమీ జహంగీర్ భాభా 1966 జనవరి 24న విమాన ప్రమాదంలో మృతిచెందారు. ఎయిర్ ఇండియా ఫ్లైట్–101 జెనీవా వెళ్తుండగా, స్విట్జర్లాండ్‌లోని మోంట్ బ్లాంక్ పర్వత ప్రాంతంలో కూలిపోయింది. ఈ ప్రమాదం దేశ శాస్త్రీయ రంగానికి తీరని లోటుగా మారింది.

**సంజయ్ గాంధీ (1980) :**

కాంగ్రెస్ నేత, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ కుమారుడు సంజయ్ గాంధీ 1980 జూన్ 23న ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ విమానాశ్రయం సమీపంలో జరిగిన విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు.

**జీఎంసీ బాలయోగి (2002) :**

అప్పటి లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి 2002 మార్చి 3న కృష్ణా జిల్లా కైకలూరు సమీపంలో ప్రైవేట్ హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందారు.

**సినీ నటి సౌందర్య (2004) :**

ప్రముఖ తెలుగు సినీ నటి సౌందర్య 2004లో కర్ణాటకలో జరిగిన విమాన ప్రమాదంలో ఆమె సోదరుడితో కలిసి మృతిచెందారు. ఈ ఘటన సినీ లోకాన్ని తీవ్రంగా కలిచివేసింది.

**ఓం ప్రకాష్ జిందాల్ (2005) :**

ప్రముఖ పారిశ్రామికవేత్త, హర్యానా మంత్రి ఓం ప్రకాష్ జిందాల్ 2005లో ఢిల్లీ నుంచి చండీగఢ్ వెళ్తుండగా, ఉత్తరప్రదేశ్‌లోని సహారన్‌పూర్ సమీపంలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందారు.

**వైఎస్ రాజశేఖర్ రెడ్డి (2009) :**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2009 సెప్టెంబర్ 2న నల్లమల అటవీ ప్రాంతంలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ప్రతికూల వాతావరణమే ప్రమాదానికి కారణమని దర్యాప్తులో తేలింది.

**దోర్జీ ఖండు (2011) :**

అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి దోర్జీ ఖండు 2011లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు.

**జనరల్ బిపిన్ రావత్ (2021) :**

భారత దేశ తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్, ఆయన భార్యతో సహా మరికొంతమంది 2021లో తమిళనాడులోని కూనూరు సమీపంలో జరిగిన సైనిక హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందారు. ఈ ఘటన దేశ రక్షణ వ్యవస్థకు తీరని లోటుగా మారింది.

**విజయ్‌రుపానీ (2025) :**

2025జూన్ 12న గుజరాత్ లోని అహ్మదాబాద్ లో జరిగి ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ సీఎం విజయ్‌రుపానీ చనిపోయారు. ఇలా రెండు దశాబ్దాల్లో దాదాపు ఆరు విమానా ప్రమాదాల్లో అనేక మంది ప్రముఖులు ప్రాణాలుకోల్పోవడం ఇప్పుడు విమాన ప్రయాణం చర్చనీయాంశంగా మారింది.

## నయీం అక్రమాస్తుల కేసులో
# కీలక మలుపు

**ఈడీ ఛార్జిషీట్‌కు నాంపల్లి కోర్టు గ్రీన్ సిగ్నల్**

**2022లోనే మనీలాండరింగ్ కేసు నమోదు**

**ఇప్పటికే రూ.11.30 కోట్ల విలువైన 35ఆస్తులను గుర్తించిన ఈడీ**

**రాజకీయ నాయకులు, పోలీసు అధికారుల ఆర్థిక లావాదేవీలపైనా ఈడీ ఫోకస్**

**త్వరలోనే పలువురికి నోటీసులు జారీ**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన గ్యాంగ్‌స్టర్ నయీం అక్రమాస్తుల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును వేగవంతం చేసింది. మనీలాండరింగ్ ఆరోపణలపై సుదీర్ఘ విచారణ చేపట్టిన ఈడీ అధికారులు బుధవారం హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో ఛార్జిషీట్‌ను దాఖలు చేశారు. దాన్ని పరిశీలించిన కోర్టు విచారణకు స్వీకరించింది. తెలుగు రాష్ట్రాల్లో ఐశ్వర్యవంతులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులను బెదిరించి కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించిన నయాం 2016 ఆగస్టులో షాద్‌నగర్ సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. అతడి మృతితో బాధితులు పోలీసులకు ఫిర్యాదులు చేయగా, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. ఈ విచారణలో దాదాపు 250 కేసులు నమోదు కాగా, నయాం 27 హత్య కేసులతో పాటు అనేక నేరాలకు పాల్పడ్డట్టు నిర్ధారణ అయింది.

**2022లోనే మనీలాండరింగ్ కేసు నమోదు..**
ఈ నేపథ్యంలోనే ఈడీ 2022 మార్చిలో నయాం అక్రమాస్తులపై మనీలాండరింగ్ కేసును నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. నయాం తన గ్యాంగ్‌తో కలిసి సంపాదించిన ఆస్తులను కుటుంబ సభ్యులు, సన్నిహితుల పేర్లపై బినామీలుగా నమోదు చేసినట్లు ఈడీ గుర్తించింది. హసీనా బేగం, తహీరా బేగం, సలీమా బేగం, అబ్దుల్ సలీం, అహేలాబేగం, సయ్యద్ నిలోఫర్, ఫిర్దోస్ అంజూమ్, మహమ్మద్ ఆరిఫ్, హసీనా కౌసర్ తదితరుల పేర్లపై ఆస్తులు ఉన్నట్లు వెల్లడించింది.

**రూ.11.30 కోట్ల విలువైన 35ఆస్తులను గుర్తించిన ఈడీ**
దర్యాప్తులో భాగంగా సుమారు రూ.11.30 కోట్ల విలువైన 35ఆస్తులను ఈడీ గుర్తించి, పది మందిపై అభియోగాలు మోపింది. ఇందులో యాదాద్రి భువనగిరి జిల్లాలోని షాపింగ్ కాంప్లెక్స్‌లు, వ్యవసాయ భూములు కూడా ఉన్నాయి. పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ నిందితులు విచారణకు హాజరుకాకపోవడం, ఆదాయపు పన్ను రిటర్నులు (ఐటీఆర్) దాఖలు చేయకపోవడంతో ఈడీ కఠిన చర్యలకు సిద్ధమైంది. అవసరమైతే నాన్–బెయిలబుల్ వారెంట్లు జారీ చేయాలంటూ కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం.

**త్వరలోనే పలువురికి నోటీసులు జారీ..**
మరోవైపు నయాంకు సహకరించిన కొందరు రాజకీయ నాయకులు, పోలీసు అధికారుల ఆర్థిక లావాదేవీలపై కూడా ఈడీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. అక్రమంగా సంపాదించిన సొమ్ము ఎక్కడికి చేరిందనే కోణంలో విచారణ కొనసాగుతోంది. తాజాగా ఛార్జిషీట్‌ను కోర్టు స్వీకరించడంతో నిందితులకు త్వరలోనే నోటీసులు జారీ అయ్యే అవకాశముందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# ఎన్నికల నిబంధనలు పాటించాలి

## కలెక్టర్ ఆదర్శ్ సురభి

**ముద్ర, వనపర్తి :**
మునిసిపల్ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో, ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిందని రాజకీయ పార్టీలు నియమావళి, నిబంధనలకు కట్టుబడి ఉండాలని జిల్లా ఎన్నికల అథారిటీ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఎన్నికల నిబంధనల పై అవగాహన కల్పించేందుకు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతి నిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 5 మున్సిపాలిటీల పరిధిలో 80 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థులు జనవరి 28 నుంచి 30వ తేదీ వరకు నామినేషన్లు వేసుకోవచ్చని, ఉదయం 10: 30నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నిర్దేశించిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లు వేసుకోవాల్సిందిగా సూచించారు. నామినేషన్లు వేయడానికి చివరి తేదీ జనవరి 30, సాయంత్రం 5:00 గంటల వరకు మాత్రమే అని తెలిపారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో రిటర్నింగ్ అధికారి గదిలోకి అభ్యర్థితోపాటు గరిష్టంగా ముగ్గురు సభ్యులకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. అభ్యర్థిని ప్రతిపాదించే వ్యక్తి తప్పనిసరిగా అదే వార్డుకు చెందిన ఓటరై ఉండాలని, పోటీ చేసే అభ్యర్థి సదరు మున్సిపాలిటీ పరిధిలోని ఏ వార్డు ఓటరైనా అయి ఉండవచ్చని తెలిపారు. జనవరి 31న నామినేషన్ల పరిశీలన స్క్రూటినీటీ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 11న పోలింగ్ జరుగుతుందని, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు నిర్వహించబడుతుందని తెలియజేసారు. వార్డు స్థానాలకు పోటీ చేయు అభ్యర్థులు నామినేషన్ వేయడానికి జనరల్ అభ్యర్థి కి రూ.2500, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ. 1,250 డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. పోటీ చేసే అభ్యర్థులు ఏదైనా రిజిస్టర్డ్ బ్యాంకులో కొత్తగా బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసి ఆ ఖాతా నుంచి మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు రాజకీయ పార్టీలన్నీ సహకరించాలని కలెక్టర్ కోరారు. ఎన్నికల ప్రచారం కోసం సంబంధిత పార్టీల అభ్యర్థులు ముందస్తుగా తహసిల్దార్ నుంచి అనుమతులు తీసుకోవాలని సూచించారు. సంబంధిత రాజకీయ పార్టీల అభ్యర్థులు నామినేషన్ విత్ డ్రా చేసుకునే నాటి కల్లా ఫామ్ బి సమర్పించేలా చూసు కోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని సూచించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, వివిధ రాజకీయ పార్టీల ప్రతి నిధులు, తదితరులు పాల్గొన్నారు.





## డివైడర్‌ను ఢీకొని బోల్తా పడిన
# పాఠశాల బస్సు

**ముద్ర, బండ్లగూడ:**
వేగంగా వచ్చిన పాఠశాల బస్సు డివైడర్‌ను ఢీకొని రోడ్డుకు అవతలి వైపు ఎగిరి బోల్తా పడిన ఘటన బండ్లగూడ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. బండ్లగూడ జాకీర్‌లో క్రాంతి చంద్ర 'హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్' పేరుతో పాఠశాల నిర్వహిస్తున్నాడు. త్వరలో నిర్వహించనున్న పాఠశాల సాంస్కృతిక కార్యక్రమాల కోసం అజీజ్‌నగర్‌లోని చాందిని గార్డెన్‌లో సాధన చేసేందుకు విద్యార్థులు పాఠశాల బస్సుల్లో వెళ్లారు. సాధన ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో మృగవని రిసార్ట్స్ ముందు బస్సు డివైడర్‌ను ఢీకొని ఎగిరి రోడ్డుకు అవతలి వైపు బోల్తా కొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే బస్సులో ఇరుక్కున్న విద్యార్థులు ఆర్తనాదాలు చేయగా, అక్కడున్న వాహనదారులు బస్సు అద్దాలను పగలగొట్టి చిన్నారులను బయటకు తీశారు. గాయపడిన విద్యార్థులను వెంటనే సమీపంలోని ఖాళీ మందిర్ వద్ద ఉన్న షాదన్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. సమాచారం అందుకున్న కమిషనర్‌తోపాటు పోలీసు అధికారులు, స్థానిక నాయకులు ఆసుపత్రికి చేరుకుని చిన్నారులను పరామర్శించారు.



# పేటలో రెండు నామినేషన్లు దాఖలు

**ముద్ర, నారాయణపేట :**
నారాయణపేట మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని 18, 20 వార్డులకు గాను ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల స్వీకరణ ప్రారంభానికి ముందు కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ డా. వినీత్ కుమార్ నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. గురువారం పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలయ్యే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధాన రాజకీయ పార్టీలలో ఇప్పటివరకు కొద్ది వార్డులకే అభ్యర్థుల పేర్లు ప్రకటించడంతో, మిగిలిన వార్డుల అభ్యర్థులు అయోమయంలో ఉన్న పరిస్థితి నెలకొంది. దీంతో పలువురు ఆశావహులు నామినేషన్ ప్రక్రియపై ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. బీజేపీలో చైర్మన్ అభ్యర్థి ప్రకటన అంశంపై పలువురు కౌన్సిలర్ అభ్యర్థుల మధ్య అంతర్గతంగా కోల్డ్ వార్ వాతావరణం నెలకొన్నట్లు తెలుస్తోంది. పార్టీ బీ–ఫాం దక్కించుకునేందుకు అభ్యర్థులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. ఇదిలా ఉండగా, కొన్ని వార్డుల్లో అభ్యర్థులు ఇప్పటికే ప్రచారాన్ని కూడా ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో మున్సిపల్ ఎన్నికల వేడి మొదలైంది.



# పార్కు స్థలాలను కాపాడండి

**ముద్ర, బండ్లగూడ :**
పార్కులు, ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన స్థలాలను కబ్జాదారుల నుంచి విముక్తి చేసి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని శ్రీ రామ్ నగర్ కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాలనీలో కేటాయించిన పార్కు స్థలాలు, వాణిజ్య సముదాయాల భవనాలను పరిరక్షించాలని కోరుతూ నార్సింగి డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. సర్వే నంబర్లు 300 నుంచి 315 వరకు ఉన్న మొత్తం 85 ఎకరాల స్థలంలో 1991లో హుడా అనుమతులతో వెంచర్ ఏర్పాటు చేశారని తెలిపారు. అప్పట్లో క్రీడాస్థలాల కోసం నాలుగు ప్రాంతాల్లో మొత్తం 6,058 చదరపు గజాల స్థలాన్ని యజమానులు కేటాయించారని పేర్కొన్నారు. 1993లో 11194/1993 రిజిస్ట్రేషన్ నెంబర్ డాక్యుమెంట్ ద్వారా గ్రామ పంచాయతీకి గిఫ్ట్ డీడ్‌గా అప్పగించినట్లు వివరించారు. అయితే ప్రస్తుతం ఈ స్థలాల్లో 3 పార్కులు అక్రమ కబ్జాలకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వాణిజ్య సముదాయాల కోసం కేటాయించిన 8,174 చదరపు గజాల స్థలాన్ని కూడా కబ్జా చేశారని ఆరోపించారు. ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన ఈ స్థలాలను వెంటనే కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకుని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడం బాధాకరమని, ఇదే పరిస్థితి కొనసాగితే తీవ్ర పరిణామాలు తప్పవని వారు హెచ్చరించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
29.01.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ప్రపంచ ప్రసిద్ధ గొప్ప జాతరలు**

హజ్ యాత్ర (సౌదీ అరేబియా): ముస్లింల అత్యంత పవిత్రమైన ఈ యాత్రకు మక్కా నగరం వేదికగా నిలుస్తుంది. ప్రపంచం నలుమూలల నుండి లక్షలాది మంది యాత్రికులు తరలివచ్చి ఒకే చోట ప్రార్థనలు నిర్వహించే అద్భుత ఆధ్యాత్మిక దృశ్యం ఇక్కడ కనిపిస్తుంది.



# టీ20 ర్యాంకింగ్స్‌లో భారత్ హవా..

## నంబర్ వన్‌గా అభిషేక్ శర్మ, టాప్ 10లోకి సూర్యకుమార్ యాదవ్




ముద్ర, స్పోర్ట్స్ డెస్క్

2026 ఐసీసీ టీ20 ప్రపంచ కప్‌కు ఇంకా సమయం ఉన్నప్పటికీ, టీం ఇండియా ఇప్పటికే బలమైన సంకేతాలు ఇస్తోంది. ముఖ్యంగా బ్యాటింగ్ విభాగంలో భారత ఆటగాళ్ల ప్రదర్శన ప్రత్యర్థి జట్లకు హెచ్చరికగా మారింది. న్యూజిలాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ కివీస్ బౌలర్లను పూర్తిగా వెనక్కి నెట్టేస్తున్నారు. ఈ ప్రభావం తాజాగా విడుదలైన ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో స్పష్టంగా కనిపించింది.

బుధవారం (జనవరి 28) విడుదలైన తాజా ఐసీసీ టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో అభిషేక్ శర్మ తన నంబర్ వన్ స్థానాన్ని మరింత బలపరిచాడు. వరుసగా భారీ స్కోర్లు నమోదు చేస్తూ, పవర్‌ప్లేలో ప్రత్యర్థి బౌలింగ్‌పై ఆధిపత్యం చెలాయించడం ఆయనకు ప్రత్యేక గుర్తింపుగా మారింది. ముఖ్యంగా స్ట్రైక్ రేట్‌తో పాటు స్థిరత్వం కూడా చూపించడం వల్ల ర్యాంకింగ్ పాయింట్లలో ఆయనకు స్పష్టమైన ఆధిక్యం లభించింది.

అభిషేక్ శర్మ ప్రదర్శన టీం ఇండియాకు శుభారంభాలను అందించడమే కాకుండా, మిడిల్ ఆర్డర్‌పై ఒత్తిడిని తగ్గిస్తోంది. యువ ఆటగాడిగా అంతర్జాతీయ స్థాయిలో ఇంత వేగంగా ఎదగడం భారత క్రికెట్ భవిష్యత్తుకు మంచి సూచనగా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచ కప్‌కు ముందు నంబర్ వన్ బ్యాటర్‌గా కొనసాగడం ఆయన ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచే అంశంగా మారింది.

ఇదే ర్యాంకింగ్స్‌లో భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ టాప్ 10లోకి తిరిగి ప్రవేశించడం మరో ముఖ్య పరిణామం. గత కొంతకాలంగా ఫామ్‌లో హెచ్చుతగ్గులు ఎదుర్కొన్న సూర్యకుమార్, న్యూజిలాండ్ సిరీస్‌లో తన సహజమైన ఆడకాన్ని ప్రదర్శిస్తూ కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు. వినూత్న షాట్లు, 360 డిగ్రీ బ్యాటింగ్‌తో మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నాడు.

కెప్టెన్‌గా జట్టును ముందుండి నడిపిస్తూ, అదే సమయంలో బ్యాటింగ్‌లోనూ బాధ్యత తీసుకోవడం సూర్యకుమార్ యాదవ్ బలంగా మారింది. టాప్ 10లోకి ఆయన చేరడం భారత జట్టుకు అదనపు బలం చేకూర్చుతోంది. ముఖ్యంగా మిడిల్ ఆర్డర్‌లో అనుభవం కలిగిన ఆటగాడు ఫామ్‌లో ఉండటం, పెద్ద టోర్నీల్లో విజయాలకు కీలకంగా మారుతుంది.

మొత్తంగా తాజా ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అభిషేక్ శర్మ నంబర్ వన్‌గా కొనసాగడం, సూర్యకుమార్ యాదవ్ టాప్ 10లోకి రావడం టీం ఇండియా శక్తిని ప్రతిబింబిస్తోంది. 2026 టీ20 ప్రపంచ కప్ లక్ష్యంగా భారత జట్టు సరైన దిశలో సాగుతోందన్న సంకేతాలను ఇవి స్పష్టంగా ఇస్తున్నాయి. బ్యాటింగ్ విభాగం ఈ స్థాయిలో నిలకడగా కొనసాగితే, రాబోయే రోజుల్లో భారత్‌కు మరిన్ని విజయాలు దక్కే అవకాశాలు మెండుగా ఉన్నాయన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

# నక్వీ బెదిరింపులు.. ముప్పు ముంగిట పీసీబీ

- **టీ20 ప్రపంచకప్ బహిష్కరణ ప్రకటనలతో పాకిస్థాన్ క్రికెట్ భవిష్యత్తుపై నీలినీడలు**



ముద్ర, స్పోర్ట్స్ డెస్క్

టీ20 ప్రపంచకప్-2026ను బహిష్కరిస్తామంటూ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు పదే పదే చేస్తున్న ప్రకటనలు ఇప్పుడు ఆ దేశ క్రికెట్ భవిష్యత్తునే ప్రమాదంలోకి నెడుతున్నాయి. బంగ్లాదేశ్‌ను టోర్నమెంట్ నుంచి తప్పించిన నిర్ణయానికి నిరసనగా ఈ బెదిరింపులు కొనసాగుతుండగా, ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ కూడా పాకిస్థాన్‌పై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది.

ఈ నేపథ్యంలో పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నక్వీ ప్రధాని షహబాజ్ షరీఫ్‌ను కలిసిన అనంతరం, శుక్రవారం లేదా సోమవారం తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. అయినా బెదిరింపు వ్యాఖ్యలు కొనసాగుతుండటంతో, పాకిస్థాన్ మాజీ క్రికెటర్లు బహిరంగంగా నక్వీపై విమర్శలు గుప్పిస్తున్నారు.

ఇంజమామ్ ఉల్ హక్, మహ్మద్ యూసుఫ్, మొహ్సిన్ ఖాన్ వంటి దిగ్గజాలు, నక్వీ నిర్ణయాలు పాకిస్థాన్ క్రికెట్‌ను ప్రమాదంలోకి నెడుతున్నాయంటూ మండిపడ్డారు.మాజీ కెప్టెన్ మహ్మద్ హఫీజ్‌తో పాటు పీసీబీ మాజీ చైర్మన్ ఖాలిద్ మహ్మూద్, మాజీ కార్యదర్శి ఆరిఫ్ అలీ అబ్బాసీ కూడా జట్టును ప్రపంచ కప్‌కు పంపకపోవడానికి సరైన కారణమే లేదని స్పష్టం చేశారు.

**శ్రీలంక అంశాన్ని ఎందుకు విస్మరిస్తున్నారు?**

ఆరిఫ్ అలీ అబ్బాసీ మాట్లాడుతూ, బంగ్లాదేశ్‌కు మద్దతు ఇవ్వడం సమంజసమే అయినా, జట్టును పంపకపోతే పీసీబీకి లాభం ఏముంటుందంటూ ప్రశ్నించారు. ఐసీసీతో పాటు ఇతర సభ్య దేశాలతో సంబంధాలు దెబ్బతింటాయని హెచ్చరించారు. భారత్‌తో మ్యాచ్ సహా శ్రీలంకలో జరగాల్సిన అన్ని మ్యాచ్‌లపై ప్రభావం పడుతుందని తెలిపారు.

**బంగ్లాదేశ్‌కు ఒంటరితనం**

ఖాలిద్ మహ్మూద్ మాట్లాడుతూ, పీసీబీ వైఖరి సూత్రపరంగా ప్రశంసనీయం కావొచ్చని పేర్కొంటూనే, అది పాకిస్థాన్ క్రికెట్ మేలుకు దోహదపడాలని సూచించారు. భారత్‌తో మ్యాచ్ తొలగించాలన్న బంగ్లాదేశ్ డిమాండ్‌కు పాకిస్థాన్ తప్ప మరే దేశం మద్దతుగా నిలబడలేదని గుర్తు చేశారు. ఐసీసీ సమావేశాల్లో కూడా బంగ్లాదేశ్‌కు మద్దతు లభించలేదని తెలిపారు.

**ఏ ఆధారంతో బహిష్కరణ?**

మాజీ టెస్టు బ్యాట్స్‌మన్, మాజీ చీఫ్ సెలెక్టర్, మాజీ హెడ్ కోచ్ మొహ్సిన్ ఖాన్ కూడా జట్టును ప్రపంచకప్‌కు పంపాలని పీసీబీకి పిలుపునిచ్చారు. భారత్‌తో విభేదాలు ఉన్నప్పటికీ, పాకిస్థాన్ అన్ని మ్యాచ్‌లు శ్రీలంకలోనే జరగనున్నాయని గుర్తు చేశారు. బంగ్లాదేశ్ కూడా ఐసీసీ నిర్ణయాన్ని సవాల్ చేయలేదని తెలిపారు. అలాంటప్పుడు పీసీబీ బహిష్కరణ నిర్ణయానికి ఏ ఆధారం ఉందని ప్రశ్నించారు.

ఇంజమామ్ ఉల్ హక్ మాట్లాడుతూ, పాకిస్థాన్ ప్రపంచకప్‌లో పాల్గొనాలని తాను వ్యక్తిగతంగా కోరుకుంటున్నానన్నారు. పెద్ద టోర్నమెంట్లలో జట్టు ఆడటం పాకిస్థాన్ క్రికెట్‌కు అత్యవసరమని స్పష్టం చేశారు.





# అతను గేల్ కన్నా డేంజరస్..

- **శర్మపై: కైఫ్ ప్రశంసలు**

ముద్ర, స్పోర్ట్స్ డెస్క్

టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ దూకుడైన ఆటతీరుపై మాజీ భారత క్రికెటర్ మహమ్మద్ కైఫ్ ప్రశంసల వర్షం కురిపించాడు. వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్‌తో పోల్చుతూ, అభిషేక్ శర్మ ఆట మరింత విధ్వంసకరమని అభిప్రాయపడ్డాడు. గేల్ క్రీజులో సెట్ కావడానికి సమయం తీసుకునేవాడని, అయితే అభిషేక్ తొలి బంతి నుంచే ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడతాడని పేర్కొన్నాడు.న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో అభిషేక్ శర్మ అసాధారణ ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నాడు. తొలి మ్యాచ్‌లో కివీస్ బౌలింగ్‌ను చీల్చి చెండాడిన అతడు, రెండో మ్యాచ్‌లో గోల్డెన్ డక్‌గా వెనుదిరిగినా మూడో టీ20లో మళ్లీ తన అసలైన రూపం చూపించాడు. కేవలం 14 బంతుల్లోనే అర్ధశతకం సాధించి భారత్ తరపున ఈ ఘనత అందుకున్న రెండో బ్యాటర్‌గా నిలిచాడు.

తాజాగా తన యూట్యూబ్ చానల్ వేదికగా మాట్లాడిన మహమ్మద్ కైఫ్... “సాధారణంగా దూకుడుగా ఆడే బ్యాటర్లు స్థిరంగా రాణించలేరు. కానీ అభిషేక్ శర్మ ఈ నియమానికి మినహాయింపు. క్రిస్ గేల్ కూడా పెద్ద షాట్లు ఆడేవాడు కానీ, చాలా ఆలోచనతో బ్యాటింగ్ చేసేవాడు. అవసరమైతే మెయిడిన్ ఓవర్లను కూడా భరించి క్రీజులో నిలదొక్కుకునేవాడు. ముఖ్యంగా బెంగళూరు లాంటి పిచ్‌లపై అతడు చాలా నెమ్మదిగా ఇన్నింగ్స్‌ను ప్రారంభించేవాడు” అని వివరించాడు.

అయితే అభిషేక్ శర్మ పూర్తిగా భిన్నమైన ఆటగాడని కైఫ్ స్పష్టం చేశాడు. “అభిషేక్ సెట్ అయ్యేందుకు సమయం తీసుకోడు. మైదానంలో అడుగుపెట్టిన క్షణం నుంచే భారీ షాట్లకు తెగిస్తాడు. అలాంటి ఆటగాళ్లకు నిలకడ ఉండదని భావిస్తారు. కానీ అభిషేక్ ప్రతి మ్యాచ్‌లోనూ తన సత్తాను నిరూపిస్తున్నాడు. కేవలం 12 నుంచి 14 బంతుల్లోనే 60-70 పరుగులు సాధించడం అతడిని నిజమైన మ్యాచ్ విన్నర్‌గా నిలబెడుతోంది. 2026 టీ20 ప్రపంచకప్‌లో అతడు ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే టీమిండియానే ట్రోఫీని అందుకుంటుంది” అని కైఫ్ ధీమా వ్యక్తం చేశాడు.ఇదిలా ఉండగా, అభిషేక్ శర్మ విధ్వంసకర బ్యాటింగ్, టీమిండియా సమిష్టి ప్రదర్శనతో న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌ను భారత్ ఇప్పటికే 30తో కైవసం చేసుకుంది. నాలుగో మ్యాచ్ విశాఖపట్నం వేదికగా మరికొద్ది గంటల్లో ప్రారంభం కానుంది. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే ఈ మైదానంలో మరోసారి అభిషేక్ సిక్సర్ల వర్షం కురిపిస్తాడని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఓడినా భారత్‌కు సెమీస్ బెర్త్... గెలిచినా పాక్‌కు అనుమానమే?

ముద్ర, స్పోర్ట్స్ డెస్క్

అండర్-19 ప్రపంచకప్ 2026లో సూపర్-6 దశ చివరి మ్యాచ్ భారత్, పాకిస్తాన్ మధ్య జరగనుంది. ఈ మ్యాచ్ ఫలితమే గ్రూప్-2 నుంచి సెమీఫైనల్స్‌కు వెళ్లే జట్లను ఖరారు చేయనుంది. ఈ గ్రూప్‌లో భారత్, ఇంగ్లాండ్, పాకిస్తాన్ జట్లు చివరి నాలుగు స్థానాల రేసులో ఉన్నాయి. అయితే వీరిలో ఇద్దరికే సెమీస్ బెర్త్ దక్కనుంది.

భారత జట్టు ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచ్‌ల్లో అన్నింటిలోనూ గెలిచి అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇంగ్లాండ్ కూడా మూడు విజయాలతో సమానంగా పాయింట్లు సాధించింది. పాకిస్తాన్ మాత్రం మూడు మ్యాచ్‌ల్లో రెండు విజయాలతో మూడో స్థానంలో ఉంది. నెట్ రన్‌రేట్ విషయంలో భారత్ (+3.337) స్పష్టమైన ఆధిక్యంలో ఉండగా, ఇంగ్లాండ్ (+1.989), పాకిస్తాన్ (+1.484) వెనుకబడ్డాయి.

**పాకిస్తాన్‌కు కఠిన సమీకరణాలు**

ఇంగ్లాండ్ తమ చివరి సూపర్-6 మ్యాచ్‌ను న్యూజిలాండ్‌తో ఆడనుంది. ఇప్పటివరకు ఒక్క గెలుపు కూడా నమోదు చేయని న్యూజిలాండ్ ఇప్పటికే టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఒకవేళ ఇంగ్లాండ్ ఓడితే, పాకిస్తాన్‌కు కొంత ఊరట లభిస్తుంది. అప్పుడు భారత్‌పై భారీ తేడాతో గెలిస్తేనే పాక్ సెమీఫైనల్స్ ఆశలు నిలుస్తాయి. కానీ ఇంగ్లాండ్ న్యూజిలాండ్‌ను ఓడిస్తే పరిస్థితి మరింత క్లిష్టమవుతుంది. ఆ గెలుపుతో ఇంగ్లాండ్ సెమీస్ బెర్త్‌ను ఖాయం చేసుకుంటుంది. అప్పుడు భారత్, పాకిస్తాన్ మధ్య నెట్ రన్‌రేట్ పోటీ తేల్చే అంశంగా మారుతుంది. ఈసందర్భంలో పాకిస్తాన్‌కు కేవలం విజయం సరిపోదు...భారత్‌పై భారీ తేడాతో గెలవాల్సిందే.

భారత్ ముందుగా బ్యాటింగ్ చేస్తే, పెద్ద స్కోర్‌ను కట్టడి చేసి 25 ఓవర్లలోపే లక్ష్యాన్ని ఛేదించాల్సి ఉంటుంది. లేదంటే పాకిస్తాన్ ముందుగా బ్యాటింగ్ చేసి భారీ స్కోర్ సాధించి, భారత్‌ను చాలా తక్కువ పరుగులకే పరిమితం చేయాల్సి ఉంటుంది. స్వల్ప తేడాతో గెలిస్తే మాత్రం పాకిస్తాన్ సెమీఫైనల్స్ రేసు నుంచి నిష్క్రమించినట్టే. ఈ నేపథ్యంలో భారత్ ఓడినా సెమీఫైనల్స్‌కు చేరే అవకాశాలు ఎక్కువగా ఉండగా, పాకిస్తాన్ గెలిచినా బెర్త్ అనుమానంగానే మిగలడం ఈ మ్యాచ్‌కు అదనపు ఉత్కంఠను తీసుకొస్తోంది.



# చరిత్ర సృష్టించిన జోకోవిచ్

- **ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లోకి టెన్నిస్ దిగ్గజం**



ముద్ర, స్పోర్ట్స్ డెస్క్

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెర్బియా స్టార్ నోవాక్ జోకోవిచ్ మరో అరుదైన ఘనత సాధించాడు. క్వార్టర్ ఫైనల్‌తో పాటు రౌండ్-16లో ఒక్క సెట్ కూడా గెలవకుండానే సెమీఫైనల్స్‌కు చేరి టెన్నిస్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురి చేశాడు. రాడ్ లావెర్ అరేనాలో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఇటలీ ఆటగాడు లోరెంజో ముసెటి గాయంతో మధ్యలోనే తప్పుకోవడంతో జోకోవిచ్‌కు అనూహ్యంగా సెమీస్ బెర్త్ దక్కింది. వాస్తవానికి మ్యాచ్ ఆరంభం నుంచే ముసెటి పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. తొలి రెండు సెట్లు 64, 63తో గెలిచిన అతను మూడో సెట్‌లోనూ 31 ఆధిక్యంలో ఉన్న దశలో కుడి తొడ కండరాల నొప్పితో ఆట కొనసాగించలేకపోయాడు. దీంతో అయిదో సీడ్ ముసెటి రిటైర్డ్ హర్ట్‌గా మ్యాచ్ నుంచి తప్పుకున్నాడు. ఇదే తరహాలో రౌండ్-16లో కూడా జోకోవిచ్‌కు అదృష్టం కలిసొచ్చింది. ఆ మ్యాచ్‌లో అతని ప్రత్యర్థి జాకబ్ మెన్సిక్ గాయంతో తప్పుకోవడంతో జోకోవిచ్‌కు వాకోవర్ లభించింది. ఈ రెండు మ్యాచుల్లో ఒక్క సెట్ కూడా గెలవకుండానే సెమీస్ చేరడం విశేషంగా మారింది. ఈ విజయంతో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో జోకోవిచ్ 103వ మ్యాచ్ గెలిచాడు. దీంతో మెల్‌బోర్న్ పార్క్‌లో అత్యధిక విజయాల రికార్డును తన పేరిట నమోదు చేసుకొని, రోజర్ ఫెదరర్ రికార్డును అధిగమించాడు. ఇప్పటికే మూడు వేర్వేరు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో వందకు పైగా విజయాలు సాధించిన ఏకైక ఆటగాడిగా జోకోవిచ్ మరోసారి తన స్థాయిని చాటాడు.

# అండర్19 ప్రపంచకప్ షెడ్యూల్‌పై బంగ్లాదేశ్ ఆగ్రహం..

- **ఐసీసీ అన్యాయం చేసిందని ఆరోపణ**

ముద్ర, స్పోర్ట్స్ డెస్క్

బంగ్లాదేశ్ అండర్19 క్రికెట్ జట్టు మరోసారి ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ)తో వివాదంలో నిలిచింది. అండర్19 ప్రపంచకప్ టోర్నమెంట్ నుంచి నిష్క్రమించిన అనంతరం, టోర్నమెంట్ నిర్వహణలో ఐసీసీ తమ జట్టుపై అన్యాయం చేసిందంటూ బంగ్లాదేశ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక ప్రయాణాలు చేయాల్సి రావడంతో ఆటగాళ్లు తీవ్రంగా అలసిపోయారని, అదే తమ ప్రదర్శనపై ప్రతికూల ప్రభావం చూపిందని ఆరోపించింది.బంగ్లాదేశ్ క్రికెట్ అభివృద్ధి సమన్వయకర్త హబీబుల్ బషర్ ఈ విషయంపై స్పందిస్తూ, టోర్నమెంట్ మొత్తం జట్టు ఎడతెరిపిలేని ప్రయాణాలతో ఇబ్బందులు ఎదుర్కొందన్నారు. ఒక వేదిక నుంచి మరో వేదికకు తరచూ వెళ్లాల్సి రావడంతో ఆటగాళ్లపై శారీరకంగా మాత్రమే కాకుండా మానసికంగా కూడా తీవ్రమైన ఒత్తిడి పడిందని తెలిపారు. భారత్‌తో కీలక మ్యాచ్‌కు ముందు ఆటగాళ్లకు విశ్రాంతి అందించేందుకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు సొంత ఖర్చులతో అంతర్గత విమాన ప్రయాణాన్ని ఏర్పాటు చేసిందని వెల్లడించారు. బస్సు ప్రయాణం ఎక్కువ సమయం పట్టడం, నేరుగా విమానాలు పరిమితంగా ఉండటమే ఇందుకు కారణమని చెప్పారు.ఈ ప్రపంచకప్‌లో జట్లు, అధికారులు, సిబ్బందికి దేశీయ విమాన ప్రయాణాలపై ఐసీసీ ఆంక్షలు విధించడంతో అందరూ బస్సుల ద్వారానే ప్రయాణించాల్సి వచ్చిందని బషర్ గుర్తు చేశారు. “ఆటగాళ్లు మరింత అలసిపోకుండా ఉండేందుకే బీసీబీ సొంతంగా విమాన ప్రయాణాన్ని ఏర్పాటు చేయాల్సి వచ్చింది” అని ఆయన స్పష్టం చేశారు.

**షెడ్యూల్ మార్పులపై తీవ్ర అభ్యంతరం**

ఐసీసీ షెడ్యూల్ తమ జట్టుకు తీవ్ర నష్టం చేసిందని బషర్ విమర్శించారు. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మస్వింగోలో రెండు వార్మప్ మ్యాచ్‌లు ఆడి, ఆపై నాలుగు గంటల దూరంలోని బులావాయోకు వెళ్లి గ్రూప్ మ్యాచ్‌లు ఆడాల్సి ఉండేదన్నారు. అయితే చివరి నిమిషంలో ఐసీసీ షెడ్యూల్ మార్చడంతో, వార్మప్ మ్యాచ్‌లే వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించాల్సి వచ్చి, ప్రయాణ భారం మరింత పెరిగిందని తెలిపారు.టోర్నమెంట్ ప్రారంభానికి ముందే ఈ ప్రయాణ సమస్యలపై ఐసీసీకి పలుమార్లు తెలియజేశామని, అనవసర ప్రయాణాలు తగ్గించేలా వార్మప్ మ్యాచ్‌లను ఒకేచోట నిర్వహించాలని కోరినప్పటికీ స్పందన రాలేదని బషర్ పేర్కొన్నారు. టోర్నమెంట్ మొదలైన తర్వాత మార్పులు చేయడం సాధ్యం కాదని ఐసీసీ తెలిపిందని ఆయన వివరించారు.

**ఇతర జట్లకు తక్కువ ప్రయాణ భారం**

బంగ్లాదేశ్‌తో పోలిస్తే ఇతర జట్లకు ప్రయాణ భారం చాలా తక్కువగా ఉందని బంగ్లాదేశ్ అధికారులు పేర్కొన్నారు. భారత్ తన అన్ని వార్మప్ మ్యాచ్‌లు, టోర్నమెంట్ మ్యాచ్‌లను బులావాయోలోనే ఆడిందని గుర్తు చేశారు. ఆస్ట్రేలియా వార్మప్, గ్రూప్ మ్యాచ్‌లన్నింటిని నమీబియాలోని విండ్హోక్‌లో నిర్వహించి, చివరి సూపర్ సిక్స్ మ్యాచ్ కోసం మాత్రమే హరారేకు వెళ్లిందన్నారు. పాకిస్థాన్ గ్రూప్ మరియు ప్రారంభ సూపర్ సిక్స్ మ్యాచ్‌లను హరారేలో ఆడి, చివరి మ్యాచ్‌కు మాత్రమే బులావాయో వెళ్లనుందని తెలిపారు. ఇంగ్లండ్ కూడా ఎక్కువశాతం మ్యాచ్‌లను హరారేలోనే ఆడిందని పేర్కొన్నారు.

ఈ అన్ని అంశాలను పరిశీలిస్తే, ఐసీసీ షెడ్యూల్ వల్లే తమ జట్టుకు అన్యాయం జరిగిందని బంగ్లాదేశ్ స్పష్టం చేసింది. ఈ వ్యవహారం అంతర్జాతీయ క్రికెట్ వర్గాల్లో మరోసారి టోర్నమెంట్ నిర్వహణపై చర్చకు దారితీస్తోంది



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
29.01.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### ప్రపంచ ప్రసిద్ధ గొప్ప జాతరలు

లంతరు పండుగ (చైనా): చైనీస్ నూతన సంవత్సర వేడుకల ముగింపులో ఈ లంతరు పండుగను ఎంతో అందంగా జరుపుకుంటారు. వేలాది రంగురంగుల దీపాలను గాలిలోకి వదులుతూ, డ్రాగన్ నృత్యాలు చేస్తూ ప్రజలు ఈ వేడుకను ఎంజాయ్ చేస్తారు.



## నవ్వుల మోత మోగిస్తున్న 'హే భగవాన్' టీజర్

విభిన్న కథల ఎంపికతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటుడు సుహాస్ మరో కొత్త ప్రయత్నంతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'హే భగవాన్'. ఈ సినిమా ఫిబ్రవరి 20న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై ఆసక్తిని గణనీయంగా పెంచుతోంది. టీజర్‌లో సుహాస్ పోషించిన పాత్రే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. తండ్రి నడుపుతున్న వ్యాపారాన్ని తానే చేపట్టాలనే పట్టుదలతో ఉన్న యువకుడిగా ఆయన కనిపించారు. ఆ క్రమంలో ఎదురయ్యే సంఘటనలను హాస్యాత్మకంగా చూపిస్తూ, తన సహజ నటనతో నవ్వులు పూయించారు.

'ఎంతో మంది ఇళ్లలో దీపాలు వెలిగించాడండీ..' వంటి డైలాగులు, శివాని నాగరం చమత్కార వ్యాఖ్యలు టీజర్‌కు మరింత బలం చేకూర్చాయి. సాధారణ కథాంశాన్ని వినోదాత్మకంగా మలిచిన విధానం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. మొత్తంగా 'హే భగవాన్' టీజర్ పూర్తిస్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌కు సంకేతాలు ఇస్తోంది. సుహాస్ మరోసారి తన నటనతో ప్రేక్షకులను మెప్పిస్తాడన్న నమ్మకాన్ని ఈ టీజర్ బలంగా వ్యక్తం చేస్తోంది.




## అనౌన్స్‌మెంట్‌తోనే చరిత్ర.. #AA23 క్రేజ్ ఆకాశమే హద్దు

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ క్రియేటివ్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో రూపొందనున్న #AA23 చిత్రం అధికారిక ప్రకటన దశలోనే సంచలనం సృష్టిస్తోంది. సినిమా అనౌన్స్ చేసిన క్షణం నుంచే అభిమానుల్లో అంచనాలు అమాంతం పెరిగాయి. విడుదలైన అనౌన్స్‌మెంట్ గ్లింప్స్ సినీప్రేక్షకులను ఆకట్టుకోగా, మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ అందించిన శక్తివంతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సోషల్ మీడియాలో భారీ స్పందనను తెచ్చిపెట్టింది.

షూటింగ్ ఇంకా ప్రారంభం కాకముందే #AA23 అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. కేవలం అనౌన్స్‌మెంట్ థీమ్ మ్యూజిక్‌తోనే ఇన్‌స్టాగ్రామ్‌లో 3.55 లక్షలకుపైగా రీల్స్ రూపొందించబడటం ఇండియన్ సినిమా చరిత్రలోనే తొలిసారి కావడం విశేషం. ఒక సినిమా ప్రకటనకే ఇంతటి స్థాయిలో స్పందన రావడం అంటే ఈ ప్రాజెక్ట్‌పై ఉన్న క్రేజ్ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది.

ప్రస్తుత సోషల్ మీడియా యుగంలో సినిమా ప్రారంభ దశ నుంచే బజ్ క్రియేట్ చేయడం కీలకం. ఆ విషయంలో #AA23 పూర్తి స్థాయిలో సక్సెస్ సాధించిందనే చెప్పాలి. అల్లు అర్జున్ మాస్ ఇమేజ్, లోకేష్ కనగరాజ్ స్టైలిష్ మేకింగ్, అనిరుధ్ హై ఎనర్జీ సంగీతం కలిసి పవర్‌ఫుల్ కాంబినేషన్‌గా మారాయి. అందుకే ఈ గ్లింప్స్ అభిమానులతో పాటు సాధారణ ప్రేక్షకులను కూడా విస్తృతంగా ఆకట్టుకున్నాయి.

ఇదిలా ఉండగా, ఈ చిత్రం లోకేష్ కనగరాజ్ ఎంతో కాలంగా కలలుకంటున్న 'ఇరుంబుకై మాయావి' ప్రాజెక్ట్‌నే అన్న ప్రచారం ఇండస్ట్రీలో ఊపందుకుంది. భారీ యాక్షన్, ఇంటెన్స్ డ్రామా, డార్క్ టోన్‌తో సాగే కథాంశంతో ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకులను అలరించనుందనే అంచనాలు ఉన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించనుండగా, 'పుష్ప 2' అనంతరం అల్లు అర్జున్ నుంచి రాబోతున్న మరో విజువల్ స్పెక్టాకిల్‌గా #AA23 నిలవనుందనే టాక్ వినిపిస్తోంది. అనౌన్స్‌మెంట్‌తోనే రికార్డులు సృష్టించిన ఈ సినిమా, థియేటర్లలోకి వచ్చినప్పుడు ఇంకెన్ని సంచలనాలకు నాంది పలుకుతుందో చూడాలి





## ఆర్డర్లు పెట్టి ఇలా టార్చర్ చేస్తున్నారేంట్రా

- మారుతికి చుక్కలు చూపిస్తున్న రెబల్ ఫ్యాన్స్...



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా, మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన 'ది రాజా సాబ్' చిత్రం ఇటీవల విడుదలై బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో స్పందన రాబట్టలేకపోయింది. మిశ్రమ ఫలితాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చిన ఈ సినిమా ఫలితం ప్రభాస్ అభిమానుల్లో అసంతృప్తిని రేకెత్తించింది. ఆ అసంతృప్తి ఇప్పుడు దర్శకుడు మారుతిని లక్ష్యంగా చేసుకుని వినూత్న నిరసనలకు దారి తీస్తుండటం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

సినిమా విడుదలకు ముందు నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మారుతి సరదాగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఆయన్ని ఇబ్బందికర పరిస్థితిలోకి నెట్టాయి. "సినిమా నచ్చకపోతే కొండాపూర్‌లోని నా ఇంటికే వచ్చేయండి, మాట్లాడుకుందాం" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలను కొంతమంది అభిమానులు సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కొందరు అభిమానులు నేరుగా ఆయన ఇంటికి చేరుకున్నారని సమాచారం. అయితే భద్రతా కారణాలతో సెక్యూరిటీ సిబ్బంది వారిని లోపలికి అనుమతించలేదు.

ఇక్కడితో ఆగని అభిమానులు తమ నిరసనను భిన్నమైన మార్గంలో కొనసాగిస్తున్నారు. దర్శకుడి ఇంటి అడ్రస్‌ను ఉపయోగించి ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ యాప్స్‌లో భారీగా ఆర్డర్లు పెడుతున్నారని తెలుస్తోంది. జొమాటో, స్విగ్గీతో పాటు జెప్టో వంటి ప్లాట్‌ఫామ్స్‌లో వందల సంఖ్యలో ఆర్డర్లు బుక్ చేసి, వాటన్నింటినీ క్యాష్ ఆన్ డెలివరీ విధానంలో పంపిస్తున్నారు. ఫలితంగా డెలివరీ సిబ్బందిని వెనక్కి పంపించాల్సిన పరిస్థితి ఏర్పడి, భద్రతా సిబ్బందికి తలనొప్పిగా మారిందని సమాచారం.

సినిమా ఫలితంపై అసంతృప్తిని వ్యక్తం చేసే విధానం ఇప్పుడు హద్దులు దాటుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ వింత నిరసనలపై దర్శకుడు మారుతి ఎలాంటి స్పందన ఇస్తారన్నది ఆసక్తిగా మారింది. అదే సమయంలో, అభిమానులు తమ భావోద్వేగాలను బాధ్యతాయుతంగా వ్యక్తం చేయాలన్న సూచనలు కూడా వినిపిస్తున్నాయి.

## రామ్ చరణ్ 'పెద్ది'కి కొత్త టార్గెట్?.. రిలీజ్ డేట్‌పై హాట్ టాక్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ చిత్రం 'పెద్ది'పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో రామ్ చరణ్ మాస్ లుక్‌లో కనిపించనున్నాడన్న ప్రచారం అభిమానుల్లో హైప్‌ను మరింత పెంచింది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, అప్డేట్స్ సినిమాపై ఆసక్తిని కొత్త స్థాయికి తీసుకెళ్లాయి.

ముందుగా ఈ చిత్రాన్ని 2026 మార్చి 27న విడుదల చేస్తామని చిత్రబృందం ప్రకటించినప్పటికీ, తాజా పరిస్థితులను బట్టి ఆ డేట్‌కి సినిమా థియేటర్లకు రావడం కష్టమేనన్న టాక్ వినిపిస్తోంది. షూటింగ్ ఇంకా పూర్తికాకపోవడం, కీలక షెడ్యూల్స్ మిగిలి ఉండటం, అలాగే భారీ విజువల్ ఎఫెక్ట్స్‌తో కూడిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఎక్కువ సమయం తీసుకునే అవకాశాలు ఉండటమే ఇందుకు కారణమని సమాచారం.

ఇదిలా ఉండగా, తెలంగాణలో టికెట్ రేట్ల అంశం కూడా రిలీజ్ ప్లానింగ్‌పై ప్రభావం చూపే అవకాశముందని తెలుస్తోంది. అందుకే అన్ని అంశాలు అనుకూలంగా ఉన్నప్పుడు మాత్రమే సినిమాను విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారట.ఈ నేపథ్యంలో 'పెద్ది'ని 2026 దసరా పండుగకు విడుదల చేయాలనే ఆలోచనలో చిత్రబృందం ఉన్నట్టు సోషల్ మీడియాలో బజ్ నడుస్తోంది. మాస్ సినిమాలకు దసరా సీజన్ అనుకూలంగా ఉండటంతో, రామ్ చరణ్ మాస్ అవతారానికి అదే సరైన టైమ్ అవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



## 'పాదయాత్ర' సెట్స్‌లో మమ్ముట్టికి ఘన సన్మానం

మలయాళ సినీ పరిశ్రమకు మెగాస్టార్‌గా గుర్తింపు పొందిన మమ్ముట్టికి కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. దాదాపు నాలుగు దశాబ్దాలుగా సినిమా రంగంలో ఆయన అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ గౌరవాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. భారత ప్రభుత్వం 2026 గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశంలోనే మూడవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్‌ను మమ్ముట్టికి కేటాయించడంతో సినీ వర్గాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ శుభవార్త వెలువడిన వెంటనే, ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'పాదయాత్ర' సినిమా షూటింగ్ సెట్స్‌లో చిత్ర బృందం ప్రత్యేకంగా వేడుకలు నిర్వహించింది.షూటింగ్ విరామ సమయంలో మమ్ముట్టిని ఘనంగా సన్మానిస్తూ, ఆయన సినీ ప్రస్థానాన్ని కొనియాడింది. పద్మభూషణ్ పురస్కారం రావడంతో సెట్స్‌లో పండుగ వాతావరణం నెలకొనగా, సహనటులు, సాంకేతిక నిపుణులు తమ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మమ్ముట్టి చేసిన కృషిని, సినిమా రంగానికి ఆయన చేసిన సేవలను చిత్ర బృందం ప్రశంసించింది.







## ప్యారిస్‌లో ఈషా గుప్తా ఫ్యాషన్ స్టేట్‌మెంట్

బోల్డ్, స్టైలిష్ లుక్స్‌తో ఎప్పుడూ ఆకట్టుకునే నటి ఈషా గుప్తా మరోసారి తన ఫ్యాషన్ సెన్స్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. ప్యారిస్ ఫ్యాషన్ వీక్ సందర్భంగా జార్జెస్ హోబికా స్ప్రింగ్/సమ్మర్ 2026 హాట్ కౌట్యూర్ షోకు హాజరైన ఈషా, కౌట్యూర్ గ్లామర్‌ను కొత్తగా ఆవిష్కరించింది.ఈ సందర్భంగా కలెక్షన్‌లోని పౌడర్ బ్లూ గౌన్‌ను ధరించిన ఈషా గుప్తా, సున్నితమైన రంగు, మృదువైన ఫ్యాబ్రిక్‌తో ప్రత్యేకంగా నిలిచింది. అదనపు ఆభరణాలు లేకుండా మినిమల్ స్టైలింగ్‌ను ఎంచుకున్న ఆమె, ఆత్మవిశ్వాసభరితమైన హావభావాలతో ప్యారిస్ వెలుగుల్లో క్లాసీగా కనిపించింది.

## షారారాత్ వైరల్ గర్ల్... దశ తిరిగేనా?

బాలీవుడ్ వెబ్ సిరీస్‌లు, టాలీవుడ్ చిత్రాల్లో దాదాపు పదేళ్లుగా నటిస్తూ వచ్చిన ఆయేషా ఖాన్ ఒక్కసారిగా లైమ్‌లైట్‌లోకి వచ్చింది. ముఖచిత్రం, ఓం భీమ్ బుష్ వంటి చిత్రాల్లో అతిథి పాత్రలతో కనిపించిన ఆమెకు నిజమైన బ్రేక్ గతేడాది దురంధర్ చిత్రంలోని 'షారారత్' పాటతో లభించింది. ఈ పాట సోషల్ మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఆయేషా పేరు దేశవ్యాప్తంగా మార్మోగింది.

'షారారత్' విజయం తర్వాత ఆయేషా ఖాన్ ట్రెండింగ్‌లో నిలుస్తూ, ప్రేక్షకుల్లో గట్టి అభిమానాన్ని సంపాదించుకుంది. గ్లామర్, డాన్స్ నైపుణ్యం, తెరపై ఆకర్షణీయమైన హావభావాలతో ఆమె ప్రత్యేక గుర్తింపు పొందింది. ప్రస్తుతం కొత్త అవకాశాలు ఆమెను వరుసగా వెతుక్కుంటూ వస్తుండటంతో, ఆయేషా ఖాన్ కెరీర్ మరో మెట్టుకు చేరుతుందనే అభిప్రాయం వినిపిస్తోంది

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com